మానుల్
గత నాలుగేళ్లలో
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 181 పేజీలు: 10+4 వెల: 6.50


**అసోంలో వరద బీభత్సం.. 78 మంది మృతి** 3లో

**జంతర్‌మంతర్ నిరసనలో 2873 మంది నేరస్తులు** 5లో

# గలగలా గోదారి బిరబిరా కృష్ణమ్మ



కడెం ప్రాజెక్టులో 11 గేట్లు ఎత్తి నీటిని విడుదలచేస్తున్న దృశ్యం



నారాయణ్‌పూర్ జలాశయం వద్ద వరద ఉధృతి దృశ్యం



జూరాల ప్రాజెక్టులో 10 గేట్లు ఎత్తి నీటిని విడుదలచేస్తున్న దృశ్యం

## వరదగూడులా జలాశయాలు

### జూరాల 10 గేట్లు, కడెం 11 గేట్లు ఎత్తివేత

### తాలిపేరులో 24 గేట్ల నుంచి వరద ప్రవాహం

### పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

**హైదరాబాద్, జులై 30,ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండ ప్రభావంతో తెలంగాణలో వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లోని జలాశయాల్లోకి పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరుతోన్నది. గోదావరి బేసిన్‌లో కడెం,మేడిగడ్డ,తాలిపేరు జలాశయాల గేట్లు ఎత్తిపెట్టారు. చత్తీస్‌ఘడ్‌లో కురుస్తున్న వర్షానికి తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు 74217 క్యూసెక్కుల వదర వస్తుండటంతో 9గేట్లను ఏడు అడుగులు 13గేట్లను పూర్తిగా తెరిచి 71457 క్యూసెక్కుల వరదను కిందికి వదులుతున్నారు. కడెంజలాశయం 11గేట్లు ఎత్తి 91వేల క్యూసెక్కులు >>2



# 'పరీక్షల' బిల్లుకు 'పెద్దలు' సై

- రాజ్యసభలోను ఆమోదం పొందిన యాంటీ పేపర్ లీక్ బిల్లు
- లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం

**న్యూఢిల్లీ,జులై 30:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ఎనిమిదో రోజు గురువారం కూడా ప్రతిపక్ష ఆందోళనలతో ఉభయ సభలు పలుమార్లు అంతరాయానికి గురయ్యాయి. జులై 20న విద్యార్థుల నిరసన ర్యాలీపై పోలీసులు చేపట్టిన చర్యలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ, రాజ్యసభల్లో నిరసనలు వ్యక్తం చేశారు. ఈ పరిణామాల మధ్య రాజ్యసభ ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నివారణ) సవరణ బిల్లు-2026కు ఆమోదం తెలిపింది. ఈ బిల్లును ఇప్పటికే లోక్‌సభ ఆమోదించింది. బిల్లుపై జరిగిన చర్చలో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆందోళనలను తాత్కాలికంగా శాంతింపజేయడానికే ప్రభుత్వం ఈ >>2

**వందేమాతరం బిల్లుకు పార్లమెంటు ఆమోదం** 5లో

# నాణ్యమైన విద్యకోసం దీక్ష

### ఉపాధ్యాయులు ఉద్యమ స్ఫూర్తితో దీక్ష పట్టాలి

### మండలం యూనిట్‌గా ప్రణాళికలు పంపండి

### విదేశవిద్యకు యేటా 10-15 మంది టీచర్ల ఎంపిక

### 2034దాకా ముఖ్యమంత్రిగా నేనే

### ఉపాధ్యాయుల సమావేశంలో సిఎం రేవంత్



విదేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులను గురువారం సత్కరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై30:** నాణ్యమైన విద్య రాష్ట్రానికి పునాది అయితే, నైపుణ్యాలు అంతస్తుల్లాంటివని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న ఐదేళ్ల ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తామనే దీక్షను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. 'టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ఎంసీహెచ్ఆర్డీలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కొందరు విద్యా శాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని విమర్శిస్తున్నారని, నర్సరీ నుంచి 12 వతరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నందుకా? టీచర్ల నియామకం, ప్రమోషన్లు సక్రమంగా చేపట్టినందుకా? ఐటిఐలను ఎటిసిలుగా మార్చినందుకా? స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా? ప్రపంచంలోనే సక్సెస్ అయిన కార్పొరేట్ సంస్థల యజమానులను స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మెంబర్స్‌గా నియమించినందుకా? ఎందుకు తాను రాజీనామా చేయాలో వాళ్ల తెలపాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం, రాజకీయం కోసం తాను పని చేయడం లేదని సిఎంఅన్నారు. ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీ పడాలనేదే తన లక్ష్య మన్నారు. సమాజ మార్పునకే తాను విద్యా శాఖ బాధ్యతలు తీసుకున్నానని తెలిపారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1.08 లక్షలు వ్యయం చేస్తున్నామని, దానిని వారి అభివృద్ధికి పెట్టే పెట్టుబడిలా చూడాలన్నారు. అంత మొత్తం ఖర్చు చేస్తున్నా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ఎందుకు వెళుతున్నారో ఆలోచించాలన్నారు. తెలంగాణలో ప్రపంచ >>2

**ఆర్గానిక్‌సాగు దిశగా రైతు బాట: సిఎం** 6లో



## ఉద్యోగులకు మరో రూ. 2వేల కోట్లు


### 100 రోజుల్లో 6 వేల కోట్లు చెల్లింపు

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో రూ.6,000 కోట్ల బకాయిలను విడుదల చేస్తామన్న మాటను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతూ తమ చిత్త శుద్ధిని మరో సారి చాటుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ ఒడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు >>2

# అక్రమ రైస్‌మిల్లర్లపై కొరడా

### రూ. 154 కోట్ల ధాన్యం పక్కదారిలోకి..

### విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి తనిఖీలు



గురువారం మెదక్‌లోని రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

**హైదరాబాద్,జులై 30,ప్రభాతవార్త:** ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం రైసుమిల్లులకు అప్పగించిన ధాన్యం పక్కదారి పట్టించి కోట్లకు పడగలెత్తుతున్న వరంగల్, మహబూబ్‌నగర్ జగిత్యాల, నల్లగొండ, సూర్యపేట, మెదక్ జిల్లాలోని రైసు మిల్లర్లపై విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం అధికారులు ఏకకాలంలో మెరుపుదాడులు చేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ధాన్యం నిల్వలను తనిఖీ స్థానిక అధికారులకు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీచేశారు. రైసుమిల్లులపై గత కొద్ది సంవత్సరాల్లో విజిలెన్స్ తనిఖీలు చేసినా ఒకే రోజు ఇంత పెద్దమొత్తం ధాన్యం పక్కదారి పట్టించినట్లు గుర్తించడం ఇదే మొదటిసారిగా రికార్డుకెక్కింది. రూ.154కోట్ల విలువ గలిగిన 68వేల మెట్రిక్ టన్నులధాన్యం రైసు మిల్లులు పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం ఇచ్చిన ధాన్యం పక్కదారి పట్టించారనే అనుమానంతో హనుమకొండ జిల్లాలోని ఒక రైసుమిల్లు, ములుగుజిల్లాలోని ఒక రైసుమిల్లుపై మెరుదాడి చేసి స్టాకు తనిఖీ చేయగా ఆ రెండు మిల్లులలో రూ.12 కోట్ల ధాన్యంను పక్కదారిపట్టినట్లు అధికారులు గుర్తించారు. జగిత్యాలలో ఒకే యజమానికి చెందిన మూడు రైసు మిల్లులో తనిఖీ చేయాగా 80కోట్ల ధాన్యం పక్కదారి పట్టించినట్లు అధికారులు నిర్ధారించారు. మహబూబనగర్ జిల్లాలో ఒక మిల్లు, >>2

**దొర్లిపడ్డాయని దోచేశారు..** 3లో



# అత్యంత భారీ వర్షాలు

### పది జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్

### ఆసిఫాబాద్‌లో అత్యధికంగా 12.14 సెం.మీ

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త :** ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు తెలంగాణలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలుజిల్లాకు రెడ్, ఆరంజ్, ఎల్లో ఎలర్ట్ లను జారీ అయ్యాయి. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో సాధారణం కంటే 30 లోటు వర్షపాతం నమోదుకాగా, గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న విస్తారమైనవర్షాలతో లోటు భర్తీ అయి, వర్షపాతం సాధారణ స్థాయికి చేరుకుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల ఉండగా, ఆరెంజ్ అలర్ట్‌కు సంబంధిచి నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాలు, ఎల్లో అలర్ట్ జారీ అయిన జిల్లాల్లో సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి, హైదరాబాద్, సిద్దిపేట, హన్మకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, కొత్తగూడెం ఉన్నాయి. భారీ వర్షాల >>2

## ప్రభుత్వ పథకాల ప్రచారానికి కార్యాచరణ

### పిఆర్‌ఓల శిక్షణపై సిఎం ఫోకస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై30:** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి పౌరుడికీ స్పష్టంగా చేరేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రెండున్నరేళ్లుగా ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ప్రజాసంబంధాల అధికారుల పాత్ర కీలకమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పిఆర్‌వోల శిక్షణ, సామర్థ్యపెంపునకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సిఎం కార్యాలయం, >>2

# 'రివర్స్ పంపింగ్' మళ్లీ ఫెయిల్



### కన్నెపల్లి నుంచి ఎత్తిపోయకుండానే నిండిన శ్రీపాద ఎల్లంపల్లి

### కడెం, స్థానిక పరీవాహకం నుంచి 3.56 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

### 15 గేట్లు ఎత్తి దిగువకు 1.55 లక్షల క్యూసెక్కుల విడుదల

### కాళేశ్వరం ఫట్.. ఎల్లంపల్లి హిట్: సిఎం కార్యాలయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై30:** గోదావరి నీటిని మేడిగడ్డ వద్ద నుంచి రివర్స్‌లో ఎత్తిపోస్తేనే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుతుందన్న వాదనకు ప్రకృతే సమాధానం చెప్పింది. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి ఒక్క చుక్క నీటిని ఎత్తిపోయకుండానే ఎగువన కురిసిన వర్షాలు, కడెం ప్రాజెక్టు నుంచి వచ్చిన భారీ వరదతో ఎల్లంపల్లి నిండిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువ కావడంతో గురువారం రాత్రి 15 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గురువారం రాత్రి 8 గంటలకు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఏకంగా 3,56,254 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. ఇందులో కడెంప్రాజెక్టు నుంచి 1,56,279 క్యూసెక్కులు, స్థానిక పరీవాహక ప్రాంతంనుంచి 1,99,975 క్యూసెక్కులు వస్తు >>2

## సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

**హైదరాబాద్ (సరూర్‌నగర్), జులై 30 ప్రభాతవార్త:** వివాహం జరిగిన పదిహేను నెలలకే అనుమానాస్పద స్థితిలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌లో నివసిస్తున్న రాజ్‌కుమార్‌తో గత సంవత్సరం మార్చి నెలలో కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీకి చెందిన నర్సింహస్వామి, పద్మల కుమార్తె హేమ (28) వివాహం జరిగింది. భార్యాభర్తలు >>2



గురువారం పార్లమెంటువద్ద కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ, సమాజ్‌వాది ఎంపి కృష్ణదేవి శివశంకర్ పటేల్ మరికొందరు నిరసన ప్రదర్శన జరిపిన దృశ్యం

## 'పరీక్షల' బిల్లుకు 'పెద్దలు' సై

>> సవరణ బిల్లును తీసుకొచ్చిందని, ప్రశ్నపత్రాల లీకేజీలకు దారితీసే మూల కారణాలను పరిష్కరించేలా ఇందులో ఎలాంటి స్పష్టమైన చర్యలు లేవని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా నివారించే విధంగా పరీక్షల నిర్వహణ ఎలా ఉంటుందనే అంశాన్ని బిల్లు స్పష్టంగా వివరించలేదని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు లోక్‌సభలో కూడా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలు, అలాగే అయోధ్య లోని రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలను ప్రస్తావిస్తూ ప్రతిపక్ష సభ్యులు నిరసనలకు దిగడంతో సభ పలుమార్లు వాయిదా పడింది. ఆందోళనల మధ్యనే లోక్‌సభ జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక (సవరణ) బిల్లు-2026ను, సాధారణంగా వందేమాతరం బిల్లుగాపిలిచే ఈ బిల్లును, మూజువాణి ఓటుతో ఆమోదించింది. అనంతరం సభను శుక్రవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు.

## మరో రూ. 2వేల కోట్లు

>> భట్టి విక్రమార్కల స్పష్టమైన ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం మరో రూ. 2 వేల కోట్ల నిధులను విడుదల చేశారు. దీంతో ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం మొత్తం రూ. 6 వేల కోట్ల బకాయిలను చెల్లించినట్లయింది. మొదటి విడతగా రూ.2 వేల కోట్లు, రెండో విడతగా మరో రూ.2 వేలు కోట్లు, తాజాగా గురువారం మూడో విడత ఇంకో రూ.2 వేల విడుదల చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. విశ్రాంత ఉద్యోగులకు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం ఈ నిధులతో పూర్తిగా చెల్లించింది. రాబోయే రోజుల్లో మిగిలిన ఇతర బకాయిలను కూడా ఇదే రీతిలో క్రమపద్ధతిలో క్లియర్ చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది.

## ప్రచారానికి కార్యాచరణ

>> మంత్రుల వద్ద పనిచేస్తున్న పిఆర్‌వోలు సమన్వయంతో ముందుకు సాగాలని సిఎం ఆదేశించారు. మహాలక్ష్మి మహిళలకు ఉచిత ప్రయాణ పథకం, రైతుల రుణమాఫీ, రైతు భరోసా, సన్నాలకు బోనస్ నుంచి గిగ్ వర్కర్ల చట్టం వరకు అన్ని వర్గాలకు ప్రాధాన్యమిచ్చేలా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన చట్టాలు, చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిఎం భావిస్తునారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి రైతులు, మహిళలు, యువత, పేదలకు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రతి కుటుంబానికీ చేరేలా నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ దిశగా ముఖ్యమంత్రి సిపిఆర్‌వో గుర్రం మల్సూర్ నేతృత్వంలోని బృందం మంత్రుల పిఆర్‌వోలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో ఏకరీతి, వేగం, సమన్వయం ఉండేలా మార్గదర్శకాలు ఇస్తోంది. సామాజిక మాధ్యమాల వినియోగంలో అనుసరించాల్సిన విధానాలపైనా సమాలోచనలు కొనసాగుతున్నాయి. సిఎం పిఆర్ బృందం, మంత్రుల సోషల్ మీడియా విభాగాల కోఆర్డినేటర్లు కలిసి కార్యాచరణ రూపొందిస్తున్నారు. వివిధ సామాజిక మాధ్యమ వేదికలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే మార్గాలపై వివిధ రంగాల నిపుణులతోనూ చర్చిస్తున్నారు. ప్రజలే కేంద్రంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం చేపడుతున్న మంచి పనులు ప్రతి ఇంటికీ చేరేలా పీఆర్‌వోలు మరింత చురుకుగా పనిచేయాలని స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చాయి.

## ఇంజినీర్ ఆత్మహత్య

>> ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. అయితే గురువారం సాయంత్రం హేమ ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని విచారణ జరిపారు. స్థానిక వినాయహిల్స్ కాలనీలో నివాసం ఉంటున్న రాజ్‌కుమార్, హేమ (28)లు దంపతులు. వీరికి గత సంవత్సరం మార్చి నెలలో వివాహం జరిగింది. అయితే గురువారం సాయంత్రం ఇంట్లోనే హేమ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ నేపథ్యంలో 100కు సమాచారం అందడంతో విషయం తెలుసుకున్న మీర్‌పేట్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని విచారణ జరిపారు. మృతురాలి సంబంధీకులు రాజ్‌కుమార్ వల్లే ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తున్నారు. మరో యువతితో ప్రేమలో ఉంటూ తరచూ గొడవ పడుతుండే వాడనీ పలు విషయాల్లో హేమను ఇబ్బందులకు గురి చేయడంతో పుట్టింటికి వచ్చిందని తెలిపారు. ఆ తర్వాత పంచాయతీ జరిగి పెద్దలు సర్దిచెప్పడంతో భర్త వద్దకు వచ్చిందని పేర్కొన్నారు. భర్త వేధింపులు తీవ్రం కావడంతోనే హేమ ఆత్మహత్య చేసుకుందని వారు ఆరోపించారు. కేసును నమోదు చేసుకున్న మీర్‌పేట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అత్యంత భారీ వర్షాలు

>> దృష్ట్యా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, స్థానిక యంత్రాంగం సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

గత రెండు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పలు లోటు వర్షపాతం ఉన్న జిల్లాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. ?ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలు ఉండగా, రెండు రోజుల వరకూ 27 జిల్లాల్లో భారీ లోటు వర్షపాతం చోటు చేసుకుంది. కేవలం 6 జిల్లాలు మాత్రమే మిగులు వర్షపాతంతో ఉన్నాయి. అయితే రెండు రోజులుగా వర్షాలు విస్తృతంగా కురుస్తుండటంతో రాష్ట్రంలోని 21 జిల్లాలు లోటు నుండి సాధారణ స్థితికి చేరాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా ఆసిఫాబాద్ జిల్లాలో 12.14 సెంటీమీటర్లు, మంచిర్యాల జిల్లాలో 10.28 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

# గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ

>> నీటిని విడుదల చేయడంతో ధర్మపురి, వెల్గటూర్ కోటిలింగాల, దొంతాపూర్ రాజారం దమ్మన్నపేట తదితర గ్రామాలప్రజలను అధికారులు అప్రమత్తంచేశారు. భారీ వర్షాలు మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రాజెక్టు నుంచి నీటిని అన్ని రిజర్వాయర్లలోకి తరలించే పనిలో నీటిపారుదలశాఖ ఇంజనీర్లు నిమగ్నమైనారు. స్థానికంగా కురిసిన వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరదతో రెండు బేసిన్‌లలోని ప్రాజెక్టులు కూడా జలకళ సంతరించుకున్నాయి. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో రెండు రోజుల నుంచి వానలు ఎడతెరపి లేకుండా పడుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భైంసాలోని గడ్డెన్నప్రాజెక్టులోకి 355.70మీటర్ల మేరు నీరు వచ్చిచేరింది. తిర్యాని మండలం చెలిమలవాగు మత్తడిదూకుతోంది. దొల్పులవాగు ప్రాజెక్టు, గుండాలలోని చెరువు నిండాయి. తిర్యాని-రొపల్లి, మాణిక్యాపూర్-మంగి, గోయోగాం -అమీన్‌గూడ్, ఉల్లిపిట్ట- చిర్రకుంట వంతెనలపై నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. భైంసా మండలం ఝరి(బి)కి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగాయి. పొచ్చర, కుంటాల జలపాతంలో జలసవ్వడి చేస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు భారీగా కురుస్తుండటంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ధర్పల్లి మండలంలోని ముత్యాలమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నిజామాబాద్ నగరంతో పాటు రూరల్ నియోజకవర్గ పరిధిలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, మోపాల్ ఆర్మూర్, నందిపేట్, మాక్లూర్, ఆలూరు, డొంకేశ్వర్ మండలాల్లో వాన పడుతోంది. ఆలూరు మండలం కేంద్రంలోని చెరువు నిండటంతో మత్తడి పారుతోంది. నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలో 53శాతం చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని కౌలాస్ నాల ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. దీంతో జుక్కల్ మండలం సోపూర్ గ్రామం వద్ద ఆనకట్టతో కూడిన వంతెన నుంచి నీరు భారీగా ప్రవహిస్తోంది. సంగారెడ్డి జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పిట్లం మండలం కంబాపూర్ వద్ద ఉన్న కాకివాగు, పిల్లివాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నాగిరెడ్డిపేట్‌లోని 1.8 టిఎంసిల నీటి సామర్థ్యం కలిగినపోచారం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. సోమవారం వరకు డెడ్‌స్టోరేజిలో ఉన్న ఈ ప్రాజెక్టుకు గురువారం ఉదయం పది అడుగుల నీరు రావడంతో రైతాంగం ఆనందం వ్యక్తంచేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో ప్రధానమైన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ వద్ద గోదావరి నది ప్రస్తుతం 1,01,530 క్యూసెక్కుల వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. నమోదవుతుండగా, బ్యారేజికి వచ్చిచేరుతున్న నీటిని అదే స్థాయిలో 1,01,530 క్యూసెక్కుల వరదను బయటకు గోదావరి దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉన్నారు. భారీ వర్షాల ప్రభావంతో గోదావరిలో వరద గురువారం ఉదయం నాటికి 6.25 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. గోదావరి దాని ఉపనదుల పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న అతిభారీవర్షాలతో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 18,131 టిఎంసిల నీరు వచ్చిచేరింది 72452 క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి ఎస్ఆర్ఎస్‌పికి వస్తోంది.. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి సామర్థ్యం 20 టిఎంపిలు ఉంటుంది అయితే గురువారం మధ్యాహ్నం వరకు 13.93 టిఎంసి నీటి నిల్వ అందులో ఉంది. నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 145.58 మీటర్లుగా ఉంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 78,034 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 16,025 క్యూసెక్కులుగా ఉంది. ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరుకు నీటిని ఎత్తిపోస్తున్నారు. జూరాల ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో పదిగేట్లను గురువారం ఎత్తి కృష్ణానదిలోకి 39080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు జల విద్యుత్ తయారీకి 38272 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వెరశి జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయానికి 77352 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలంలో 215టిఎంసిల నీరు ఉంది.

# నాణ్యమైన విద్యకోసం దీక్ష

>> స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థ ఉండాలనే లక్ష్యంతోనే ఉపాధ్యాయులను విదేశీ పర్యటనలకు పంపుతున్నామని తెలిపారు. ఆయా దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు అక్కడి అనుభవాలను ఇక్కడ ఆచరణలో తీసుకురావాలని సూచించారు. వివిధ దేశాల పర్యటనతో ప్రపంచం ఎటు వెళుతుందో తెలుస్తుందని, పర్యటనతో తెలుసుకున్న అంశాలను ఇక్కడ విద్యార్థులకు బోధించి వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆస్తులు లేకపోవడం వెనుకబాటుతనం కాదని, విద్య లేకపోవడమే వెనుకబాటుతనమని తాము నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే తేల్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోనే బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు రూపకల్పన చేశామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక హాస్టల్ విద్యార్థులకు డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 55 రోజుల్లోనే 11 వేల ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామని సిఎం గుర్తు చేశారు. ఐఎఎస్‌లు, ఐపిఎస్‌ల మాదిరే ప్రతి యేటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్యకు పంపిస్తామని సిఎం తెలిపారు. ఉపాధ్యాయులు ఏ మండలానికి ఆ మండలం యూనిట్‌గా తీసుకొని, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సిఎం సూచించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే అయిదేళ్ల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు దీక్షబూనాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ అందజేస్తున్నామని తెలిపారు. మానవ సంబంధాలను మెరుగుపర్చే ప్రయత్నం చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

విద్యార్థులు రోజులో అధిక సమయం పాఠశాలల్లోనే ఉంటారని, వారికి మానవ సంబంధాల ప్రాధాన్యతను తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని సిఎం అన్నారు. విద్య నైపుణ్యం కాదని, విద్యతోపాటు నైపుణ్యం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంగ్లీష్ ఒక భాష మాత్రమేనని, భాష సమాచార మార్పిడికి ఉపయోగపడుతుందని, నైపుణ్యం జీవనోపాధి కల్పిస్తుందన్నారు. చైనా, జపాన్, కొరియా, జర్మనీ దేశాల్లో ఇంగ్లీష్ మాట్లాడే వారు 10 శాతం మించి ఉండరని, కానీ వారికున్న నైపుణ్యంతో ప్రపంచాన్ని శాసిస్తున్నారని తెలిపారు.

జపాన్, జర్మనీ, కొరియా భాషలు కొంత నేర్చుకొని నైపుణ్యాలు నేర్చుకుంటే అక్కడ మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. 12వ తరగతి తర్వాత విద్యార్థికి ప్రపంచంపై సంపూర్ణ అవగాహన ఉండాలని, ఆ అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని అన్నారు. సమావేశానికి ముందు ఫిన్లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి వీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డైరెక్టర్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భద్రత, సరఫరా వ్యవస్థలపై ప్రధాని మోడీ సుదీర్ఘ సమీక్ష

## అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులకు ఆదేశాలు

**న్యూఢిల్లీ,జులై 30:** ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో భారత్‌కు అవసరమైన కీలక వస్తువుల సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాని నరేంద్ర మోడీ గురువారం సీనియర్ మంత్రులతో విస్తృత సమీక్ష నిర్వహించారు. హార్ముజ్ జలసంధి, బ్లాక్ సీ, రెడ్ సీ, ఏడెన్ గల్ఫ్ వంటి వ్యూహాత్మక సముద్ర మార్గాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ప్రధాని అధ్యక్షతన జరిగిన విస్తృత కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సిసిఎస్) సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డా, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, నౌకాశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలపాటు సాగిన ఈ సమావేశంలో ప్రపంచంలోని వివిధ ఘర్షణ ప్రాంతాల భద్రతా పరిస్థితులు, వాటి ప్రభావం భారత్ దిగుమతులపై, అంతర్జాతీయ సరఫరా గొలుసులపై చూపిస్తున్న ప్రభావంపై సమగ్రంగా సమీక్షచేసారు. ముఖ్యంగా ఘర్షణ ప్రాంతాల్లో ఉన్న భారతీయుల భద్రత, సముద్ర మార్గాల్లో ప్రయాణించే భారతీయ నావికుల రక్షణపై కూడా సవివరంగా చర్చించారు. పెట్రోలియం, సహజవాయువు, ఎరువులు సహా దేశానికి అవసరమైన అన్ని కీలక వస్తువుల దిగుమతులు నిరంతరాయంగా కొనసాగేందుకు తమ శాఖలు చేపట్టిన చర్యలను ఆయా మంత్రులు సమావేశంలో వివరించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

ప్రపంచ రాజకీయ పరిణామాలు, వాటి వల్ల భారత ఆర్థిక ప్రయోజనాలపై ఏర్పడుతున్న ప్రభావం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. దేశ పౌరుల భద్రత, భారత ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణతో పాటు సరఫరా వ్యవస్థలో ఏర్పడుతున్న అవరోధాలను అధిగమించే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ప్రధాని సంబంధిత మంత్రులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధానికి ముందు భారత్ దిగుమతి చేసుకునే ఇంధనంలో సుమారు 40 శాతం హార్ముజ్ జలసంధి ద్వారానే వచ్చేది. యుద్ధ ప్రభావం పూర్తిగా తగ్గకపోవడంతో పశ్చిమాసియా నుంచి ఇంధన దిగుమతులు గణనీయంగా దెబ్బతిన్నాయి. హార్ముజ్ మార్గంలో చమురు, సరకు నౌకలపై జరుగుతున్న అడపాదడపా దాడుల కారణంగా ఆ మార్గంలో రవాణా ఇంకా పరిమితంగానే కొనసాగుతోంది. ఇటీవల యెమెన్‌కు చెందిన హౌతీ మిలీషియా, బాబ్ అల్‌మండబ్ జలసంధి గుండా ప్రయాణించే సౌదీ అరేబియా చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించింది. అనంతరం కొన్ని నౌకలపై దాడులు కూడా నిర్వహించింది. రెడ్ సీని ఏడెన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో అనుసంధానించే బాబ్ అల్‌మండబ్ ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలకు అత్యంత కీలకమైన సముద్ర మార్గంగా గుర్తింపు పొందింది.

తాజా గణాంకాల ప్రకారం, గత మూడు రోజులుగా ఈ మార్గంలో రోజుకు సగటున 31 నౌకలే ప్రయాణించగా, జులై తొలిపక్షంలో ఈ సంఖ్య రోజుకు 43గా నమోదైంది. దీంతో ఆ మార్గంలో రవాణా గణనీయంగా తగ్గినట్లు స్పష్టమవుతోంది. మరోవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో బ్లాక్ సీ మార్గంలో రష్యా నుంచి జరుగుతున్న చమురు సరఫరాపైనా ఒత్తిడి పెరిగింది. ఇటీవల ఈ సముద్ర మార్గంలో ప్రయాణిస్తున్న నౌకలపై పలుమార్లు దాడులు చోటుచేసుకున్నాయి. భారత్ తన మొత్తం ఇంధన అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. అలాగే ఎరువుల అవసరాల్లో కూడా పెద్దమొత్తంలో విదేశీ దిగుమతులపై ఆధారపడుతోంది. అదనంగా పశ్చిమాసియా దేశాల్లో సుమారు కోటి మంది భారతీయులు నివసిస్తూ, ఉపాధి పొందుతున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

### వారం - వర్జ్యం

31-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పుష్యమి కార్తె
విదియ రా.10.29, ధనిష్ఠ రా.7.24
వర్జ్యం : రా.2.59-తె.4.41
దు.ఉ.8.22-ఉ.9.14, 2) మ.12.29-మ.1.31
శుభసమయం : ఉ.9.30-10.00
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** పనులలో ఆటంకాలు ఎదురైనా అభివృద్ధి కూడా అంతర్లీనంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృషభం:** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**మిథునం:** సహోద్యోగులతో మెలుకువతో మెలగడం చెప్పదగినది. నూతన పెట్టుబడులకు అనుకూల కాలం.

**కర్కాటకం:** దూరప్రాంతం నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. విమర్శలను లెక్కచేయరు. బంధువుల సమాగమనం.

**సింహం:** సంతాన విద్యాభివృద్ధి బాగుంటుంది. జీవిత భాగస్వామి నుండి సలహాలు స్వీకరిస్తారు. వస్త్రలాభం.

**కన్య :** వ్యాపార విస్తరణకు తగినంత ఆర్థిక వనరులు సమకూరడం కష్టమవుతుంది. వివాదాలకు దూరంగా వుండండి.

**తుల:** బంధువుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలుగుతుంది. భూ వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**వృశ్చికం:** అధిక ప్రయోజనాలు కలిగి చౌకగా వచ్చే వస్తువులను కొనుగోలు చేస్తారు. లలిత కళలు అభ్యసిస్తారు.

**ధనుస్సు:** ఓర్పు, నేర్పుతో ముందుకు సాగుతారు. గృహ నిర్మాణయత్నాలు సాగిస్తారు. విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. స్త్రీ మూలంగా ధన లాభం పొందుతారు. వాహన సౌలభ్యం కలదు.

**కుంభం:** శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. కాని దైవాను గ్రహం వలన మీరు బయట పడవారు.

**మీనం:** అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలు స్తబ్ధతగా వుంటాయి. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



భద్రాచలం వద్ద నిండుకుండలా గోదావరి

# మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో గోదావరి

**భద్రాచలం, జులై 30 (ప్రభాతవార్త):** ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. గంట గంటకూ పెరుగుతున్న గోదావరి వరద ప్రవాహంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం హై అలర్ట్‌లోకి వెళ్లింది. శుక్రవారం ఉదయం నాటికి భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీఅయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో జిల్లాకలెక్టర్ అంకిత్ అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వరద ముంపు ప్రభావం ఎదురయ్యే ప్రాంతాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గురువారం అన్ని శాఖల జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంత గ్రామాల్లో ప్రజలకు ముందుగానే హెచ్చరికలు జారీ చేయాలని, గ్రామాల్లో మైకుల ద్వారా నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

**లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

నది ఉధృతి మరింత పెరిగే అవకాశాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను ముందుగానే గుర్తించి అవసరమైతే సురక్షిత పునరావాస కేంద్రాలకుతరలించే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుద్ధం, ఆహారం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి వంటి అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

**రక్షణ బృందాలు సిద్ధం**

మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

# 'రివర్స్ పంపింగ్' మళ్లీ ఫెయిల్

>> న్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం గురువారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఒక్క క్యూసెక్కు ప్రవాహం కూడా లేకపోయినా ఎల్లంపల్లికి ఈ స్థాయిలో వరద చేరడం గమనార్హం. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా గురువారం రాత్రికి 147.70 మీటర్లకు చేరింది. మొత్తం 20.1754 టీఎంసీల సామర్థ్యానికి గాను 19.3419 టీఎంసీలు నిల్వ అయ్యాయి. అంటే ప్రాజెక్టు దాదాపు 96 శాతం నిండింది. వరద ఉధృతి కొనసాగుతుండటంతో 62 గేట్లలో 15 గేట్లను ఎత్తి 1,55,625 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఇతర అవసరాలతో కలిపి మొత్తం అవుట్‌ఫ్లో 1,71,650 క్యూసెక్కులుగా నమోదైంది. కాళేశ్వరం ప్రాజెక్టు రీ-ఇంజినీరింగ్‌లో భాగంగా దాదాపు వేలాది కోట్లు ఖర్చు పెట్టి మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించి, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గోదావరి నీటిని రివర్స్‌లో ఎత్తిపోయే వ్యవస్థను రూపొందించారు. మేడిగడ్డ నుంచి అన్నారం, అక్కడి నుంచి సుందిళ్లకు, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి మూడు దశల్లో నీటిని లిఫ్ట్ చేసేందుకు పంప్‌హౌజులు, బ్యారేజీలు నిర్మించారు. మేడిగడ్డ నుంచి సుమారు 47.2 కిలోమీటర్ల దూరంలో అన్నారం, 80.7 కిలోమీటర్ల వద్ద సుందిళ్ల, 111.1 కిలోమీటర్ల వద్ద ఎల్లంపల్లి ఉన్నాయి. మేడిగడ్డలో నీటిని నిల్వ చేసి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా అన్నారానికి, అక్కడి నుంచి సుందిళ్లకు, చివరకు ఎల్లంపల్లికి ఎత్తిపోస్తేనే ఉత్తర తెలంగాణకు నీరు అందుతుందని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదే పదే ప్రచారం చేసుకుంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన తర్వాత అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీల వద్ద గేట్లను ప్రభుత్వం తెరిచిపెట్టింది. నీటిని నిల్వ చేస్తే ప్రమాదమంటూ ఎన్‌డీఎస్‌ఏ సూచనలను అమలు చేసింది. కన్నెపల్లి నుంచి నీటిని పంపింగ్ చేయాలని విపక్షాలు ఇటీవల పట్టుపట్టాయి. గోదావరిలో నీరు ప్రవహిస్తున్నా ప్రభుత్వం కన్నెపల్లి పంపులను ఎందుకు నడపడం లేదని ప్రశ్నించాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేసి ఎల్లంపల్లికి ఎత్తిపోయాలని డిమాండ్ చేశాయి. అయితే నదిలో నీరు కనిపించడం వేరు, పంపులు నడపడానికి అవసరమైన కనీస నీటిమట్టం ఉండటం వేరు. మేడిగడ్డలో పంపింగ్‌కు కనీసం +93.50 మీటర్లు, అన్నారంలో +116.50 మీటర్లు, సుందిళ్లలో +126.50 మీటర్ల నీటిమట్టం అవసరం. అంతేకాకుండా మేడిగడ్డ భద్రతకు సంబంధించిన ఎన్‌డీఎస్‌ఏ సూచనలను పక్కనపెట్టి నీటిని నిల్వ చేయడం సాధ్యం కాదు. ఎల్లంపల్లికి సొంత పరివాహకమే బలం, ఎల్లంపల్లి కేవలం కాళేశ్వరం నుంచి రివర్స్‌లో ఎత్తిపోసే నీటిపైనే ఆధారపడిన ప్రాజెక్టు కాదు. ఎగువ గోదావరి ప్రవాహాలు, కడెం నది, విస్తారమైన స్థానిక పరివాహక ప్రాంతం నుంచి సహజంగా వచ్చే నీరు ఈ ప్రాజెక్టుకు ప్రధాన ఆధారం.

# రైస్‌మిల్లర్లపై కొరడా

>> నల్లగొండ, సూర్యపేట జిల్లాలో ఒక్కోమిల్లులో అనుమానంతో విజిలెన్స్ అధికారులు తనిఖీచేయడంతో ధాన్యం స్టాక్‌లేకపోవడంతో వారి గుట్టుబయట పడింది. మెదక్‌జిల్లా వెల్దుర్తిలో ఆరుకోట్ల ధాన్యం రైసుమిల్లులో లేకపోవడంతో వారిపై కేసులు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో తనిఖీ చేసిన మిల్లులో రూ.11కోట్ల విలువగల ధాన్యం పక్కదారి పట్టించినట్లు నిర్ధారించారు. హనుమకొండలో రూ.ఎనిమిదికోట్ల ధాన్యం, ములుగులో రూ. నాలుగు కోట్లధాన్యం సూర్యాపేటలో గురువారం ఉదయం వరకు తనిఖీచేసి ఎస్ఆర్ ఇండస్ట్రీ మిల్లులో రూ.45కోట్ల విలువగల ధాన్యం పక్కదారి పట్టించినట్లు అధికారులు లెక్కగట్టారు. నల్లగొండ ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు విజిలెన్స్ తనిఖీలలో రూ.185.4కోట్ల ధాన్యం పక్కదారి పట్టించినట్లు విజిలెన్స్ అధికారులు తేల్చినారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి దేవేంద్రసింగ్ చౌహాన్ బాధ్యతలు స్వీకరించిన తరువాత 2022-23 యాసంగి ధాన్యం బాకాయిలు చెల్లించని 2024-25 ఖరీఫ్, రబి సీజన్ ధాన్యం పక్కదారి పట్టించినవారి ఆటలు సాగనివ్వడంలేదు. ధాన్యం నిల్వలపై కాకిలెక్కల కథలకు అవకాశం పడేలా మిల్లులో ఉన్న ధాన్యం ఎంత, బకాయి ఎంత అనే అంశంపై విజిలెన్స్ అధికారులు తనిఖీ వెళ్లి ప్రత్యక్షంగాలెక్కిస్తుండటంతో ఒక సీజన్ తీసుకొన్న ధాన్యం మరో సీజన్ బకాయిలు చెల్లించే సర్దుబాటు వ్యవహారాలకు డిఎస్ చౌహాన్ ఇక కట్టడి చేసే దిశగా మిల్లులో తనిఖీలు తన సిబ్బందితో చేపడుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా గత పదిరోజులుగా ధాన్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చిన రైసు మిల్లులపై దాడులు ప్రారంభించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

జిల్లా కలెక్టర్, మహబూబాబాద్
ఫారం-VII
(చట్టం-30/2013లోని సెక్షన్-19(1) మరియు రూల్-25లోని సబ్ రూల్ -1 ప్రకారం)
పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్
(Publication of Declaration)

మహబూబాబాద్ జిల్లా రాజ పత్రము నెం. ఎ3/13/2026 తేది: 06.07.2026
ఆర్.సి.నం. బి1/1341/2024 తేది: 04.07.2026

మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలం పెద్దనాగారం గ్రామములో విస్తీర్ణం ఎ.1.15 గుంటల భూమి ప్రజా ప్రయోజనాల నిమిత్తం అనగా కాలువ 5R-11L-DBM-60 యొక్క SRSP దశ-II నిర్మాణం కోసం భూసేకరణ అవసరమైనదని తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ భావిస్తున్నది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలం పెద్దనాగారం గ్రామములో విస్తీర్ణం ఎ.1.15 గుంటల గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణలో ఉన్నదని ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామం: పెద్దనాగారం మండలం : నరసింహులపేట జిల్లా : మహబూబాబాద్

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | భూసేకరణ చేయు విస్తీర్ణము (ఎ.గుం.లు) | భూమి విధం | భూమి రకం | భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు | విస్తీర్ణం (ఎ.గుం.లు) | నిర్మాణాలు చెట్లు ఇతర ములు | హద్దులు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 55/B/2/1/1 | 0.38 | పట్టా | ఖుష్కి | భూక్యా పాప తండ్రి: హరి | 0.38 | (936 జమాయిల్ చెట్లు) | తూ: భూక్యా వెంకన్న ప: గుగులోతు గురులింగ్ ఉ: భూక్యా బహదూర్ దక్షిణం : PR రోడ్డు |
| 2 | 55/B/1/1/2 | 0.13 | పట్టా | ఖుష్కి | భూక్యా లక్ష్మీ భర్త: హేమ | 0.13 | లేవు | తూ: భూక్యా లక్ష్మీ ప: భూక్యాహర్యాఖన్ సింగ్/భూక్యా కమిలి ఉ: భూక్యా వీరేందర్ భూక్యా లక్ష్మి ద : భూక్యా పాప |
| 3 | 55/A/2 | 0.03 | పట్టా | ఖుష్కి | భూక్యా కమిలి భర్త బహదూర్ సింగ్ | 0.03 | లేవు | తూ: భూక్యా లక్ష్మీ ప: భూక్యా పాప ఉ: భూక్యా హర్యాఖన్‌సింగ్ ద : భూక్యా పాప |
| 4 | 55/A/1/1 | 0.01 | పట్టా | ఖుష్కి | భూక్యా హర్యాఖన్ సింగ్ తండ్రి: హాజు | 0.01 | లేవు | తూ: భూక్యా లక్ష్మీ ప: భూక్యా వీరేందర్ సింగ్ భూక్యా కమిలి/ ఉ: భూక్యా హర్యాఖన్ సింగ్ లక్ష్మి ద : భూక్యా కమిలి |
| | మొత్తం: | | | | | 1.15 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునర్నిర్మాణ హక్కు చట్టం, 2013 (నెం.30/2013)లోని సెక్షన్-15 అనుసరించి భూసేకరణ పై ఆసక్తి గల వ్యక్తులు దాఖలు చేసిన అభ్యంతరములు/ఆక్షేపణలు విచారించిన మీదట ఈ ప్రకటన జారీ చేయనైనది.

భూసేకరణ నేపట్టబడిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనియెడల స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, మహబూబాబాద్ మరియు భూసేకరణ అధికారి/రాజస్వ మండలాధికారి, తొర్రూర్ గారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును.

సం/- భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, తొర్రూర్ | సం/- అదనపు కలెక్టర్, మహబూబాబాద్ | సం/-. జిల్లా కలెక్టర్, మహబూబాబాద్

DIPR RO.NO:550/LA/PP/Advt/Pub/2026-27



# అసోంలో వరద బీభత్సం.. 78 మంది మృతి

**గువాహతి, జులై 30:** అసోంలో భారీ వర్షాలతో వరదలు భీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాలకు రాష్ట్రంలోని ఏడు జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయి మూడు లక్షల మందికి పైగా ప్రజల జీవితం అస్తవ్యస్తమైంది. గడిచిన 24 గంటల వ్యవధిలో వరదలకు మరో ముగ్గురు మృతిచెందగా మొత్తం మరణాల సంఖ్య 78కి చేరింది. వేల సంఖ్యలో పశువులు గల్లంతయ్యాయి. లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ మేరకు భారీ వర్షాలు, వరదలపై అస్సాం ప్రభుత్వం బులెటిన్ విడుదల చేసింది. భారీ వర్షాలకు శివసాగర్, చరాయిదేవ్, గోలాఘాట్, జోర్హాట్, నాగావ్, విశ్వనాథ్, కామరూప్ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ బులెటిన్ వెల్లడించింది. ఆయా జిల్లాల్లో 551 గ్రామాలు నీట మునిగాయని తెలిపింది. దీంతో మొత్తం 3,00,031 మంది ప్రజలు ప్రభావితమయ్యారని పేర్కొంది. గత 24 గంటల వ్యవధిలో ముగ్గురు మృతిచెందారని ఏఎస్డీఎమ్ఏ అధికారులు తెలిపారు.

# ఎపి సిఎం కాన్వాయ్‌లోకి దూసుకెళ్లిన వాహనం

## దాడిలో విరిగిన కాన్వాయ్ డ్రైవర్ పళ్లు

## పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 30, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోకి ఓ కారు దూసుకురావడంతో చోటుచేసుకున్న ప్రమాదం అనంతరం జరిగిన ఘర్షణలో ప్రోటోకాల్ వాహనం డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 25న పంజాగుట్ట పరిధిలోని గ్రీన్‌ల్యాండ్స్ వద్ద ఐటీసీ కాకతీయ హోటల్ సమీపంలో చోటుచేసుకున్న సంఘటన వివరాల్లోకి వెళితే.. ఏపీ సీఎం చంద్రబాబుకు చెందిన కాన్వాయ్ బేగంపేట విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్తుండగా, మూడు వాహనాలు కాన్వాయ్‌లో ఉన్నాయి. మూడో ప్రోటోకాల్ వాహనాన్ని హెండరీ జోసెఫ్ (64) నడుపుతున్నారు. కాన్వాయ్ ఐటీసీ కాకతీయ హోటల్ సమీపంలోకి రాగానే ఎంజీ విండ్సర్ ఈవీ కారు అకస్మాత్తుగా కాన్వాయ్ మధ్యలోకి రావడంతో స్వల్పంగా ఢీకొంది. దీంతో ఆ కారు డ్రైవర్, అతని తండ్రి వాహనం నుంచి దిగి జోసెఫ్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. దాడిలో తన నాలుగు పళ్లు విరిగిపోగా, మరో పన్ను వదులై తీవ్ర నొప్పి, గాయాలయ్యాయని బాధితుడు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం డ్రైవర్ తండ్రి కాన్వాయ్ వాహనం తాళాలను బలవంతంగా తీసుకుని జోసెఫ్‌ను కారులో కూర్చోబెట్టి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ఓ స్వీట్ షాప్ సమీపానికి తీసుకెళ్లాడు. అక్కడ కారు తాళాలను లోపల పడేసి వెళ్లిపోయినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనపై పంజాగుట్ట పోలీసులు బీఎన్ఎస్ 117(2), 126(2), 352 సెక్షన్లతో పాటు 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నీట్ రీఎగ్జామ్ వివాదం

## పిటిషన్లు కొట్టేసిన బాంబే హైకోర్టు

## రూ.5 వేలు చొప్పున జరిమానా విధింపు

**ముంబై, జులై 30:** తమ ఓఎంఆర్ షీట్లలో తారుమారు జరిగిందని ఆరోపిస్తూ నీట్ (యుజి) అభ్యర్థులు దాఖలు చేసిన నాలుగు రిట్ పిటిషన్లను బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ కొట్టివేసింది. ఇద్దరు అభ్యర్థుల అసలు ఓఎంఆర్ షీట్లను పరిశీలించి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) వాదనలు విన్న తర్వాత, వారి పిటిషన్లను మెరిట్ ఆధారంగా ధర్మాసనం కొట్టివేసింది. మిగిలిన ఇద్దరు పిటిషనర్లు తమ పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. కోర్టును ఆశ్రయించడానికి ముందు, ఈ నలుగురు అభ్యర్థులు ఇదే విషయాన్ని ఎన్‌టిఎకు తెలియజేసి, స్థిరపడిన ఓఎంఆర్ ఛాలెంజ్ ప్రక్రియ/గ్రీవెన్స్ ద్వారా సమాధానం పొందారు. ఎలాంటి తేడాల్లేవని తేటతెల్లమైంది. దీంతో నలుగురు పిటిషనర్లలో ప్రతి ఒక్కరికీ రూ.5 వేలు చొప్పున ఎన్‌టిఎకు చెల్లించాలని ధర్మాసనం జరిమానా విధించింది.

# ఉపాధ్యాయ సమస్యలు తీరేదాకా ఉద్యమాలు

## రేపు ఇందిరాపార్క్ దగ్గర మహాధర్నా: తపస్ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాలు తప్పవని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వొద్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రేపు(శనివారం) ఇందిరాపార్క్ దగ్గర మహా ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. పెండింగ్ పీఆర్‌సి నివేదికను వెంటనే విడుదల చేసి 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్స్‌తో సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి అందరికీ పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేసి, సుప్రీంకోర్టులో ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్‌పిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో 317 బాధితుల కోసం ఇచ్చిన 190 జీవో ప్రకారం అప్లికేషన్లు అందరికి డిప్యుటేషన్‌లు ఇవ్వాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 వర్తింపు చేస్తూ వారిని విద్యాశాఖలో విలీనం చేయాలని, కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లిస్తూ, ఎంటీఎస్ అమలు చేయాలన్నారు. జి.ఓ.నెం.25ను సవరించి ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా పోస్టులను భర్తీ చేయాలన్నారు. డీఎస్సీ 2008 ప్రత్యేక ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాన్ని చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉపాధ్యాయుల వార్షిక పదోన్నతులు, బదలీల క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు 12 నెలల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# రాజ్యసభలో పరీక్షల బిల్లుపై వాడివేడి చర్చ

## ప్రధాని మోడీ కోసం ధర్మేంద్ర ప్రధాన్‌ను బలిచేసారంటూ ఖర్గే ధ్వజం



**న్యూఢిల్లీ, జులై 30:** లోక్‌సభ ఆమోదం పొందిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు, 2026ను కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని ఏమాత్రం సహించబోమని, పేపర్ లీకేజీల పట్ల తమ ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంబిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఈ బిల్లు ఒక నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ చట్టాన్ని తీసుకురావడంలో ప్రధానమంత్రి ఏమాత్రం జాప్యం చేయలేదని కేంద్రమంత్రి వెల్లడించారు. ఈ సవరణ బిల్లు నిబంధనల ప్రకారం, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ. 50 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. ఒకవేళ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడితే, కనీస శిక్షను ఏడేళ్లకు పెంచడంతో పాటు జరిమానాను రూ. 10 కోట్ల వరకు విధించేలా ప్రతిపాదించారు. దర్యాప్తును రెండు నెలల్లో పూర్తి చేసి, ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల లోపు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ ముగించాలని ఈ బిల్లు నిర్దేశిస్తోంది. బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. నీట్ పేపర్ లీక్ అనంతరం ఎందరో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి, తద్వారా ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026పై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి జరిగిందని ఖర్గే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తు చేశారు. ఆ శాఖ అనుమతి లేకుండా ఇలాంటి చర్యలు జరిగే అవకాశం లేదని అన్నారు. ఈ ఘటనపై అమిత్ షా బాధ్యత నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే బిల్లును ఇంత ఆలస్యంగా ఎందుకు తీసుకొచ్చారని ఖర్గే ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే సంస్కరణలు చేయకుండా ప్రభుత్వం రాజకీయాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలను చల్లార్చేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. బీజేపీ రాజకీయాల వల్లే దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరసనలు, పోలీసు చర్యలు చోటుచేసుకున్నాయని అన్నారు. పేపర్ లీకేజీలు జరిగిన తర్వాత నష్టనివారణ చర్యలు తీసుకోవడం ఒక్కటే సరిపోదని ఖర్గే అభిప్రాయపడ్డారు. అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అమలు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం అనుసరించబోయే స్పష్టమైన కార్యాచరణను వివరించలేదని విమర్శించారు. ఈ బిల్లు సమస్య కు శాశ్వత పరిష్కారం చూపుతుందా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా పరీక్షల వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేశారని ఖర్గే గుర్తు చేశారు. వారి గొంతుకను ప్రతిపక్షం వీధుల నుంచి పార్లమెంట్ వరకు వినిపించిందన్నారు. ప్రజల ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం చివరకు వెనక్కి తగ్గిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల పోరాటం ఫలించిందని, వారి ఉద్యమం వల్లే ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. అధికారాన్ని కోల్పోతామన్న భయంతోనే ప్రభుత్వం డిమాండ్లకు తలొగ్గిందని ఆరోపించారు. ప్రధానమంత్రి మోడీ కుర్చీని కాపాడారని ఖర్గే వ్యాఖ్యానించారు.

# ఇ-20 పెట్రోల్ కావాలంటే కొన్ని విడిభాగాలు మార్చుకోవాల్సిందే

## పార్లమెంటులో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ వెల్లడి



**న్యూఢిల్లీ, జులై 30:** ఇ-20 పెట్రోల్ పార్లమెంట్‌లో కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. కొన్ని రకాల పాత (బీఎస్3) వాహనాలు ఇ-20 పెట్రోల్‌తో నడవాలంటే కొన్ని పార్ట్‌లు మార్చుకోవాల్సిందే అని స్పష్టం చేశారు. ఇథనాల్ కలిసిన పెట్రోల్‌తో పని చేయాలంటే వాహనాల ఇంజిన్‌కు మోడిఫికేషన్ అవసరం లేదని, అలాగే, వాటి సామర్థ్యంలో కూడా మార్పు ఉండబోదని గడ్కరీ తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానంగా పార్లమెంట్‌లో బుధవారం గడ్కరీ ఈ వివరాల్ని వెల్లడించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (ఐఐపీ), డెహ్రాడూన్‌తోపాటు ఎస్ఐఏఎం, ఏఆర్ఏఐ సంస్థలతో కలిపి సంయుక్తంగా నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ వివరాలు వెల్లడిస్తున్నట్లు తెలిపారు. కొన్ని పాత బీఎస్3 వాహనాలకు సంబంధించి కొన్ని రబ్బర్ పార్ట్‌లు, కంపోనెంట్స్ మార్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బీఎస్3 వాహనాలు ఏప్రిల్ 1, 2005న అందుబాటులోకి వచ్చాయన్నారు. అప్పటి నుంచి 2016లోపు తయారైన వాహనాల్లోనే విడిభాగాలు మార్చుకోవాల్సి ఉంటుందని వివరించారు. కొన్ని రబ్బర్ పార్ట్స్, గ్యాస్కెట్లు మారిస్తే సరిపోతుందన్నారు. వాహనాల రెగ్యులర్ సర్వీస్ ద్వారా ఈ పార్ట్స్ మార్చుకోవచ్చని, ఇందుకోసం పెద్దగా మోడిఫికేషన్స్ అవసరం లేదని గడ్కరీ చెప్పారు. ఈ కేటగిరికి చెందిన టూవీలర్లు, కార్లలో ఈ20 పెట్రోల్ వినియోగానికి సంబంధించి ఇంజిన్‌లలో మార్పులు చేయక్కర్లేదని స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో ఇ-20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నాయని, ఉన్నట్లుండి బ్రేక్‌డౌన్ అవుతున్నాయని, మైలేజ్ తగ్గుతోందని వాహనదారులు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై గడ్కరీ స్పందిస్తూ మైలేజీ తగ్గడానికి ఇ-20పెట్రోల్ ఒక్కటే కారణం కాదని, అనేక అంశాల ఆధారంగా మైలేజీ తగ్గడం, పెరగడం జరుగుతుందని వివరించారు. ఇ-20 పెట్రోల్ వినియోగంపై ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

# వరద సహాయక చర్యలపై అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు దిశానిర్దేశం

## గోదావరిఖని, పెద్దపల్లి, రామగుండంలో పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై30:** గోదావరిఖని, పెద్దపల్లి, సింగరేణి ఏరియాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పలు కాలనీలు జలమయమైన నేపథ్యంలో సహాయక, పునరావాస చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి పెద్దపల్లి జిల్లా కలెక్టర్, సింగరేణి సీఎండీ, ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ జెన్‌కో సీఎండీ, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) అధికారులు, రామగుండం పోలీసు కమిషనర్ తదితర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సులో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట వెంకటరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కూడా పాల్గొన్నారు. రామగుండం పారిశ్రామికవాడలో నిలిచిపోయిన వరద నీరు తొలగించేందుకు నాలాల్లో ఉన్న ఆటంకాలను తొలగించాలని మంత్రి ఆదేశించారు. వరద సహాయక చర్యల్లో సింగరేణి, ఎన్‌టీపీసీ అధికారులు చురుకుగా పాల్గొని జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. వీర్లపల్లి గ్రామంలోకి నివాస ప్రాంతాలు జలమయమైన నేపథ్యంలో గ్రామంలోకి వరద నీరు చేరకుండా ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్తులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా ఇంటి స్థలాల పట్టాలు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని పెద్దపల్లి కలెక్టర్‌కు సూచించారు. గోదావరిఖనిలో వరద తీవ్రత అధికంగా ఉన్నందున మున్సిపల్, రెవెన్యూ శాఖలకు పోలీసులు పూర్తి సహకారం అందించాలని రామగుండం పోలీసు కమిషనర్‌కు ఆదేశించారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రామగుండంలో విపత్తు నివారణ బృందాలను పూర్తిస్థాయిలో రంగంలోకి దించాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని 1,021 చెరువుల్లో దాదాపు 80 శాతం నిండటం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని సుమారు 2.7 లక్షల ఎకరాలకు సాగునీటి కొరత ఉండదన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు గురువారం సాయంత్రానికి 20 టీఎంసీలకు చేరనున్నాయని తెలిపారు. నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత వీర్లపల్లి గ్రామంతో పాటు గోదావరిఖని, రామగుండం పారిశ్రామికవాడ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని సింగరేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వరద సహాయకచర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న రామగుండం మేయర్, డిప్యూటి మేయర్, కార్పొరేటర్లను మంత్రి అభినందించారు.

# దొర్లిపడ్డాయని దోచేశారు..

## మహబూబాబాద్ జిల్లాలో ఆపిల్ పళ్ల వాహనం బోల్తా

## ఎగబడి ఆపిల్ పళ్లు ఎత్తుకెళ్లిన స్థానికులు

## క్షణాల్లోనే లోడ్ ఖాళీ

**మహబూబాబాద్/తొర్రూరు ప్రతినిధి, ప్రభాతవార్త:** అదుపుతప్పి ఆపిల్ పండ్లు తీసుకెళ్తున్న డీసీఎం వాహనం బోల్తా పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జిల్లాలోని తొర్రూరు మండలం మాటేడు గ్రామ స్టేజి సమీపంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఆపిల్ పండ్ల లోడుతో వెళ్తున్న ఓ డీసీఎం వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా రోడ్డుపై ఒరిగిపోవడంతో అందులో ఉన్న ఆపిల్ పండ్ల పెట్టెలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే ప్రమాదానికి గురైన డ్రైవర్‌కు సహాయం చేయాల్సిన సమయంలో కొందరు వ్యక్తులు రోడ్డుపై పడిన ఆపిల్ పండ్లను తీసుకెళ్లేందుకు పోటీపడ్డారు. నిమిషాల వ్యవధిలోనే డీసీఎం లోడ్‌లో ఉన్న ఆపిల్ పండ్లను ప్రజలు ఎత్తుకెళ్లడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కొంతమంది బస్తాలు, సంచులు, వాహనాల్లో ఆపిల్ పండ్లను తరలించగా, మరికొందరు చేతులతోనే తీసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



ఆపిల్ పండ్లను ఎత్తుకెళ్తున్న ప్రజలు

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఇలాంటి ప్రమాదాల సమయంలో సహాయం చేయాల్సింది పోయి, ఎగబడి ఆపిల్ పండ్లు ఎత్తుకెళ్లడం శోచనీయమని ఇది నేరమైన చర్యగా భావిస్తున్నామని పోలీసులు అన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎరువుల సబ్సిడీని పెంచాలి

## పశ్చిమాసియా పరిణామాలతో తీవ్ర ప్రభావం

## 100 నుండి 200 శాతం పెరిగిన ముడి సరకులు

## కేంద్రానికి ఫెర్టిలైజర్ అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** పశ్చిమ ఆసియా సంఘర్షణ నేపథ్యంలో ముడి పదార్థాల ధరలు పెరిగినందున, కొనసాగుతున్న ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం నిర్ధారించిన పోషకాధారిత సబ్సిడీ (ఎన్‌బిఎస్) రేట్లను పెంచాలని ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కేంద్రానికి కోరింది. కీలక ముడి పదార్థాల లభ్యతపై కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంక్షోభం ప్రభావాన్ని మరియు దేశీయ ఎరువుల ఉత్పత్తిపై దాని సంభావ్య పరిణామాలను సమీక్షించడానికి ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఐఎఫ్ఎఫ్‌సిఒ, కోరమండల్ ఇంటర్నేషనల్, పారాదీప్ ఫాస్ఫేట్స్, ఇండియన్ పొటాష్ లిమిటెడ్, ఇండోరామా వంటి ఎరువుల సంస్థల ఉన్నతాధికారులు సమావేశమయ్యారు.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ఎరువుల తయారీకి అవసరమైన ముడి పదార్థాల అంతర్జాతీయ ధరలు 100 నుండి 200 శాతం వరకు ఎగబాకాయి. ఇందువల్ల ఉత్పత్తికి సంబంధించి సంస్థలకు భారీగా నష్టం వాటిల్లింది. ప్రస్తుత సబ్సిడీ నిర్మాణంతో దేశీయంగా ఎరువుల తయారీ పూర్తిగా భారంగా మారిందని, పెరిగిన ఖర్చులను ప్రస్తుత ధరలు భర్తీ చేయలేకపోతున్నాయని పరిశ్రమ వర్గాలు ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఎరువులకు సంబంధించి ముడిసరుకుల ధరల పెరుగుదల భారం రైతులపై పడకుండా చర్యలు చేపట్టాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాయి.

కాగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఏప్రిల్ 1 నుండి సెప్టెంబర్ 30 వరకు అమలయ్యే ఎరువుల సబ్సిడీని ఇప్పటికే కేంద్రం కేటాయింపులు చేసింది. ఫాస్ఫేటిక్, పొటాసిక్ (పీ అండ్ కే) ఎరువులపై సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం రూ. 41,534 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇది గత ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే సుమారు 12 అదనపు పెంపుదలగా నమోదైంది. ఈ నేపథ్యంలో ఈ ఖరీఫ్ సీజన్ కోసం కేంద్ర ప్రభుత్వం నత్రజనికి కిలోకు రూ.47.32, ఫాస్ఫేట్ కిలోకు రూ.52.76, పొటాష్ కిలోకు రూ. 2.38సల్ఫర్ కిలోకు రూ.3.16 చొప్పున సబ్సిడీ రేటును నిర్ణయించింది.

# రామమందిరం విరాళాలపై పారదర్శకత, విద్యార్థులపై జవాబుదారీతనం ఉండాలి

## పార్లమెంట్ మకర ద్వారం వద్ద నిరసనలో మల్లు రవి

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** రామమందిర విరాళాలపై పారదర్శకత ఉండాలని విద్యార్థుల ఆందోళన విషయంలో పోలీసులతో లాఠీచార్జీ చేయించిన అంశాలో జవాబుదారీతనం ఉండాలని లోకసభ సభ్యులు మల్లు రవి అన్నారు. గురువారం పార్లమెంట్ మకర ద్వారం వద్ద ఆయన ఇండి గ్రూప్ ఎంపిలతో కలిసి నిరసన తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

AUCTION FOR SALE
Salvage disposable of damaged Volvo EC300DL Crawler Excavator 2024 lying at Chitravathi Pumped Storage Project(PSP) Sy. No. 1095/4C, Parnapalli Village, Beside Dadithota Bypass, Tadimarri Mandal, Dharmavaram, Sri Sathya Sai District, Andhra Pradesh-515631. For Sale "ON AS IS WHERE IS BASIS". Interested buyers can inspect from 31st July 2026 to 05th Aug 2026 and participate in online auction along with EMD Rs. 1,00,000/-
Auction will be held on 06th Aug 2026 (Thursday) 2:00 pm to 3:00 pm on our website:- www.auctiononline.in
Auctioneer Details: Mrs. EKTA: 9528100144

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్
బహిరంగ ప్రకటన
ప్రణాళికా విభాగం
ఫైల్ నం. 005539/HMDA/01653/SWBP/SKP2/2025
సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి (మం), కల్పకుంట (గ్రా) యొక్క సర్వే నం.196/2లో ప్లాట్ నం.15 & 16 నివాస వినియోగం నిమిత్తం నివాస భవనం/అపార్ట్‌మెంట్ కొరకు 461.25 చ.మీ. యొక్క విస్తీర్ణానికి అనుమతికి 13.08.2025 తేదీ దరఖాస్తు ప్రకారం శ్రీ చావన్ నిఖిల్ దరఖాస్తు పెట్టారు. ప్రకటింపబడిన MDP-2031 యొక్క పరిశీలనల ప్రకారం G.O.Ms No.33, MA & UD, తేదీ 24.01.2013 ప్రకారం సంగారెడ్డి మండలం, ప్రకటింపబడిన MDP-2031 ప్రకారం 206/2గా ప్రతిపాదిత సర్వే నం.196/2 ప్రతిఫలిస్తున్నందున ఆ ప్రతిపాదనను కెడస్ట్రాల్ సవరణకు మాస్టర్ ప్లాన్ సెక్షన్‌కు పంపవచ్చును మరియు కెడస్ట్రాల్ సవరణలు/చేర్పిదాలు జరిగినందున, వాటిని 11.02.2026న నిర్వర్తించబడిన కెడస్ట్రాల్ కమిటీ సమావేశంలో పెట్టబడింది. అందులో కమిటీ (కల్పకుంట (గ్రా) యొక్క సర్వే నం.లు 196/2, 194, 195/1 & 195/2) సర్వే నంబర్ల యొక్క సవరణలు/చేర్పిడిలకు సంబంధించి బహిరంగ ప్రకటన జారీ చేయడానికి అభిప్రాయపడింది.
కాబట్టి సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి (మం), కల్పకుంట (గ్రా) యొక్క సర్వే నం.196/2లోని ప్లాట్ నం.15 మరియు 16లో నివాసిత వినియోగం కొరకు సదరు నివాసిత భవనం/అపార్ట్‌మెంట్ అనుమతి యొక్క ప్లాట్ యజమానులు/కొనుగోలుదారులు/అగ్రిమెంట్ హోల్డర్లు వారి అభ్యంతరాలు/సూచనలను రాతపూర్వకంగా ఈ నోటీస్ ప్రచురణ తేదీ నుండి (15) రోజులలోపుగా ఈ కార్యాలయానికి దాఖలు చేయవచ్చును. ఎటువంటి అభ్యంతరాలు/సూచనలు పైన పేర్కొన్న పీరియడ్‌లో అందనట్లయితే, సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి (మం), కల్పకుంట (గ్రా) యొక్క సర్వే నం.196/2లోని ప్లాట్ నం.15 మరియు 16లో నివాసిత వినియోగానికి అనుమతి నివాసిత భవనం/అపార్ట్‌మెంట్ కొరకు దరఖాస్తు యొక్క అభ్యర్థనకు 461.25 చ.మీ. విస్తీర్ణానికి ఈ కార్యాలయంలో అందుబాటులో ఉన్న పత్రాల మెటీరియల్‌పై ఆధారపడి పరిగణింపబడుతుంది.
సం/- మెట్రోపాలిటన్ కమిషనర్ తరఫున, డైరెక్టర్ ప్లానింగ్-II, HMDA
DIPR.No.7019-PP/CL/Advt/1/2025-26, తేది: 30.07.2026




# భారత్‌లో ఆరు శాతం తగ్గిన పసిడి డిమాండ్

## అయినా ఆభరణాల కొనుగోలుకే ఆసక్తి

**ముంబయి, జులై 30:** భారత్‌లో పెరిగిన ధరలు, దిగుమతి సుంకం పెంపు వంటి కారణాలతో పసిడి డిమాండ్ గణనీయంగా తగ్గింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికం లో బంగారం గిరాకీ గత ఏడాదితో పోలిస్తే 6 శాతం క్షీణించి 131.4 టన్నులకు పరిమితమైంది. అనవసర కొనుగోళ్లకు స్వస్తి పలకాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుతో పాటు, సీజనల్‌గా అమ్మకాలు మందగించడం కూడా ఈ తగ్గుదలకు ప్రధాన కారణాలని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ గురువారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

2025 ఇదే కాలంలో ఈ డిమాండ్ 139.7 టన్నులుగా నమోదైంది. కొనుగోళ్ల పరిమాణం తగ్గినప్పటికీ, విలువ పరంగా మాత్రం డిమాండ్ సరికొత్త రికార్డును సృష్టించింది.

గతేడాది రూ.1,32,500 కోట్లుగా ఉన్న డిమాండ్ విలువ, ఈసారి ఏకంగా 50 శాతం వృద్ధి చెంది రూ.1,98,100 కోట్లకు చేరుకుంది. పసిడి ధరలు భారీగా పెరగడమే ఇందుకు కారణమని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్‌ఇండియా సీఈవో సచిన్ జైన్ తెలిపారు. అధిక ధరలు కొనసాగుతున్నప్పటికీ, వినియోగదారులు ఇప్పటికీ స్వర్ణానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

మొత్తం డిమాండ్‌లో కీలకమైన ఆభరణాల విక్రయాలు 15 శాతం తగ్గి 75.1 టన్నులకు పడిపోయాయి. కాగా, సురక్షిత పెట్టుబడిగా భావించే గోల్డ్ బిస్కెట్లు, నాణేల డిమాండ్ మాత్రం 9 శాతం పెరిగి 50.3 టన్నులకు చేరడం విశేషం. మరోవైపు, బంగారం దిగుమతులు 23 శాతం తగ్గి 98.1 టన్నులకు, రీసైక్లింగ్ ప్రక్రియ 17 శాతం క్షీణించి 19.2 టన్నులకు పరిమితమైంది. మే 2026లో కేంద్ర ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి ఏకంగా 15 శాతానికి పెంచిన విషయం విదితమే.

వార్త

మనిషి ఆకలితో ఉన్నప్పుడు అభిమానం, కులం, విద్య, జ్ఞానం, హోదా, అనురాగం అన్నీ మరిచిపోతాడు.

-అవ్వైయార్

# 'గిరి' బాధలు పట్టించుకోండి!


గిరిజన సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్నామని దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించామని ఒకపక్క నేతలు గొప్పలు చెప్పుకుంటున్నా మరొకపక్క కనీస వైద్యసదుపాయాలు లేక, అర్థాకలితో అల్లాడిపోతున్న కోట్లాది మంది గిరిపుత్రుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వైద్యసదుపాయాల మాట అటుంచి కడుపునిండా తిండిలేక పౌష్టికాహారం లోపించి లక్షలాది మంది గిరిజనులు అనేక వ్యాధుల బారిన పడుతున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా భావిభారత పౌరులుగా ఎదగాల్సి న గిరిజన బాలబాలికలు రేచీకటి, గ్లోకోమా, కాటరాక్ట్, విటమిన్ ఎ తదితర లోపాలతో అంధులుగా మారుతున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. సర్వేంద్రియాల్లో కళ్లుఅత్యంత ప్రధానమైనవి. అవే మూసుకుపోతే అంధులుగా మారితే ఆ వ్యక్తితోపాటు ఆ కుటుంబ పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. అవిద్య,అజ్ఞానం, మూఢత్వం, దారిద్ర్యం, ప్రకృతితోపాటు తోటిమానవుడుచేస్తున్న దోపిడీలతో గిరిజన ప్రాంతాలు అతలాకుతలమవుతున్నాయి. గిరిజనులకు ప్రత్యేక ప్యాకేజీలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న కోట్లాది నిధుల్లో అధిక శాతం వారికి చేరడం లేదనే మాట కాదనలేదనే వాస్తవం. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా వాటి కోసం ప్రత్యేకంగా సమీకృత గిరిజన అభి వృద్ధి సంస్థలు ఏర్పాటు చేసినా ఆశించిన ప్రయోజనాలు చేకూరడం లేదు. ఇప్పటికీ వేలాది గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. నడవడానికి సరైన బాటలు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. వర్షాకాలంలో బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే తండాలు, గూడెలు ఎన్నో ఉన్నాయి. వేదికలెక్కి ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా ఓట్ల కోసం పాకులాడుతున్నారే తప్ప గిరిజనాభివృద్ధికి త్రికరణశుద్ధిగా పనిచేయడం లేదనే ఆరోపణలను కొట్టివేయలేం. వైద్యం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఎండాకాలం పోయి, వర్షాకాలం ఆరంభమయ్యే సమయంలో పాతనీరు కొత్తనీరు కలయికతోపాటు వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల మలేరియా, డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభించడం వందలాది మంది అసువులు బాయడం మరెందరో రోగపీడితులు కావడం యేటా సర్వసాధారణమైపోయింది. ఈసారి కూడా అనేక గిరిజన ప్రాంతాలు విషజ్వరాల ముట్టడితో వణికిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇతర విషయాలు ఎలా ఉన్నా గిరిజనుల విషయంలో వైద్య సేవలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం క్షమార్హం కాదు. వైద్యం, విద్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి కేటా యించిన నిధులు వారికే అందేలా చూడడంలో పాల కులు విఫలమవుతున్నారని చెప్పకతప్పదు. భారత రాష్ట్రపతిగా గిరిజన తెగకు చెందిన ద్రౌపతి ముర్ము బాధ్యతలు చేపట్టిన తర్వాత వారి పరిస్థితులు కొంతలో కొంత మెరుగవుతాయని ఆశించారు. ఆ విష యంలో చర్చలు జరుగుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు యధాతథంగానే ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో పదకొండు కోట్ల మంది గిరిజనులు ఉన్నారు. అది భారతదేశ జనాభాలో 8.6 శాతం.అయినా నిధుల కేటాయింపులు మాత్రం ఆ మేరకు జరగడం లేదు. చివరకు కేటాయించిన నిధుల్లో కూడా అవి వారికి చేరడం లేదనేది కాదనలేని వాస్తవం. ఆదివాసుల ఆరోగ్య పరిస్థితి అధ్యయనం చేయడానికి దాదాపు ఒకటిన్నర దశాబ్దం క్రితం ప్రముఖ గ్రామీణ ఆరోగ్యరంగ నిపుణులు డాక్టర్ అభయ్‌బంగ్ నేతృత్వంలో కేంద్రం ఒక కమిటీని నియమించింది.ఆ కమిటీ క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటన చేసి 2018లో ఒక నివేదికను సమర్పించింది.మలేరియా వ్యాధిబారిన పడుతున్న వారిలో అత్యధికంగా ముప్పై శాతం ఆదివాసులే ఉన్నారని స్పష్టం చేసింది. ప్రతి నలు గురు గిరిజనుల్లో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడుతు న్నారని వెల్లడించింది. అలాగే దేశంలో ఇతరులతో పోలిస్తే 15-54 ఏళ్ల ఆదివాసుల్లో పొగాకు వినియోగం ఎక్కువగా ఉండి క్షయబారిన పడుతున్నట్లు తెలిపింది. ఇంకొకవైపు ఐదేళ్లలోపు ఆదివాసి చిన్నారుల్లో నలభై శాతం సరైన పౌష్టికాహారం కొరవడి గిడుగుబారిపోతున్నారని ఆ నివేదిక తెలిపింది. భారత్‌లో మొత్తం గిరిజనులు 83 శాతం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, గుజరాత్, జార్ఖండ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నారు. మరో పదిహేను శాతం ఈశాన్య రాష్ట్రాలతోపాటు బీహార్, జమ్మూకాశ్మీర్, తమిళనాడులో ఉన్నారు. అయితే వారికి ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు చికిత్స అందించేందుకు అవసరమైన స్థాయిలో ఆయా ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు అవసరం మేరకు లేవనే చెప్పొచ్చు. చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత కూడా తీవ్రంగానే ఉంది. డాక్టర్లను కిందిస్థాయి ఉద్యోగులను కొంతమేరకు నియమిస్తున్నా వారిని అక్కడికి పంపడంలో విఫలమవుతున్నారు. దీనికితోడు సరఫరా అవుతున్న మందులు నాసిరకం కావడంతో రోగాలు తగ్గక నమ్మకం సన్నగిల్లి గిరిజనులు నాటువైద్యం వైపు మొగ్గుచూపుతున్నారు. పసర్లు, వేర్లు, ఆకులతో వచ్చీరాని వైద్యం చేసుకొని ప్రాణాల మీద తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు గిరిజన సంక్షేమం మాటల్లో కాకుండా చేతల్లో చూపాల్సి న అవసరం ఉంది. రాజకీయాలకు అతీతంగా వారి అభ్యున్నతికి పాటుపడాలి. ప్రధానంగా విద్య, వైద్యం వంటి కనీస సదుపాయాలు అందించాల్సి న బాధ్యత నేతలపై ఉంది. దీన్ని విస్మరిస్తే చరిత్ర క్షమించదు.

ప్రతి వ్యక్తి తన కోర్కెలు, అనుభూతుల నిష్పత్తిని బట్టి బీదవారుగాని, ధనవంతులుగాని అవుతారు.



వి. జాన్సన్

ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే గాని భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



## సోషల్ మీడియాతో జాగ్రత్త!

సోషల్ మీడియానే జీవితం అనుకుంటే పప్పులో కాలేసినట్లే! ఎందుకంటే స్వార్థ ప్రయోజనాలకోసం బాధ్యతను విస్మరించే వ్యక్తులు, అక్రమాలకు సహకరించే సామాజిక ధోరణి ఎక్కువైంది. సమాజంలో మాట్లాడలేని బూతు పదాలు సోషల్ మీడియాలో విరివిగా దొరుకుతున్నాయి. వ్యక్తులను మార్చివేసేసోషల్ మీడియా మత్తులోపడి వ్యక్తిగత సంబంధాలకు దూరంఅవుతున్నారు.కుటుంబ సభ్యులతో సమయం గడపటానికి తీరిక లేనంతగా సెల్‌ఫోన్‌లో బిజీగా ఉంటున్నారు. ఇంటికొచ్చిన అతిధులను పలకరించేందుకు తీరికలేనంతగా ఫోన్‌కు అతుక్కుపోతున్నారు. గోప్యంగా ఉంచాల్సి న వ్యక్తిగత విషయాలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు.అంతేకాకుండా ఒకడుగు ముందుకేసిఉన్నది లేనట్టు,లేనిది ఉన్నట్టు కల్పిత వార్తలను సృష్టించి ఎందరో అమాయకుల జీవితాలతో ఆడుకుంటున్నారు.ఇటువంటి వారిపైన ప్రభుత్వాలు దృష్టిపెట్టి కఠిన చర్యలుతీసుకోవాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## బ్రాహ్మణ ఆధిపత్యమే సనాతనమా?

ఈమధ్య సనాతనం అనే పదం ఎక్కువగా ఉపయోగించబడుతుంది. పాపం సనాతనాన్ని రూపుమాపాలి అన్న స్టాలిన్ కొడుకు మీద కొంతమంది ఇరుచుకపడ్డారు. సనాతనం అంటే ఇది అనిమాత్రం ఖచ్చితంగా చెప్పటంలేదు? సాక్షాత్తు ప్రధాని అంతటి వాడికి సనాతనం అంటే తెలియక మాట్లాడుతున్నారని, పవన్ కళ్యాణ్ లాంటివారికి కూడా తెలియదు అని అనుకోలేం. మరిసనాతనం అంటే ఏమిటి?మహాచార్యులు అని పెరుగాంచిన ఆది శంకరుల వారు తన గీతాభాష్యంలో 'బ్రాహ్మణత్వన్యహి రక్షణే రక్షితశ్యాత్ వైదికోధర్మ:తదదీనత్వాత్ వర్ణాశ్రమ భేదానామ్:" అనగా వర్ణాశ్రమ వ్యవస్థ అంతా బ్రహణత్వం మీదనే ఆధారపడి ఉన్నది. అభ్యుదయవాదులు ఇంతటి అశాస్త్రీయమన సనాతనాన్ని పాతరి పెట్టాలని కోరుకుంటారు.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ఆరుబయట జాగ్రత్త

వర్షాకాల నేపథ్యంలో బోరు బావుల వద్ద కరెంటు, ట్రాన్స్ఫార్మర్ పోల్‌ల వద్ద రైతులు, చిన్న పిల్లలు చాలా జాగ్రత్తగా నడుచుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలు పోయే అవకాశం లేకపోలేదు. వీలైనంత వరకు దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## మొబైల్ ఫోన్ల వ్యసనాన్ని నివారించలేమా?

'స్మార్ట్‌ఫోన్‌లు'నేటిజీవితంలో మానవుని అంతర్భాగమైనప్పటికీ, వాటి మితిమీరిన వాడకం యువతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.సోషల్ మీడియాలో గంటల తరబడి గడపడం విద్యార్థుల ఏకాగ్రతను తగ్గిస్తోంది. ఇది వారి చదువు, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.మొబైల్ వాడకంలో ఆత్మ నియంత్రణను పెంపొందించడం నేడు అత్యవసరం.తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపడమే కాకుండా, ఉపాధ్యాయులు కూడా డిజిటల్ క్రమశిక్షణపై అవగాహన కల్పించాలి. యువతను క్రీడలు,పఠనం, సృజనాత్మక కార్యకలాపాలలో నిమగ్నం చేయడం ద్వారా మొబైల్ వ్యసనాన్ని సమర్థవంతంగా తగ్గించవచ్చు. ఇది సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## పొదుపు నేర్పాలి

ఆరు దశాబ్దాల క్రిత పైసా, రెండు, మూడు, ఐదు, పది, ఇరవయి పైసలు పావలాచేతికందగానే చిరుతిళ్లకైబాలబాలికలు చిల్లర దుకాణంవైపు పరుగులూ పడుతుంటారు. డబ్బులు కూడాపెట్టాలి. మున్ముందు చాలా అవసరం అవుతాయన్న అవగాహన, అంతగా లేని రోజులు. చేతిలో ఎన్ని పైసలున్నా ఖర్చు చేయడానికి వెనుకాడము. ఇక పిల్లలకు పొదుపు మంత్రం పాటించడానికి కుదరని పరిస్థితులు. అప్పట్లో చాలా కుటుంబాలు రాబడి తక్కువగా, వెచ్చాలు ఎక్కువగా ఉండేవి. చారాన కోడికి బారానా మసాలాగా ఉందంటే అతిశయోక్తి కాదు. అయినా కూడా చాలా ఫ్యామిలీలు కష్టపడి కీర్తి, కనకం సంపాదించుకున్న సందర్భాలు కోకొల్లలు. తల్లిదండ్రులు బాల్యం నుంచే పిల్లలకు పొదుపు నేర్పించాలి.

- ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

## అడ్వర్టైజింగ్ సబ్జెక్టు ఉండాలి

మార్కెటింగ్ వ్యవస్థలో అడ్వర్టైజింగ్ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ప్రతిరోజు ప్రతి వ్యక్తి ఏదో ఒక వస్తువును వినియోగిస్తూనే ఉంటాడు. ప్రతిమానవుడు వినియోగదారుడే. కనుక విద్యార్థులకు ఒక ఆప్షనల్ సబ్జెక్టుగా ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, విద్యార్థులకు అడ్వర్టైజింగ్ సబ్జెక్టు ఉండాలి. పూర్వం డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్టు కలిగిన వారికి బోధన రంగంలో అవకాశాలు కల్పించాలి.అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్టుమీద అవగాహనకల్పించాలి.2026- 2027 విద్యా సంవత్సరం నుండి ఈ సబ్జెక్టు ప్రారంభించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

# సైబర్ నేరాల కట్టడికి అవగాహనే ఆయుధం

**సైబర్ నేరాలను పూర్తిగా నిర్మూలించడం కష్టమైనప్పటికీ, వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడం సాధ్యమే. ఇందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ,బ్యాంకులు,సాంకేతికసంస్థలు, విద్యాసంస్థలు, మీడియా, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. చట్టాల అమలుతోపాటు వేగవంతమైన దర్యాప్తు, నేరస్థులకు కఠినశిక్షలు, అంతర్రాష్ట్ర- అంతర్జాతీయ సహ కారం కూడా అత్యంత కీలకం. సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, ప్రజల అవగాహన కూడా అంతే వేగంగా పెరగాలి. తెలంగాణ డిజిటల్ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న తరుణంలో సైబర్ భద్రతను కూడా అదేస్థాయిలో బలోపేతం చేయడం కాలానుగుణ అవసరం. ప్రతి పౌరుడు 'అనుమానం వస్తే ఆగు - ధృవీకరించు - తరువాతే చర్య తీసుకో' అనే సూత్రాన్ని పాటిస్తే సైబర్ నేరగాళ్లకు అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి. డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తతే అత్యంత విలువైన రక్షణ కవచం. సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియో గం చేసుకుంటూ భద్రతా నియమాలను పాటించడం ద్వారానే సురక్షితమైన డిజిటల్ తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుంది.**



రామ కిష్టయ్య సంగన భట్ల

డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని అపూర్వంగా సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లప్రజల సొమ్ము, వ్యక్తిగత సమాచారం, గోప్యతపై దాడులు చేయడం ఆందోళనకరంగా మారింది. నగదులావాదేవీల స్థానంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్‌వాలెట్లు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం విస్తరించడంతో సైబర్ నేరాలకు అవకాశాలు పెరిగాయి. తెలంగాణ రాష్ట్రం సమాచార సాంకేతిక రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్నప్పటికీ, అదే స్థాయిలో సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతుండటం ప్రజలను, ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి ఐటీ మహానగరంతో పాటు జిల్లాలకూ సైబర్ మోసాల విస్తరణ జరగడం ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. కొన్ని సంవత్సరాలక్రితం వరకు సైబర్ నేరాలు ప్రధానంగా ఈమెయిల్ మోసాలు, ఏటీఎం కార్డుల క్లోనింగ్, క్రెడిట్ కార్డు మోసాలకు మాత్రమే పరిమితమయ్యేవి. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, డీప్‌ఫేక్ సాంకేతికత, నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ మొబైల్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఓటీపీలు, యూపీఐ అభ్యర్థనలు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బు దోచుకునే కొత్త పద్ధతులు విస్తృతంగా పెరిగాయి. నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో మరింత చురుకుగా మారుతుండగా, సాధారణ ప్రజలలో అవగాహన అంతే వేగంగా పెరగకపోవడం సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోంది.తెలంగాణలో ప్రతి నెల వేల సంఖ్యలో సైబర్ మోసాలపై ఫిర్యాదులు నమోదవుతున్నాయి. కోట్ల రూపాయల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, చిన్న వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులు, ఐటీ నిపుణులు సైతం ఈమోసాల బారినపడుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. అత్యంత విద్యావంతులు కూడా నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోవడం ఈ నేరాల స్వరూపాన్ని తెలియజేస్తోంది. ఒక్కసారి బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ లేదా వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే కొన్ని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారిన నేరాల్లో 'డిజిటల్ అరెస్టు' మోసాలు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు అధికారులు, న్యాయస్థానాల పేర్లు చెప్పి వీడియో కాల్‌ల ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గంటల తరబడి ఫోన్‌లోనే ఉంచి వారి నుంచి లక్షల రూపాయలు బదిలీ చేయించుకునే సంఘటనలు దేశవ్యాప్తంగా వెలుగు చూశాయి. అలాగే పెట్టుబడి పెడితే రోజుల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తూ నకిలీ ట్రేడింగ్ యాప్‌ల ద్వారా కోట్ల రూపాయలు కాజేసే సంఘటనలు కూడా పెరుగుతున్నాయి. సైబర్ నేరాల పెరుగుదలకు ప్రజల




నిర్లక్ష్యం కూడా కొంత కారణమవుతోంది. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్‌లను తెరవడం, అపరిచిత యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఓటీపీలు చెప్పడం, క్యూఆర్ కోడ్‌లను విచక్షణారహితంగా స్కాన్ చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం, ఒకే సంకేత పదాన్ని అన్ని ఖాతాలకు ఉపయోగించడం వంటి అలవాట్లు నేరగాళ్లకు అవకాశాలను కల్పిస్తున్నాయి.సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా వినియోగదారుడి అప్రమత్తతే మొదటి రక్షణగా నిలుస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ సవాలును ఎదుర్కొనేందుకు అనేక చర్యలు చేపడుతోంది. రాష్ట్ర పోలీసుశాఖ ప్రత్యేక సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్లు, సైబర్ సెక్యూరిటీ విభాగాలను బలోపేతం చేసింది. సాంకేతిక నిపుణుల సహకారంతో నేరాల దర్యాప్తు, డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణ, నిధుల ట్రాకింగ్ వంటి చర్యలు వేగవంతమవుతున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, ప్రజా వేదికలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సైబర్ భద్రతపై ప్రజలకు సూచనలుఅందిస్తున్నారు. సైబర్ నేరాలపై తక్షణ ఫిర్యాదుల కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిన జాతీయ సైబర్ హెల్ప్‌లైన్1930కు వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే జాతీయ సైబర్ క్రైమ్ ఫిర్యాదు వేదిక ద్వారా కూడా బాధితులు ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. మోసంజరిగిన వెంటనే సమాచారం అందిస్తే నిధులను నిలిపివేసేఅవకాశం పెరుగుతుంది. సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ సంఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదు. తెలియని లింక్‌లను నొక్కకూడదు. అధికారిక యాప్‌లను మాత్రమే డౌన్‌లోడ్ చేయాలి. ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన సంకేత పదాలను ఉపయోగించాలి. రెండు దశల ధృవీకరణ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సందేశాలను ఎప్పటికప్పుడుపరిశీలించాలి. అనుమానాస్పద కాల్‌లువస్తే వెంటనే కాల్ నిలిపివేసి సంబంధిత సంస్థ అధికారిక నంబర్లకు సంప్రదించాలి. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతసమాచారం, కుటుంబవివరాలు, ప్రయాణ వివరాలు బహిరంగంగా పంచుకోవడాన్ని తగ్గించాలి. విద్యార్థులు, యువత, వృద్ధులు, మహిళలు వంటి వర్గాలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అత్యంతఅవసరం. విద్యాసంస్థలలో డిజిటల్ భద్రతపై పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడం, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రైవేటు సంస్థల సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, బ్యాంకులు తమ వినియోగదారులకు తరచూ హెచ్చరిక సందేశాలు పంపించడం, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచడం వంటిచర్యలు సైబర్ నేరాల నియంత్రణకు దోహదపడతాయి. అలాగే కృత్రిమ మేధస్సు ను ఉపయోగించి అనుమానాస్పద లావాదేవీలను ముందుగానే గుర్తించే వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సి న అవసరం ఉంది. సైబర్ నేరాలను పూర్తిగా నిర్మూలించడం కష్టమైనప్పటికీ, వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడం సాధ్యమే. ఇందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ,బ్యాంకులు,సాంకేతికసంస్థలు, విద్యాసంస్థలు, మీడియా, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. చట్టాల అమలుతోపాటు వేగవంతమైన దర్యాప్తు, నేరస్థులకు కఠినశిక్షలు, అంతర్రాష్ట్ర- అంతర్జాతీయ సహకారం కూడా అత్యంత కీలకం. సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, ప్రజల అవగాహన కూడా అంతే వేగంగా పెరగాలి. తెలంగాణ డిజిటల్ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న తరుణంలో సైబర్ భద్రతను కూడా అదేస్థాయిలో బలోపేతం చేయడం కాలానుగుణ అవసరం. ప్రతి పౌరుడు'అనుమానం వస్తే ఆగు - ధృవీకరించు - తరువాతే చర్య తీసుకో' అనే సూత్రాన్ని పాటిస్తే సైబర్ నేరగాళ్లకు అవకాశాలు గణనీయం గా తగ్గుతాయి. డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తతే అత్యంత విలువైన రక్షణ కవచం. సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ భద్రతా నియమాలను పాటించడం ద్వారానే సురక్షితమైన డిజిటల్ తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుంది. ●

# ఆర్థిక వృద్ధిరేటు పెరిగినా శ్రామికుల జీవితాల్లో మార్పు రాదా?



ఫిరోజ్ ఖాన్

ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనాల ప్రకారం 2026లో భారత నామమాత్రపు ఆర్థిక వ్యవస్థ సుమారు 4.15 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరువలో ఉండొచ్చని, ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే వాస్తవ జీడీపీ వృద్ధి కూడా అధిక స్థాయిలో కొనసాగుతుందని అంచనా. ఈ గణాంకాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దేశ ఆర్థికాభివృద్ధిఫలాలు శ్రమించే వ్యక్తి జీవితంలో ఎంతవరకు ప్రతిఫలిస్తున్నాయన్న ప్రశ్న సహజంగానే ముందుకు వస్తోంది. వివిధ అధికారిక అంచనాలు, అధ్యయనాల ప్రకారం భారత ఉపాధిలో సుమారు 80-90 శాతం అసంఘటిత రంగానికి సంబంధించినదిగా పేర్కొనబడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చట్టాలు, సంక్షేమ పథకాలు, డిజిటల్ వేదికల ద్వారా కార్మిక సంక్షేమాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటుండగా, అమలు స్థాయిలో ఇంకాసవాళ్లు ఉన్నాయని కార్మిక సంఘాలు, పరిశోధకులు ప్రస్తావిస్తున్నారు. అందువల్ల ఆర్థిక వృద్ధితో పాటు గౌరవప్రదమైన ఉపాధి, న్యాయమైన వేతనం, సామాజిక భద్రత కూడా సమానంగా ప్రాధాన్యం పొందాల్సి న అవసరం ఉంది. భారత రాజ్యాంగంలోని అధికరణలు 14, 21సమానత్వం, గౌరవప్రదమైన జీవన హక్కులను పరిరక్షిస్తాయి. అలాగే రాష్ట్ర విధాన మార్గదర్శక సూత్రాలలోని అధికరణలు 39, 41, 43 పనికి తగిన వేతనం, జీవనోపాధి, సామాజిక భద్రత వంటి లక్ష్యాలను సూచిస్తాయి. ఈ దిశగా పార్లమెంట్ వేతనాల సంహిత, 2019ను ఆమోదించింది. ఇతర కార్మిక సంహితల అమలు కూడా సంబంధిత నోటిఫికేషన్లు, నియమాల ప్రకారం దశలవారీగా కొనసాగుతోంది. పరిశ్రమల ప్రతినిధులు పెట్టుబడులు, ఉత్పాదకత, పోటీతత్వం, ఉపాధి సృష్టిని సమతుల్యంగా పరిగణించాలని సూచిస్తుండగా, కార్మిక సంఘాలు కనీస వేతనాల



సమర్థ అమలు, అసంఘటిత రంగంలో పర్యవేక్షణ బలోపేతాన్ని కోరుతున్నాయి. రాష్ట్రాల మధ్య వేతన విధానాల్లో వ్యత్యాసాలు, అమలు సవాళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో చట్టం శ్రామికుడి జీవితంలో ప్రత్యక్ష ఫలితాలుగా కనిపించడమే అసలు లక్ష్యం.తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలుకూడా నిత్యావసర వినియోగంద్వారా పరోక్ష పన్నుల వ్యవస్థలో భాగస్వాములవుతాయి. అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈశ్రమ్, ఆయుష్మాన్ భారత్, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం ఈశ్రమ్ పోర్టల్‌లో 31 కోట్లకు పైగా కార్మికులు నమోదు కావడం ఈ రంగాన్ని అధికారిక వ్యవస్థతో అనుసంధానించే ప్రయత్నాలకు సూచికగా భావించవచ్చు. అదే సమయంలో గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికులు సహాకొన్ని వర్గాలకు సంక్షేమ పథకాల పూర్తి ప్రయోజనాలు సమానంగా చేరేవిషయంలో ఇంకా మెరుగుదలకు అవకాశంఉందని స్వతంత్ర అధ్యయనాలు సూచిస్తున్నాయి. డిజిటల్ సేవల విస్తరణతో హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెరుగుతున్నా, సమర్థవంతమైన అమలు, పారదర్శక పరిపాలనే వాటి విజయాన్ని నిర్ణయిస్తుంది. ఆర్థిక వృద్ధి,పెట్టుబడులు, పరిశ్రమలు, ఎగుమతులు దేశాభివృద్ధికి కీలకం. అయితే ఆ అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు, ముఖ్యంగా శ్రమించే కార్మికులకు చేరినప్పుడే అది సమగ్ర అభివృద్ధిగా నిలుస్తుంది. అంతర్జాతీయ కార్మికసంస్థ గౌరవప్రదమైన పని, సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలను స్థిరమైన అభివృద్ధికి కీలక అంశాలుగా పేర్కొంటోంది. అందువల్ల ఒక దేశ విజయాన్ని కేవలం జీడీపీ లేదా ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు, ఉపాధి నాణ్యత, సామాజిక భద్రత, అవకాశాల సమానత్వంతో కూడా కొలవాలి. ప్రభుత్వాలు విధానాలు రూపొందించడం, పరిశ్రమలు ఉపాధి సృష్టించడం, కార్మికులు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవడం, ఈ మూడు అంశాలు సమన్వయంతోముందుకు సాగినప్పుడే ఆర్థికాభివృద్ధి సామాజిక న్యాయంగా మారుతుంది. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఒక ముఖ్యమైన ఆర్థిక మైలురాయి కావచ్చు. అయితే ఆ అభివృద్ధి ఫలాలు చివరి శ్రామికకుటుంబం జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచినప్పుడే ఆ విజయానికి పూర్తి అర్థం వస్తుంది. ●

# బనకచర్ల పేరుతో విభేదాలు అవసరమా?



అన్నవరపు బ్రహ్మయ్య

బనకచర్ల జలాశయ ప్రాజెక్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ల మధ్య అనవసరమైన రాజకీయ చర్చకు దారితీస్తోంది. నిజానికి ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగా గోదావరి నదికి, తెలంగాణకు ఏమాత్రం సంబంధం లేదు. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే ఒక సాగునీరు తాగునీరుకు సంబంధించినది. గోదావరికి వరదలు వచ్చే సమయంలోవృధాగా సముద్రంలో కలిసిపోయే నీళ్లను ఒడిసి పట్టుకొనే పథకం పోలవరం. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి విభజన చట్టంలో కేంద్రప్రభుత్వం కూడా అంగీకరించింది. ఆ పోలవరం ప్రాజెక్ట్ నుంచి కృష్ణానది ద్వారా కరవు పీడిత రాయలసీమ ప్రాంతాన్ని సారవంతమైన భూమిగా మార్చేందుకు రూపొందించిన పథకం ఈ బనకచర్ల జలాశయ ప్రాజెక్టు. అయితే బనకచర్ల ప్రాజెక్ట్ 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని బిఆర్ఎస్ నేత మాజీమంత్రి హరీష్ రావు వ్యాఖ్యానించారు. బనకచర్ల ప్రాజెక్ట్ అనేది వృథాగా సముద్రంలో కలిసిపోయే నీటిని పట్టుకొనే పథకం మాత్రమేనని దీనికి తెలంగాణ రాష్ట్రానికి ఎటువుంటి సంబంధం లేదని ఆంధ్రప్రదేశ్ విద్యా ఐటి శాఖామాత్యులు నారా లోకేష్ వివరించారు. తెలంగాణ పరిధిలో గోదావరి నదిపై ఎన్ని పథకాలు కట్టుకున్న మాకు అభ్యంతరం లేదు, ఎందుకంటే బనకచర్ల వృథాగాపోయే వరద నీటినిమాత్రమే ఒడిసి పట్టుకుంటుందని మంత్రి లోకేష్ ఇచ్చిన వివరణపై ఆలోచించాలి. అందుబాటులో వున్న సమాచారం ప్రకారం 2016 నుంచి 2024 సంవత్సరాల మధ్య కాలంలో దాదాపు 28,500 టిఎంసిల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలిసిపోయింది. ఒక్క 2024 సంవత్సరంలోనే 2,828టి. ఎం.సి. నీరు సముద్రంలోకి వృథాగా పోయింది. ఈ నేపథ్యంలో వృధాగా పోయేనీటిని ఒడిసి పట్టేందుకు రూపొందించినదే పోలవరం ప్రాజెక్ట్. పోలవరం ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ గోదావరి నీటిని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వద్ద వున్న ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణానదిలో కలుపుతారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి గుంటూరు జిల్లాలోని బొల్లపల్లి జలాశయానికి అక్కడ నుండి నంద్యాల జిల్లా బనకచర్ల జలాశయానికి పలు ఎత్తిపోతల కేంద్రాలు, సొరంగాల ద్వారా నీటిని తరలిస్తారు. బనకచర్లలో నిర్మించే



జలాశయం సామర్థ్యం 20వేల క్యూసెక్కు బనకచర్ల జలాశయం నుంచి ప్రవహించే నీరు శ్రీశైలం కుడికాల్వకు ఇదిఅనుసంధానం అవుతుంది. గోదావరికి వరదలు వచ్చి, ఆ నీరు కృష్ణానది ద్వారా బనకచర్లకు నీరు వస్తే రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాలో అదనంగా దాదాపు 7.5 లక్షల ఎకరాలకు సాగునీరు లభించడమే కాకుండా 20లక్షల మందికి దాహార్తి తీర్చుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో తెలంగాణకు ఏ మాత్రం సంబంధంలేదు. అంతేకాకుండా ఈ ప్రాజెక్ట్ కేవలం వరదల కారణంగా వృథాగా సముద్రంలో కలిసిపోయే నీటిని దృష్టిలో పెట్టుకొని నిర్మిస్తున్నది. ఈ నేపథ్యంలో గోదావరికి వరదలు రానిపక్షంలో ఈ పథకం వల్ల ఎటువంటి ప్రయోజనం వుండదు. ఈ విషయం పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అవగాహన వున్నప్పటికీ ఎప్పుడు వరదలు వస్తే అప్పుడే వృథా నీటిని ఉపయోగించుకోవచ్చుననే ఉద్దేశ్యంతో బనకచర్లను రూపొందిస్తోంది. దీనిని బట్టి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన లాభనష్టాలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే చెందుతాయి. బనకచర్ల ప్రాజెక్ట్ పూర్తయితే రాయలసీమ సస్యశ్యామలంగా మారుతుంది. అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు చిరస్థాయిగా నిలిచిపోవడమే కాకుండా తెలుగు దేశం పార్టీకి రాజకీయంగా పట్టు పెరుగుతుంది. సాఫ్ట్వేర్ వంటి అంశాలలోనే కాకుండా చంద్రబాబు నాయుడుకు నీటిపారుదల పథకాల పట్ల కూడా ముందుచూపు వుందని, అందుకు నిదర్శనమే పట్టిసీమ ఎత్తిపోతల పథకం అని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.పోలవరంకు అనుసంధానంగా 2016న సంవత్సరంలో ప్రారంభమైన పట్టిసీమ ప్రాజెక్ట్ ఖర్చుచేసింది 1660 కోట్ల రూపాయలు. ప్రాజెక్ట్ ప్రారంభమైన నాటినుంచి నేటివరకు 442టిఎంసిల నీరు కృష్ణాడెల్టాకు అందింది. దీంతో రైతులు 10 వేల కోట్ల రూపాయల విలువైనపంటలు పండించుకోగలిగారు.ఎల్‌నినో నేపథ్యంతో వర్షాలు పడని స్థితిలో కూడా పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు అందిస్తున్నారు. పట్టిసీమ తరహాలోనే వృథాగా సముద్రంలో కలిసే నీటిని దృష్టిలో పెట్టుకొని ఈ పథకాన్ని చంద్రబాబు నాయుడు రూపొందించారు. నికర జలాలతో ఈ పథకానికి సంబంధమే లేదు.ఈస్థితిలో తెలంగాణ రాష్ట్రానికి వస్తున్న నష్టంగానీ, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఉల్లంఘించే అంశం ఏమిటో అర్థం కావడం లేదు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టుకు కృష్ణానదీ నిర్వహణ బోర్డు, గోదావరి నదీ నిర్వహణ బోర్డుల నుంచి అవసరమైన అనుమతులు లభించలేదని తెలంగాణ నేతలు పేర్కొంటున్నారు. నికర జలాలు వాడుకొనేటప్పుడు లేదా వాటా అడుగుతున్నప్పుడు అనుమతులుఅవసరమవుతాయి. శ్యాస్త్రీయంగా, పాలనాపరంగా ఎటువంటి ఇబ్బంది లేకపోయినా బనకచర్ల పేరుతో మరోసారి ఆంధ్ర,తెలంగాణ ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం భావ్యం కాదు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)



# జంతర్ మంతర్ నిరసనలో 2,873మంది నేరస్తులు

## ఫేషియల్ రికగ్నిషన్‌తో గుర్తించిన ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ,జులై 30:** కాక్‌రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఇటీవల జరిగిన జంతర్ మంతర్ నిరసనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు కీలక డోసియర్‌ను సిద్ధం చేశారు. ఈ డోసియర్‌లో నిరసనల్లో పాల్గొన్నట్లు గుర్తించిన నేర చరిత్ర కలిగిన వ్యక్తుల ఫొటోలు, పోలీసు రికార్డులు, వారి నేర నేపథ్యానికి సంబంధించిన వివరాలను పొందుపరిచినట్లు సమాచారం. ఈ పత్రాలను పార్లమెంట్ ముందుంచినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.ఢిల్లీ పోలీసుల ప్రకారం జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో 2,800 మందికి పైగా నేర చరిత్ర కలిగిన వ్యక్తులు పాల్గొన్నట్లు గుర్తించారు. నిరసనల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో వీరిలో ఎవరైనా ప్రమేయం ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.పోలీసు వర్గాల సమాచారం మేరకు, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ సాంకేతికతతో పాటు ఇతర ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా 2,873 మంది నేర చరిత్ర కలిగిన వ్యక్తులను గుర్తించారు. నిరసనల కాలంలో వీరి కదలికలు, హింసాత్మక ఘటనలతో వీరికి ఉన్న సంబంధాలపై ప్రత్యేకంగా విచారణ చేపట్టారు.989 మంది తీవ్రమైన నేరాల కేసుల్లో నిందితులని పోలీసుల వెల్లడిగుర్తించిన 2,873 మందిలో 989 మంది తీవ్రమైన నేరాల కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. వీరిలో101 మంది హత్య కేసుల్లో,62 మంది హత్యాయత్నం కేసుల్లో,284 మంది దోపిడీ, దొంగతనం కేసుల్లో,61 మంది అత్యాచార కేసుల్లో,6 మంది పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో,25 మంది మహిళలపై వేధింపుల కేసుల్లో,229 మంది ఆయుధాల చట్టం ఉల్లంఘన కేసుల్లో,135 మంది స్నాచింగ్ కేసుల్లో,19 మంది కిడ్నాప్ కేసుల్లో,67 మంది మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు డోసియర్‌లో పేర్కొన్నారు.పునరావృత నేరస్తుల సంఖ్య కూడా గణనీయమేడోసియర్ ప్రకారం, గుర్తించిన వారిలో గణనీయమైన సంఖ్యలో పునరావృత నేరస్తులు కూడా ఉన్నారు.హత్య కేసుల్లో ఉన్న 101 మందిలో 42 మందిపై రెండు లేదా అంతకంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయి.వీరిలో 12 మందిపై పది లేదా అంతకంటే ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.దోపిడీ, రాబరీ కేసుల్లో ఉన్న 284 మందిలో 155 మందిపై రెండు లేదా అంతకంటే ఎక్కువ కేసులు, 31 మందిపై పది లేదా అంతకంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయి. హత్యాయత్నం కేసుల్లో ఉన్న 62 మందిలో 25 మందిపై బహుళ క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసు రికార్డులు సూచిస్తున్నాయి.దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడిపోలీసు వర్గాల ప్రకారం, నిరసనల్లో పాల్గొన్న వారిలో చాలామంది కేవలం ఒకే ఒక్క కేసులో నిందితులు కాకుండా, హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు, మహిళలపై నేరాలు, కిడ్నాప్‌లు, మాదకద్రవ్యాల కేసులు, ఆయుధాల చట్టం ఉల్లంఘన వంటి తీవ్రమైన నేరాల్లో పలుమార్లు ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులుగా గుర్తించబడ్డారు.అయితే, నేర చరిత్ర ఉన్న వ్యక్తులు నిరసనల్లో పాల్గొనడం మాత్రమే వారు నిరసనల సందర్భంగా జరిగిన హింసకు బాధ్యులని నిర్ధారించదని, ఆ అంశంపై దర్యాప్తు కొనసాగుతోందని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. హింసాత్మక ఘటనల్లో ప్రత్యక్ష ప్రమేయం ఉన్న వారిని గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజ్, ఫేషియల్ రికగ్నిషన్ డేటా, ఇతర డిజిటల్ ఆధారాలను విశ్లేషిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



## వందే మాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ

### పార్లమెంట్ ఆమోదం

**న్యూఢిల్లీ, జులై 30:** జాతీయ గీతం జనగణమనకు ప్రస్తుతం ఉన్న చట్టబద్ధ రక్షణను జాతీయ గేయం వందే మాతరంకు కూడా కల్పించేప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (సవరణ) బిల్లు–2026 పార్లమెంట్ గురువారం ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం వందే మాతరాన్ని అవమానించే చర్యలకు గరిష్ఠంగా మూడుసంవత్సరాల జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది.బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ ఇది కేవలం చట్ట సవరణ మాత్రమే కాదని, భారత సాంస్కృతిక వారసత్వం, జాతీయ గుర్తింపు, స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని ప్రతిబింబించే కీలక నిర్ణయమని పేర్కొన్నారు. వందే మాతరం కేవలం ఒక పాట కాదని, దేశ ఆత్మకు ప్రతిరూపంగా నిలిచిందని, స్వాతంత్ర్య ఉద్యమంలో లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులకు ఇది ప్రేరణగా నిలిచిందని ఆయన అన్నారు.చారిత్రక సంఘటనను ప్రస్తావించిన నిత్యానంద్ రాయ్ దేశ తొలి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 1947 ఆగస్టు 15 ఉదయం 6.30గంటలకు ఆకాశవాణిలో పూర్తి స్థాయిలో వందే మాతరం ఆలపించాలని సర్దార్ వల్లభ భాయ్ పటేల్, ప్రముఖగాయకుడు పండిట్ ఓంకార్‌నాథ్ ఠాకూర్‌ను కోరిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ సవరణతో దేశభక్తి, జాతీయగౌరవం, స్వాతంత్ర్య సమర వారసత్వానికి మరింత బలం చేకూరుతుందని కేంద్ర మంత్రి తెలిపారు.అయితే ఈ బిల్లుపై ప్రతిపక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చర్చలో పాల్గొన్న డీఎంకే ఎంపీ కనిమొళి మాట్లాడుతూ, ఈ చట్టం దేశ ప్రజల మధ్య విభేదాలను పెంచే అవకాశముందని విమర్శించారు.మరోవైపు బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా, వందే మాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత ఏడాది నవంబర్ నుంచి కేంద్ర ప్రభుత్వం ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సవరణతో జాతీయ గేయమైన వందే మాతరంకు చట్టబద్ధమైన రక్షణ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# బిజెపిలో చేరకపోతే చంపేస్తామంటున్నారు

## సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే ఆరోపణలు



**ముంబయి,జులై 30:** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను భారతీయ జనతా పార్టీలో చేరాలని కొందరు బెదిరిస్తున్నారని ఆరోపించారాయన. కాషాయం పార్టీలో చేరకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారన్నారు. తన కుటుంబ సభ్యులను చంపేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఈ బెదిరింపులపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు దీప్కే తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే వారిపై ఇలా బెదిరింపులకు పాల్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెల్లెట్ గన్స్ వినియోగంపై కూడా స్పందించారు దీప్కే. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ ప్రయోగానికి సంబంధించిన విధానంపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని కోరారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్య తను మరో నాయ కుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపా లని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణ పాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యా ర్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువ తలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థంచేసుకోలేక పోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు.

## కుంభకోణంలో నిందితుడు 3 ప్రభుత్వ రంగ సంస్థలకు ఎలా అధిపతి?

### కేరళ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



**కొచ్చి, జులై 30:** రూ.600 కోట్ల జీడిపప్పు అభివృద్ధి సంస్థ (కాష్యూ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కుంభకోణంలో విచారణ ఎదుర్కొంటున్న ఒక సీనియర్ అధికారిని కీలక ప్రభుత్వ రంగ పదవులలో కొనసాగించినందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వాన్ని కేరళ హైకోర్టు తీవ్రంగా విమర్శించింది. సామాజిక కార్యకర్త కెఎం షాజహాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరుపుతూ, ఒక పెద్ద అవినీతి కేసులో నిందితుడిగా ఉన్న అధికారికి కీలక ప్రభుత్వ సంస్థల బాధ్యతలను ఎలా అప్పగించగలరని జస్టిస్ ఎ. బధర్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. సిబిఐ కేసులో ప్రధాన నిందితుడైన డాక్టర్ కెఎ రతీష్, కేరళ ఖాదీ బోర్డు కార్యదర్శిగా, కేరళ స్టేట్ రుద్రానిక్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, కేరళ ఖాదీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారిగా కొనసాగడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన హైకోర్టు, నాలుగు వారాల్లోగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరణ కోరింది. "ఇంతటి ప్రధాన అవినీతి నిందితుడిని మూడు ముఖ్యమైన సంస్థలకు అధిపతులుగా ప్రభుత్వం నియమించిందా?" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆ పదవులే అవినీతికి విస్తృత ఆస్కారం కల్పిస్తున్నాయని కూడా అది పేర్కొంది. రతీష్‌పై ఆరోపణలు తీవ్రమైనవని గమనించిన కేరళ హైకోర్టు, క్రిమినల్ విచారణ పెండింగ్‌లో ఉన్నప్పటికీ అటువంటి నియామకాలను ఎలా సమర్థించుకున్నారో వివరణ కోరింది.

# నన్ను యంగ్ హృతిక్‌రోషన్ అంటారు తెలుసా..

## కంగనా రనౌత్ వ్యాఖ్యలపై సిజెపి సౌరవ్‌దాస్ కౌంటర్



**న్యూఢిల్లీ,జులై 30:** బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. జెన్‌జీ విద్యార్థుల నిరసనలతో మొదలైన ఈ వివాదం వ్యక్తిగత విమర్శల వరకు వెళ్లింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కంగనాకు సౌరవ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గతంలో హృతిక్ రోషన్, కంగనా మధ్య జరిగిన వివాదాన్ని గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కంగనా తనను లక్ష్యంగా చేసుకోవడంపై స్పందించిన సౌరవ్ తన స్నేహితులు కూడా అదే విషయాన్ని ప్రశ్నిం చారని చెప్పారు. వారిలో ఒకరు తాను యంగ్ హృతిక్ రోషన్‌లా కనిపిస్తానని చెప్పారని, అందుకే కంగనా తనపై ఎక్కువగా స్పంది స్తోందేమోనని సరదాగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా కంగనా మాట్లాడే తీరు నిరాశతో నిండినట్లుగా ఉందని, ఆమె మాటలు మానసికంగా స్థిరంగా ఉన్న వ్యక్తి మాట్లాడినట్లుగా అని పించడంలేదన్నారు. దేశ యువతను అవమానించేలా మాట్లాడ కూడదని, ప్రజాప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

కంగనాపై తనకు ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని తెలిపిన సౌరవ్ ఆమె మాత్రం వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తున్నా రని ఆరోపించారు.కంగనాతో కాఫీకి వెళ్లేందుకు కూడా తనకు ఎలాం టి అభ్యంతరం లేదని, ఎవరి పట్లా వ్యక్తిగత వైరం లేదని చెప్పారు. ఈవివాదం జెన్‌జీ నిరసనలపై కంగనాచేసిన వ్యాఖ్యలతో ప్రారంభమైంది.

# జెర్సీ రంగు మారిస్తే సరిపోతుందా?

## దేశ ఆత్మను ఎవ్వరూ మార్చలేరు: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ,జులై 30:** భారత హాకీ జట్టు సంప్రదాయ నీలం జెర్సీ స్థానంలో ప్రపంచకప్ కోసం కాషాయ రంగు జెర్సీని ప్రవేశపెట్టడంపై రాజకీయ రంగు పులుముకుంది. మాజీ కెప్టెన్ విరేన్ రస్కిన్హా ఈ నిర్ణయాన్ని ప్రశ్నించారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా దీనిపై స్పందించారు. జెర్సీ మార్పు ఒక్కటే కాదని, చరిత్రను మార్చే ప్రయత్నాలు జరిగినా దేశ యువత తన అభిప్రాయాన్ని ఇప్పటికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ బయట మీడియాతో మాట్లాడిన ఆమె, దేశ ఆత్మను మాత్రం మార్చలేరని అన్నారు. జెర్సీ మార్చినా, విద్యా విధానంలో చరిత్రను తిరగరాయాలని చూసినా ప్రజల ఆలోచనలను మార్చడం సాధ్యం కాదని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో యువత వ్యక్తం చేసిన అభిప్రాయాలే దేశ స్వరమని చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటం అహింస, సత్యం అనే విలువలపై నిర్మితమైందని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని, ఈ విషయాన్ని దేశ ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిందని చెప్పారు. సోదరభావం, ఐక్యత, సత్యం, అహింసలోనే దేశ ఆత్మ ఉందని ప్రియాంక స్పష్టం చేశారు. ద్వేషం రెచ్చగొట్టినా, హింసను ప్రోత్సహించినా భారత మూల విలువలను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని చెప్పారు. రాజకీయ భావజాలం పేరుతో దేశ స్వభావాన్ని మార్చడం అసాధ్యమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్ కోసం ప్రకటించిన కొత్త జెర్సీపై భారత హాకీమాజీకెప్టెన్ విరేన్ రస్కిన్హా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత హాకీ అంటే అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చేది నీలం జెర్సీయేనని చెప్పారు. తాను ఎన్నో ఏళ్లు దాన్నే ధరించి దేశానికి ప్రాతినిధ్యం వహించానని గుర్తుచేశారు. అభిమానుల మనసుల్లో ఆ రంగుకే ప్రత్యేక స్థానం ఉందని, అలాంటప్పుడు కాషాయ రంగును ఎందుకు ఎంచుకున్నారో అర్థం కావడంలేదని ప్రశ్నించారు. రస్కిన్హా వ్యాఖ్యల తర్వాత హాకీ ఇండియా కొత్త జెర్సీ రూపకల్పన వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించింది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయానికి ప్రతీకగా ఎంచుకున్నట్లు తెలిపింది. భారత జాతీయ పతాకం, ఉదయించే సూర్యుడి స్ఫూర్తితో ఈ రంగును తీసుకున్నామని పేర్కొంది. అశోక చక్రాన్ని గుర్తు చేసే నేవీ బ్లూ అంచులు, మండల కళారూపాలు,సుదర్శన చక్రం స్ఫూర్తితో రూపొందించిన డిజైన్ భారతసంస్కృతి, ఐక్యత, పురోగతిని ప్రతి బింబిస్తుందని వెల్లడించింది.ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌భావనకు అను గుణంగానే ఈ జెర్సీని రూపొందించినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది.

## 35 సంచుల్లో నోట్ల కట్టలు.. లెక్కగట్టలేక మొరాయించిన మెషీన్లు

**కోల్‌కతా, జులై 30:** పశ్చిమ బెంగాల్‌లో ఓ మాజీ బస్సు డ్రైవర్ ఇంట్లో భారీగా నగదు, బంగారం బయటపడటం రాజకీయ, అధికారవర్గాల్లో కలకలం రేపింది. బీర్భూమ్ జిల్లాలని దేవ్‌చా గ్రామానికి చెందిన మినార్ మొండల్ ఇంటిపై రాష్ట్ర పోలీసులు బుధవారంరాత్రి ఆకస్మికంగా సోదాలు నిర్వహించగా, 35 సంచుల్లో దాచిపెట్టిన రూ. 28 కోట్లకుపైగా నగదు, సుమారు రూ. 21.5 కోట్ల విలువైన 15 కిలోల బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. నగదును లెక్కించేందుకు ఐదు కౌంటింగ్ మెషీన్లు వినియోగించినప్పటికీ అవి వరుసగా పనిచేయకపోవడంతో అధికారులు మరోసారి యంత్రాలను మార్చాల్సి వచ్చింది.



## ఎన్నిక కాని వ్యక్తికి 7 నెలలైనా మంత్రి పదవి ఎలా?

### బీహార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 30:** ఆరు నెలలకు పైగా బీహార్ శాసనసభలోని ఏ సభకు కూడా ఎన్నిక కానప్పటికీ, దీపక్ ప్రకాష్‌ను రాష్ట్ర మంత్రిగా ఎందుకు కొనసాగిస్తున్నారో వివరించాలని సుప్రీంకోర్టు గురువారం బీహార్ ప్రభుత్వాన్ని కోరింది. శాసనసభ లేదా శాసన మండలిలో సభ్యుడు కానప్పటికీ, ప్రకాష్‌ను బీహార్ పంచాయతీరాజ్ మంత్రిగా తిరిగి నియమించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. 'ఏ సభకు ఎన్నిక కాని మంత్రిని ఆరు నెలలకు మించి ఎలా కొన సాగిస్తారు?' అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని వచ్చే మంగళవారం విచారణకు జాబితా చేయాలని ధర్మాసనం ఆదేశించింది.రాకేష్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో, ప్రకాష్‌ను మొదట నవంబర్ 20, 2025న మంత్రిగా నియమించారని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(4) ప్రకారం ఆయన ఆరు నెలల్లోగా శాసనసభ సభ్యుడిగా ఎన్నిక కావాల్సి ఉందని, అలా చేయడంలో విఫలమైతే మే 20, 2026న ఆయన పదవిలో ఉండరని వాదించారు. మొదట ఎన్నిక కాకుండానే ఆయనను తిరిగి నియమించారని, తద్వారా ఆరు నెలల కాలపరిమితిని మళ్లీ ప్రారంభించారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. బీహార్ ప్రభుత్వానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి, దీపక్ ప్రకాష్‌కు నోటీసులు జారీ చేసి, పిటిషన్‌పై వారి స్పందనలను కోరింది. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, ప్రకాష్ తమ సమాధానాలను దాఖలు చేసిన తర్వాత ఈ కేసువిచారణ ముందుకు సాగుతుందని భావిస్తున్నారు. అటువంటి పునర్నియామకానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(4) అనుమతిస్తుందా లేదా అనే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించనుంది.

# వాస్తవికంగా ఆలోచించండి

## ఎఫ్‌డిఎకు బాంబే హైకోర్టు సూచన

### హోటల్ లైసెన్స్ సస్పెన్షన్ కొట్టివేత

**ముంబై, జులై 30:** 'మనం భారతదేశంలో ఉన్నాం' అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, వాస్తవిక దృక్పథాన్ని అవలంబించాలని మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ)కు బాంబే హైకోర్టు సూచించింది. పరిశుభ్రత విషయంలో నవీ ముంబైలోని ఒక ఫోర్‌స్టార్ హోటల్ లైసెన్సును సస్పెండ్ చేస్తూ మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) జారీ చేసిన ఉత్తర్వును కూడా కోర్టు కొట్టివేసింది. హోటల్‌కు ఊరటనిస్తూ, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఎసిజె) రవీంద్రఘుగే, జస్టిస్ గౌతమ్ అంఖడ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. 'పరిశుభ్రత, నిర్వహణ, కార్యకలాపాలపై ఉన్న మొత్తం 'సంతృప్తికరమైన' సమ్మతి నివేదికతో పోల్చి చూసినప్పుడు, 'రెండు కీటకాలు ఉన్నట్లు తేలిన ఏకైక అంశం' లైసెన్సును నిరంతరం నిలిపివేయడాన్ని సమర్థించదని కోర్టు పేర్కొంది. ఆహార భద్రతా చట్టం ప్రకారం, ఆహార భద్రతా కమిషనర్ ముందు అప్పీల్ చేసుకునేందుకు చట్టబద్ధమైన మార్గం ఉందని ఆమె తెలిపారు.అయితే, ఆ సంస్థ నిర్దేశించిన నిబంధనలను గణనీయంగా పాటించినప్పుడు, కేవలం అటువంటి లోపం కారణంగానే సస్పెన్షన్ వంటి తీవ్రమైన చర్య తీసుకోవడం సమర్థనీయమా అని ధర్మాసనం ప్రశ్నించింది. సస్పెన్షన్ ఉత్తర్వును రద్దు చేస్తూ, హోటల్ ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ లైసెన్సును తక్షణమే పునరుద్ధరించి, దాని ఆహార వ్యాపార కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడానికి అనుమతించాలని అధికారులను ధర్మాసనం ఆదేశించింది. మంత్రాలయ, హైకోర్టులోని క్యాంటీన్లతో సహా అన్ని ప్రభుత్వ భోజనశాలలను తనిఖీ చేసి, వీడియో రికార్డింగ్‌లతో పాటు తనిఖీల స్థితిని సమర్పించాలని ఎఫ్‌డిఎని ఆదేశించింది.

# ఆ రికార్డులను భద్రపర్చండి

## కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

### గాయపడిన వారికి వైద్యమందించండి: ఢిల్లీ ప్రభుత్వానికి ఆదేశాలు

**న్యూఢిల్లీ, జులై 30:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలపై దిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్స్ వినియోగంపై సుప్రీంకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. జంతర్‌మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో నిరసన చేపట్టిన విద్యార్థులపైకి భద్రతా బలగాలు పెల్లెట్ గన్స్ వినియోగించిన మందుగుండు సామగ్రికి సంబంధించిన రికార్డులను భద్రపరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం అసాధారణ పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడటాన్ని పోలీసు నిబంధనలు అనుమతిస్తున్నాయని పేర్కొన్నది. పెల్లెట్ గన్స్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. అసాధారణ పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్‌ను వినియోగించే అధికారాలు పోలీసులకు ఉన్నాయని తెలిపింది.అయితే, ఈ కేసులో వాటి వినియోగం ఎలా జరిగిందనే అంశాన్ని పరిశీలిం చేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది.

**గాయపడిన వారికి ఉత్తమ వైద్యం అందించాలి**

ఆ నిరసనల్లో పెల్లెట్ గాయాలు పొందిన వారికి అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఢిల్లీప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశిం చింది. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని వైద్యసదుపాయాలు కల్పించాలని సూచించింది.



## వదిన తలనరికి హత్యచేసిన మరిది

**పాట్నా,జులై 30:** బీహార్‌లో దారుణ ఘటన జరిగింది. వదిన వంట ఆలస్యం చేసిందని ఏకంగా ఆమె తల నరికి చంపాడు మరిది. ఈ ఘటన బిహార్, జెహనాబాద్ జిల్లా, పార్సా బిగా పోలీస్ స్టేషన్ పరిధి లోని ఇమాద్‌పూర్ గ్రామంలో జరిగింది. మృతురాలిని అన్షుదేవి (25)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధర్మేంద్ర కుమార్ భార్య అన్షు దేవి. ఘటన జరిగిన సమయంలో అన్షు భర్త ధర్మేంద్రతోపాటు కుటుంబమంతా వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లింది. ఆమె మరిది కునాల్ కుమార్ పని చేసి, ఇంటి వచ్చి త్వరగా వంటచేసి, ఆహారం వడ్డించాలని వదిన అన్షుదేవిని కోరాడు. ఈ క్రమంలో వంట ఆలస్యం చేయడంపై కునాల్ తన వదినపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఇద్దరిమధ్యా కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తీవ్ర ఆవేశానికి లోనైన కునాల్ కుమార్ తన వదినపై దాడి చేసి గొడ్డలితో నరికి చంపాడు. ఆమె తలను వేరు చేసి ఇంటి సమీపంలో ఉన్న మర్రిచెట్టుకు వేలాడదీశాడు. ఆ ఇంట్లో ఏదో గొడవ జరుగుతోందని గమనించిన చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూశారు. అదే సమయంలో అక్కడ కొద్ది దూరంలో ఉన్న మర్రిచెట్టుకు అన్షుదేవి తల వేలాడుతూ కనిపించింది. దీంతో ఆ దృశ్యం చూసి షాక్‌కు గురైన వారు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు కునాల్ కుమార్‌ను అరెస్టు చేశారు.

## పాకిస్థాన్ కాశ్మీర్ అంటూ ఏమీలేదు..ఆక్రమిత కాశ్మీర్ మాత్రమే: భారత్

**వాషింగ్టన్, జులై 30:** పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరుగుతోన్న ఘర్షణలను ప్రస్తావిస్తూ అమెరికా మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్' రాసిన కథనం వివాదానికి దారితీసింది. 'స్థానిక ఎన్నికలు ప్రారంభం కాగానే పాకిస్థాన్ కాశ్మీర్‌లో ఘర్షణలు చెలరేగాయి' అంటూ ఆ కథనానికి శీర్షిక పెట్టింది. దీనిపై అమెరికాలోని భారత రాయబార కార్యాలయం తీవ్రంగా స్పందించింది. అందులో ప్రస్తావించిన పేర్లను ఖండించింది. 'అది తప్పుదోవ పట్టించే శీర్షిక. పాకిస్థాన్ కాశ్మీర్ అంటూ ఏదీ లేదు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ మాత్రమే. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ముకాశ్మీర్, లద్దాఖ్, ఎలప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. వీటిలోని కొన్ని భాగాలను పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. ఇప్పుడు అక్కడి ప్రజలపై హింసకు పాల్పడుతోంది' అని భారత ఎంబసీ మండిపడింది.పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిర్వహిస్తోన్న ఎన్నికల సందర్భంగా నిరసనకారులు, భద్రతాదళాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆందోళనకారులపై పాకిస్థాన్ భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇప్పటివరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పలు ఆంక్షలు అమలులో ఉన్నాయి. ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు చేయడాన్ని నిషేధించారు. మరోవైపు ఆందోళనల్లో చనిపోయిన తమ వారి మృతదేహాలను భద్రతా దళాలు ఇవ్వడం లేదని పలు కుటుంబాలు ఆరోపిస్తున్నాయి.

# సంక్షిప్త వార్తలు

## చల్లారుతున్న కార్చిచ్చు..ఇంటిబాట పట్టిన 84వేల మంది



**మాడ్రిడ్, జులై 30 :** ఫ్రాన్స్,స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో చెలరేగిన కార్చిచ్చు క్రమంగా అదుపులోకి వస్తోంది. వారం రోజులు ఇరుదేశాల ప్రభుత్వాలకు కంటిమీద కునుకులేకుండా చేసిన అగ్నికీలలు చల్లారుతున్నాయి.కార్చిచ్చు ముప్పుతో వారంరోజుల వ్యవధిలో 2 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన ఫ్రాన్స్ ఇప్పుడు 84వేలమంది తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు తాజాగా అనుమతిచ్చింది. గత శుక్రవారం ప్రారంభమైన ఈ కార్చిచ్చు కారణంగా దాదాపు 42 వేల హెక్టార్ల మేర అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. అంటే ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగర విస్తీర్ణం కంటే నాలుగు రెట్లు ఎక్కువ.

## మెటాకు మరోసారి కేంద్రం నోటీసులు


**న్యూఢిల్లీ,జులై 30:** ప్రధాని నరేంద్ర మోడీఫేస్‌బుక్ పోస్టుపై తాత్కాలికంగా ఆంక్షలు విధించిన ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని మెటా (ఫేస్‌బుక్ మాతృసంస్థ)ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇందుకోసం మెటా సీనియర్ అధికారులను రానున్న ఏడు నుంచి పది రోజుల్లో హాజరు కావాలని కోరింది. ఘటన ఎలా జరిగింది, భవిష్యత్తులో మళ్లీ జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది.

## ఇండో పాక్ యుద్ధయోధుడు బసంత్‌కుమార్ పొన్వార్ కన్నుమూత




**రాయ్‌పూర్, జులై 30:** భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన 1971 నాటి యుద్ధంలో విశేష సేవలు అందించిన అనుభవజ్ఞుడు, మావోయిస్టుల తిరుగుబాటుకు వ్యతిరేకంగా దేశంలో ఆధునిక అటవీ యుద్ధ తంత్రానికి రూపకర్త అయిన రిటైర్డ్ బ్రిగేడియర్ బసంత్‌కుమార్ పొన్వార్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయస్సు 77ఏళ్లు. బుధవారం కుటుంబసభ్యులు ఈ విషయాన్ని ప్రకటించారు. బసంత్ కుమార్ కుమారులు ఇద్దరూ సైన్యంలో చేరి దేశానికి సేవలందిస్తున్నారు.

## ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపి నిరసన ప్రదర్శన





**న్యూఢిల్లీ,జులై 30:** నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో కేంద్రానికి వ్యతిరేకంగా సీజేపీ చేపట్టిన నిరసనలకు ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ పోరాటంలో మంత్రి ధర్మేంద్ర రాజీనామాతో ఆందోళనకారుల డిమాండ్లు నెరవేరాయి. ఇప్పుడు ఈ అంశం పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వానికి చుట్టుకుంది. ఇక్కడ ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ ఆందోళన చేస్తోంది. ఎందుకంటే పంజాబ్‌లో కూడా ఇటీవల వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పేపర్ లీకేజీలను వ్యతిరేకిస్తూ ఇప్పుడు బిజెపి ఆందోళనకు దిగింది.

## పోలీస్‌స్టేషన్ వద్ద ప్రశాంత్‌కిశోర్ నిరసన



**పాట్నా,జులై 30:** బీహార్‌లోని బంకీపూర్ నియోజకవర్గం ఉపఎన్నిక కోసం గురువారం ఓటింగ్ ప్రారంభమైంది. అయితే తన మద్దతుదారులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసినట్లు తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. ఉపఎన్నికలో ఓటమి భయంతో అధికార బీజేపీ ఆదేశాల మేరకు పోలీసులు తన మద్దతు దారులలో చాలా మందిని అదుపులోకి తీసుకున్నారని మండిపడ్డారు. పాట్నాలోని జక్కన్‌పూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఆయన ఆందోళన చేపట్టారు.

## నిర్భయంగా పనిచేయండి: జవాన్లకు సిఆర్‌పిఎఫ్ చీఫ్ భరోసా



**న్యూఢిల్లీ,జులై 30:** విధి నిర్వహణలో నిష్పాక్షికంగా, నిజాయతీతో తీసుకునే ఏ నిర్ణయానికైనా, చర్య లకైనా తాను పూర్తి బాధ్యత వహిస్తానని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ తన సిబ్బందికి స్పష్టం చేశారు. ఎలాంటి భయం లేకుండా జవాన్లు, అధికారులు తమ విధులను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. సీఆర్పీఎఫ్ ఇన్వెస్టిచర్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. జనరల్ ఆపరేషనల్ బెటాలియన్ అయినా లేదా శాంతిభద్రతల రక్షణ విభాగాలు (లా అండ్ ఆర్డర్ యూనిట్) అయినా దేశ ప్రయోజనాలు, ప్రజారక్షణార్థం విధి నిర్వహణలో భాగంగా మీరు తీసుకునే ప్రతి నిర్ణయానికి, చేసే ప్రతి చర్యకు డైరెక్టర్ జనరల్‌గా పూర్తి బాధ్యత, జవాబుదారీతనం నేనే వహిస్తానన్నారు.

# 12 యేళ్లలో ప్రధాని మోడీ చేసిన అప్పు రూ.151 లక్షల కోట్లు

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 30:** స్వాతంత్య్రం వచ్చినప్పుడు నిరక్షరాస్యత, కరవు కాటకాలతో దేశం సతమతమవుతున్నప్పుడు ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటి పారుదల రంగాలను తన ప్రాధాన్యాంశాలుగా ఎంచుకొని ఆ సమస్యలను అధిగమించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఐఐటీలు, ఐఐఎంలు, యూనివర్సిటీలు, సాగునీటి ప్రాజెక్టులు నెహ్రూ దార్శనికతను నిదర్శనమన్నారు. నాడు వేసిన పునాదులతో నేడు ప్రతి తండా, గూడెంలోనూ పాఠశాలలు ఏర్పాటయ్యాయని, ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. 'టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్సేంజ్ కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో ఎంసీ హెచ్ ఆర్డీలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సాంకేతిక విప్లవంతో వైట్ కాలర్ జాబ్‌లను మనం అందిపుచ్చుకున్నామని, కానీ ఇప్పుడు ఆ జాబ్‌లకు కాలం చెల్లిందన్నారు. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో నైపుణ్యాలకు డిమాండ్ ఉన్నందున, అక్కడి అవసరాలకు తగినట్లు నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందులో భాగంగానే సంప్రదాయ కోర్సులతో పాటు ప్రభావం కోల్పోయిన ఐటీఐలను టాటా సంస్థ సహకారంతో ఏటీసీలుగా ఆధునీకరించామని, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఉట్నూరు ఏటీసీలో శిక్షణ పొందిన వారంతా టాటా సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సీఎం తెలిపారు. కరవు, కాటకాలు, నిరక్షరాస్యతలో కూరుకు పోయిన దేశాన్ని సాగునీటి ప్రాజెక్టులు, విద్యాలయాల ఏర్పాటుతో సుభిక్షమైన దేశంగా తీర్చిదిద్దిన నెహ్రూపైనా విమర్శలు గుప్పిస్తున్నారని విమర్శించారు. పాకిస్థాన్‌ను ఓడించి,ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసి, గరీబీ హఠావో నినాదంతో పని చేసిన ప్రధానమంత్రి ఇందిరా గాంధీపైనా విమర్శలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. స్వాతంత్య్రం వచ్చిన దగ్గర నుంచి 2014 వరకు ప్రధానమంత్రులుగా చేసిన వారు రూ.51 లక్షల కోట్ల అప్పులు చేస్తే, 2014 నుంచి 2026 వరకు 12 ఏళ్లలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ.151 లక్షల కోట్ల అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ బిడ్డ పి.వి. నరసింహా రావు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సర్వేల గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారని, తర్వాత కాలంలో అదే నవోదయ విద్యాలయాలకు, గురుకుల పాఠశాలలకు నమూనాగా నిలిచిందన్నారు. ఆ పాఠశాలలో చదువుకున్న వారు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. సాగు నీటి ప్రాజెక్టులను నెహ్రూ ఆధునిక దేవాలయాలుగా వర్ణించారని, నాడు నిర్మించిన నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ వంటి ప్రాజెక్టుల ఫలితంగానే తెలంగాణలో ఈనాడు 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి సాధ్యమైందన్నారు. 80 వేల పుస్తకాలు చదివి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరం అయిందని విమర్శించారు. ప్రతి పేద విద్యార్థికి విద్యను అందించడంతో సరిపెట్టుకోకుండా వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలనేది తన ఆశయమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లి వంటి మారుమూల పల్లె ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను తెలంగాణలోని 12 వేల పల్లెల్లోని పాఠశాల పిల్లలు ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నానని సీఎం అన్నారు.

# డిజిటల్ యుగంలోకి అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ

## నాలుగు ఆన్‌లైన్ కోర్సులకు యుజిసి అనుమతి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 30, ప్రభాతవార్త:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిజిటల్ విద్యావిధానంవైపు మరో కీలక అడుగు వేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి నాలుగు కోర్సులను ఆన్‌లైన్ విధానంలో అందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) అనుమతి మంజూరు చేసింది. ఎంఏ(తెలుగు), ఎంకామ్, బీకామ్(ఇంగ్లీష్ మీడియం), బీకామ్ (తెలుగు మీడియం) అనుమతి పొందిన వాటిలో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరానికి మొత్తం ఎనిమిది కోర్సులకు యూజీసీ అనుమతి కోసం దరఖాస్తు చేయగా, నాలుగు కోర్సులకు ఇప్పటికే ఆమోదం లభించిందని సెంటర్ ఫర్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. పుష్పాచక్రపాణి తెలిపారు. మిగిలిన నాలుగు కోర్సులకు సంబంధించి యూజీసీ కొన్ని సూచనలు, సవరణలు చేసిందని, వాటిని పూర్తి చేసిన అనంతరం అనుమతి లభిస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నాణ్యమైన ఉన్నత విద్యను అందించడంలో యూజీసీ అనుమతి కీలక ముందడుగు అన్నారు. ఈ మేరకు వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి సిబ్బందిని అభినందించారు. కేవలం అధికారిక పర్యటనలో ఉన్న ఉపకులపతి విదేశాల నుంచి ఫోన్ ద్వారా మాట్లాడారు. దేశంలో తొలి ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ యూనివర్సిటీగా ప్రారంభమైన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రస్తుత డిజిటల్ యూనివర్సిటీగా రూపాంతరం చెందుతోందన్నారు. రానున్న రోజుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ అన్ని కోర్సులను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చి పూర్తి స్థాయి డిజిటల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతామన్నారు.

# ఎఐజిలో కెటిఆర్ కుమారుడు హిమాన్షురావుకు సర్జరీ

## పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 30, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనుమడు, మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటి.రామారావు కుమారుడు హిమాన్షుకావుకు గురువారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో సర్జరీ జరిగింది. గతకొన్ని రోజుల క్రితం జిమ్‌లో వ్యాయాయం చేస్తూ కిందపడడంతో హిమాన్షు ముక్కుకు గాయమైంది. దీంతో గతంలోనే ఏఐజీ ఆసుపత్రిలో చికత్స తీసుకున్న హిమాన్షుకు డాక్టర్లు గురువార్తం సర్జరీ చేశారు. గతంలో ఇచ్చిన చికిత్సతో గాయం నయమైనా, భవిష్యత్తులో ఎటువంటి శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే సర్జరీ చేసుకోవాలని డాక్టర్లు సూచించడంతో గురువారం హిమాన్షు ఏఐజీ ఆసుపత్రిలో సర్జరీ చేయించుకున్నారు. కాగా మనుమడికి జరిగిన సర్జరీ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ గురువారం మధ్యాహ్నం గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రికి చేరుకొని మనుమడిని పరామర్శించారు. హిమాన్షు ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు హిమాన్షుకు నిర్వహించిన సర్జరీ విజయవంతమైందని, మరో రెండు రోజులు ఆసుపత్రిలో పర్యవేక్షణలో ఉండాలని సూచించినట్లు కేసిఆర్‌కు తెలిపారు. కేసిఆర్‌తో పాటు ఆసుపత్రికి వచ్చిన వారిలో మాజీ మంత్రులు కేటిఆర్, హారీష్‌రావులతో పాటు కుటుంబ సభ్యులు ఉన్నారు. కాగా తనకు జరిగిన సర్జరీ విషయమై హిమాన్షురావు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తనకు ఏఐజీ ఆసుపత్రిలో సర్జరీ విజయవంతంగా ముగిసిందని, రెండు రోజుల పర్యవేక్షణ అనంతరం ఇంటికి తిరిగి వెళ్తానని తెలిపారు.

# మూసీ ప్రక్షాళనకు నాలుగువేల కోట్లు కేటాయించాలి

## సమగ్ర సివరేజ్ రూ.17,212.69 కోట్ల కేంద్ర ఆర్థిక సహాయం

### పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్,జులై 30,ప్రభాతవార్త:** మూసీ నది ప్రక్షాళనకు రూ.నాలుగువేల కోట్లు,సమగ్ర సీవరేజ్ మాస్టర్ ప్లాన్ అమలుకు రూ.17,212.69 కోట్ల కేంద్ర ఆర్థిక సహాయం మంజూరు చేయాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారంపార్లమెంట్ గృహనిర్మాణం. పట్టణ వ్యవహారాల స్థాయి సంఘం 22వ సమావేశంలో కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షత వహించగా, ఇతర సభ్యులు కూడా హాజరయ్యారు.హైదరాబాద్ మురుగునీటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి అమృత్ 2.0 కింద కేంద్ర సహాయం అందించాలని పార్లమెంటరీ కమిటీ సమావేశంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. అటల్ మిషన్ ఫర్ రీజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ కింద నగరాల్లో మురుగునీటి,సెప్టేజ్ నిర్వహణ సమీక్ష" అంశంపై రూపొందించిన ముసాయిదా నివేదికను కమిటీ ఆమోదించింది. ఈ సందర్భంగా చామల కిరణ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ నగర మురుగునీటి వ్యవస్థ బలోపేతానికి సంబంధించిన కీలక ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లోని మూసీ నది వెంబడి 55 కిలోమీటర్ల పొడవున శుద్ధి చేయని మురుగునీరు నదిలో కలవకుండా అడ్డుకునే ట్రంక్ సీవర్ మెయిన్ ప్రాజెక్టును హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ప్రతిపాదించిందని, సుమారు రూ.4,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును అమృత్ 2.0 పథకం కింద చేర్చి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేడు ఇహెచ్‌సిటి బోర్డు సమావేశం

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త,** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌కి సంబంధించిన బోర్డు మీటింగ్ నేడు(శుక్రవారం) జరగనుంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో నేడు మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన ఎంప్లాయిస్ హెల్త్‌కేర్ ట్రస్ట్(ఈహెచ్‌సీటీ) బోర్డు మీటింగ్ జరగనుందని ఈహెచ్‌సీటీ సీఈవో ప్రకటించారు. ఈ నెల 17 నుంచి కొత్తగా ఈహెచ్ఎస్‌ను రాష్ట్రంలో ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఈహెచ్ఎస్‌కి సంబంధించి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ప్రారంభంలో కొద్దిరోజులు ఆలస్యమైంది. తరువాత చికిత్సలను ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల యాజమాన్యాలతో ఈహెచ్‌సీటీ అధికారులు సమావేశం నిర్వహించారు. నేడు బోర్డు మీటింగ్‌ను నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు జరిగిన చికిత్సలతోపాటు.. చికిత్సల సందర్భంగా వస్తున్న ఇబ్బందులు, వెబ్‌సైట్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలతోపాటు అన్నింటిపై సమావేశంలో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# ఆర్గానిక్ సాగు దిశగా రైతు బాట




## కూరగాయల సాగును ప్రోత్సహించండి

## నిపుణుల కమిటీతో సిఎం రేవంత్‌రెడ్డి

## ఎల్‌నినో ప్రభావంపై నివేదిక ఇచ్చిన కమిటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై30:** రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది.

గత యేడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి.. పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షించేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల ఎత్తివేతకు బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలు

## అయోధ్య అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించే యత్నం

## ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్, జులై 30,ప్రభాతవార్త:** దేశంలో బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్‌లను ఎత్తివేసేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆరోపించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో నీట్ విద్యార్థుల ఆందోళన సమయంలో సామాజిక మాధ్యమాల్లో రిజర్వేషన్‌లను ఎత్తివేయాలని పెద్దఎత్తున ప్రచారం జరిగిందని, దాని వెనుక బిజెపి మద్దతు ఉందని విమర్శించారు. దేశవ్యాప్తంగా తెలంగాణ తరహాలో సమగ్ర కులగణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన ద్వారానే వివిధ వర్గాల నిజమైన జనాభా వివ రాలు బయటకు వస్తా యని, వాటి ఆధారంగా సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. జనాభా ప్రాతిపదికనే ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ, నిధుల కేటాయింపు, అవ కాశాల కల్పన జరగాలని అభిప్రాయ పడ్డారు.

బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు రిజర్వే షన్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తు న్నాయని ఆరోపించారు. అయోధ్యలో జరిగినట్లు చెబుతున్న అవినీతి, అక్రమాల అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రిజర్వేషన్ల వివాదాన్ని ముందుకు తెస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బిసి హక్కులు, రిజర్వేషన్లకు ఎలాంటి భంగం కలిగించినా సహించ బోమని హెచ్చరించారు. బిసి అన్యాయం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల కుట్రలను ప్రజలు గుర్తించి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధమైన హక్కులని, వాటిని బలహీన పరిచే ప్రయత్నాలను అడ్డుకోవాలని అన్నారు. తిరుమలలో ప్రతిరోజూ వేలాది మంది భక్తులు సమర్పించే హుండీ ఆదాయానికి సంబం ధించిన లెక్కలు పారదర్శకంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. అదే పారదర్శకత అయోధ్యలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

# రాష్ట్రం నుండి రూ.1,22,655 కోట్ల ఎక్స్‌పోర్ట్

## ఎగుమతులకు హబ్‌గా తెలంగాణ

## సమగ్ర ప్రణాళికలు రూపొందించండి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** రాష్ట్రం నుంచి గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు తెలిపారు. తెలంగాణను ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఇపిసి) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభి వృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఎగుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వ డంతోపాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికా రులను ఆదేశించారు. ప్రధానంగా వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు చెందిన ఉత్పత్తుల ఎగుమతులను మరింత పెంచాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలో ఎగుమతులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) అధికారులతో సమన్వయం పెంపొం దించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని తెలియచేశారు. పరిశ్రమలు, తయారీ యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్‌జాజు సూచించారు.



# ఆర్అండ్‌బి ఇంజినీర్లు ఇతర శాఖల సమన్వయంతో పనిచేయండి

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రమాదకరమైన వంతెనలపై ప్రయాణికులను సరుకుల వాహనాలను అనుమతించకుండా ఆర్అండ్‌బి ఇంజనీర్లు ఇతర ప్రభుత్వశాఖల అధికారుల సమన్వయంతో కట్టడి చేయాలని ఆర్ అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెం కటరెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో రెండు రోజు లుగా విస్తారంగా కురు స్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారు లతో బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో గురు వారం మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం జరిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలలో ఇప్పటికే అనేక గ్రామాలలో వాగులు ఉప్పొంగి రోడ్ల పైనుంచి నీరు వెళ్ళడంతో రాకపోకలకు ఇబ్బంది అవుతున్నట్లు తెలుస్తోందని అక్కడ పోలీసుల సహకారంతో రాకపోకలను నియంత్రణ చేయాలని సూచించారు. తిర్యాని-రొంపల్లి, మాణిక్యాపూర్-మంగి, గోయెగాం -అమీన్‌గూడ్, ఉల్లిపిట్ట-చిర్రకుంట వంతెనలపై నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. భైంసా మండలం ఝరి(బి)కి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగాయనీ వార్తలు వస్తున్న నేపథ్యంలో అధికారులు అక్కడ కాపలా ఏర్పాటు చేసి ఎవరు కూడా ప్రమాదాలబారిన పడకుండా చూడాలని సూచించారు,ఆర్ అండ్ బి డివిజన్ల వారిగా రోడ్లు, బ్రిడ్జిలు, లోకాజ్ వేలు, కల్వర్టుల వివరాలు వెంటనే అందించాలని ముంపు ప్రాంతాల్లో రోడ్ల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కల్వర్టులు, లోకాజ్ వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలని మంత్రి చెప్పారు.

అధికారులు అందరూ ఫీల్డ్ లో ఉండాలనీ ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ,పోలీస్, విద్యుత్,ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజనీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని ఇంజనీర్లకు తెలిపారు. ఇఎన్‌సి నుంచి కింద ఏ.ఈ వరకు అందరు పూర్తి అప్రమత్తతో ఉండాలని ఆదేశించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు.

# దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో 53,967 మందికి సీట్ల కేటాయింపు

## రేపటిలోగా కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2026 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా స్పెషల్ ఫేజ్‌లో 53,967 మందికి సీట్లను కేటాయించారు. వారిలో కామర్స్ విద్యార్థులు అత్యధికంగా 23,516 మంది ఉన్నారు. సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు 1 వరకు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి కాలేజీల్లో చేరాలని దోస్త్-2026 కన్వీనర్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపును గురువారం ప్రకటించారు. స్పెషల్ ఫేజ్‌లో 57,690 మంది వెబ్ఆప్షన్లను ఇవ్వగా.. అందులో 53,967 మందికి సీట్లను కేటాయించారు. వెబ్ ఆప్షన్లు తక్కువగా ఇచ్చిన విద్యార్థుల్లో 3723 మందికి సీట్లు కేటాయించలేదన్నారు. మొదటి ఆప్షన్ ఇచ్చిన వారిలో 44,179 మందికి, సెకండ్ ఆప్షన్ ఇచ్చిన 9,788 మందికి సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు కేటాయింపులో.. ఆర్ట్స్‌లో 9,116 మందికి, కామర్స్‌లో 23,516 మందికి, లైఫ్‌సైన్సెస్‌లో 10,316 మందికి, ఫిజికల్ సైన్సెస్‌లో 10,988 మందితో పాటు ఇతరులు 31 మందికి సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని 783 డిగ్రీ కాలేజీల్లో 3,73,149 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో మూడు విడతల్లో కలిపి ఇప్పటివరకు 1,15,433 మంది కాలేజీల్లో చేరారు. స్పెషల్ ఫేజ్‌లో 53,967 మందికి సీట్లను కేటాయించారు.

# నేడు ఇంజినీరింగ్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌కు స్లాట్ బుకింగ్‌కు అవకాశం

## 5న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్స రం లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 ఇంజనీరింగ్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభించనున్నారు. రేపు (శనివారం) సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఆగస్టు 1, 2 తేదీల్లో వెబ్ఆప్షన్లకు అవకాశం కల్పించినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 5న ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేస్తారు. రెండోవిడతలో 80,167 మందికి సీట్లు కేటా యించగా.. వారిలో 71,452 మంది కాలేజీల్లో చేరారు. రాష్ట్రంలో 94,424 సీట్లు అందుబాటులో ఉండగా.. రెండో విడతలో 71,452 మంది చేరిన నేపథ్యంలో ఫైనల్ ఫేజ్‌లో 22,972 సీట్లు అందుబాటులో ఉన్నట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు.

# నేటి నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

## 5 వరకు ఫీజు చెల్లించి స్లాట్ బుకింగ్‌కు అవకాశం

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సు ల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐ సెట్-2026 కౌన్సెలింగ్‌ను నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభించనున్నారు. ఆగస్టు 5 వరకు ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఆగస్టు 5 వరకు వివరాలను తెలుపుతూ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 1 నుంచి 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఆగస్టు 3 నుంచి 8 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. ఆగస్టు 11న మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుందని కమిషనర్ తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాలని సూచించారు. ఐ ఐసెట్-2026లో 91.22 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఐ సెట్‌కు 56,206 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 51,146 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 46,654(91,22శాతం) మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో గత ఏడాది 287 ఎంబీఏ కాలేజీలు ఉండగా వాటిలో 40,601 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 35,141 సీట్లు భర్తీ అయ్యాయి. 80 ఎంసీఏ కాలేజీలు ఉండగా వాటిల్లో 9360 సీట్లు అందుబాటులో ఉండగా, అందులో 5420 సీట్లు భర్తీ అయ్యాయాయి. కౌన్సెలింగ్ కోసం రాష్ట్రంలో 22 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# విద్యుత్ చార్జీల పెంపు లేదు

## 2026-27లోనూ పాత రేట్లే వర్తింపు

## కరెంట్ షాక్‌తో మరణిస్తే రూ.8 లక్షలకు పెంపు

## బిల్లుల్లో అదనపు వసూళ్ల మొత్తం రిటర్న్

## రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ నిర్ణయం

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలను పెంచకూడదని తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ అమలవుతున్న పాత ధరలనే కొనసాగించనుంది. అలాగే రాష్ట్రంలో కరెంటు షాక్‌తో మరణించిన వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుండి రూ.8 లక్షలకు పెంచుతూ మరో నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) జారీ చేసిన టారిఫ్ ఉత్తర్వుల్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ ఛార్జీలలో ఎటువంటి మార్పులు చేయకుండా, పాత ధరలనే అమలు చేయాలని నిర్ణ యించింది. పెరిగిన ధరలతో ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిలో ఉన్న సామాన్య వినియోగదారులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనంగా నిలిచింది. అలాగే విద్యుత్ ప్రమాద బాధితులకు పెద్దపీట వేసింది. ముఖ్యంగా విద్యుత్ ప్రమాదాల విషయంలో మానవీయ దృక్పథంతో ఆలోచన చేసింది. విద్యుత్ ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు పరిహారాన్ని పెంచింది. ఇప్పటివరకు ఉన్న రూ.5 లక్షల పరిహారాన్ని రూ.8 లక్షలకు పెంచుతూ ఈఆర్సీ ఆదేశాలు జారీ చేసింది. ఈ పెంపు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. ప్రమాదం వినియోగదారుల పొరపాటు వల్ల జరిగినప్పటికీ, డిస్కంలు ఖచ్చితంగా ఈ పరిహారాన్ని చెల్లించాలని కమిషన్ స్పష్టం చేసింది. ప్రమాదం జరిగిన 2 నెలల లోపు పరిహారం అందజేయాలని, ఒకవేళ ఆలస్యమైతే అందుకు గల కారణాలను విద్యుత్ పంపిణీ సంస్థలు లిఖితపూర్వకంగా వివరించాల్సి ఉంటుంది. అలాగే బిల్లింగ్ విషయంలో తలెత్తుతున్న వివాదాలపై ఈఆర్సీ స్పష్టతనిచ్చింది. సౌర విద్యుత్ వాడుతున్న వారు అదనపు యూనిట్లు వినియోగించినప్పుడు, పంపిణీ సంస్థలు అధిక శ్లాబుల ప్రకారం వసూలు చేసిన అదనపు సొమ్మును రాబోయే 3 నెలల బిల్లుల్లో వెనక్కి ఇవ్వాలని ఆదేశించింది. అనుమతించిన లోడ్ కన్నా అదనంగా వాడినందుకు వసూలు చేసిన పెనాల్టీని, సరైన అవగాహన కల్పించని కారణంగా మొదటి రెండు నెలల మొత్తాన్ని తిరిగి ఆరు నెలల బిల్లుల్లో సర్దుబాటు చేయాలని పేర్కొంది.



# లష్కర్ బోనాలకు రండి

## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాకు మంత్రి కొండా సురేఖ ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై30:** గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి గురువారం లోక్ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న ఆషాఢ జాతర (లష్కర్ బోనాలు) ఉత్సవాలకు హాజరుకావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికను గవర్నర్‌కు మంత్రి అందజేశారు.అంతకుముందు మాజీ పీసీసీఎఫ్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ పరేష్ కుమార్ శర్మ (ఐఎఫ్ఎస్, విశ్రాంత) రచించిన ఫుట్‌ప్రింట్స్ ఇన్ ది ఫారెస్ట్స్- మెమోయర్స్ ఆఫ్ ఎ ఫారెస్టర్ పుస్తకాన్ని గవర్నర్ లోక్ భవన్ లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అటవీ సంపద, జీవవైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఏఎస్ పబ్లిష్‌కు చెందిన సుప్రియా భలే రావు, డాక్టర్ మనోరంజన్ భంజా (ఐఎఫ్ఎస్, విశ్రాంత), సైకాలజీ కౌన్సిలర్ నేహావ్యాస్ పాల్గొన్నారు. గవర్నర్‌ను కలిసిన శారద పీఠం ఉత్తరాధికారి స్వాత్మానంద మహారాజ్ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానంద మహారాజ్ గురువారం లోక్ భవన్ లో గవర్నర్‌ను కలిశారు.విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.సి. రెడ్డి, మై భారత్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ చి. అన్వేష్ తదితరులు కూడా లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

# సెప్టెంబరు 1లోపు సిపిఎస్ రద్దు చేయాలి

## 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ అమలు చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 30ః సెప్టెంబర్ 1లోపు సీపీఎస్‌ను రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని పిఆర్‌టియు టిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకి టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రెడ్డి గురువారం సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్‌ను సెప్టెంబర్1లోపు రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకుని, నిర్ణీత గడువులోగా అమలు చేయాలని, లేని పక్షంలో సెప్టెంబర్ 1న ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేకన్నా ముందు మ్యానిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని,కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. సెప్టెంబర్ 1, 2004 కన్నా ముందుగా నోటిఫికేషన్ విడుదలై తదుపరి నియామకం పొందడం వలన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు కొత్త పెన్షన్ విధానంలోకి రావడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం 57 మెమో ద్వారా ఇలాంటి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేసిందని గుర్తు చేశారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి అమలుచేయడం లేదని, సెప్టెంబర్ 1 వరకు ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించనట్లయితే తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

# ఆగస్టు 1 నుంచి ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అక్టోబర్ పరీక్షలకు దరఖాస్తులు స్వీకరణ

### టాస్ డైరెక్టర్ లింగయ్య

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** అక్టోబర్‌లో జరిగే తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) టెన్త్, ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ఫీజులను ఆగస్టు 1 నుంచి స్వీకరించనున్నట్లు టాస్ డైరక్టర్ కె లింగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రసుం లేకుండా ఆగస్టు 17 వరకు స్వీకరించనున్నట్టు తెలిపారు. అపరాధ రుసుం రూ. 25తో ఆగస్ట 18 నుంచి 24 వరకు, అపరాధ రుసుం రూ.50తో ఆగస్టు 24 నుంచి 29 వరకు స్వీకరించనున్నారు.

తత్కాల్‌లో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు స్వీకరించనున్నట్టు డైరక్టర్ జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్‌లో జరిగే పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం టాస్ వెబ్‌సైట్ ద్వారా, టిజి ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాలలో పరీక్ష ఫీజులను చెల్లించడానికి అవకాశం కల్పించారు.

గత సంవత్సరాలలో నమోదు చేసుకుని ఇచ్చిన అవకాశాలలో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించని వారు, గత సంవత్సరాలలో నమోదు చేసుకుని, కేటాయించిన అవకాశాలలో పరీక్షలకు హాజరు కానివారు పరీక్ష ఫీజును చెల్లించవచ్చని తెలిపారు. టైమ్‌టేబుల్, ఇతర సూచనలు తాజా సమాచారం కోసం టాస్ అధికారిక వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

# పిఒకె కోట్లిలో మహిళలపైనా పోలీసుల కాల్పులు

## 40 మందికిపైగా మృతి, వందల మందికి గాయాలంటూ ఆరోపణలు



**ఇస్లామాబాద్, జులై 30:** పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఒకే)లో ప్రాథమిక హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రజలపై పాకిస్థాన్ భద్రతా బలగాల దమనకాండ మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇప్పటి వరకు పురుషులపై మాత్రమే కాకుండా మహిళా నిరసనకారులను కూడా లక్ష్యంగా చేసుకుని పోలీసులు కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయిన పలు వీడియోల్లో కోట్లి ప్రాంతంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలపై పోలీసులు కాల్పులు జరపడంతో వారు ప్రాణభయంతో పరుగులు తీస్తున్న దృశ్యాలు కనిపించాయి.రావలకోట్, మీర్‌పూర్ ప్రాంతాల్లో పాకిస్తాన్ భద్రతా బలగాల చర్యలను నిరసిస్తూ పెద్ద సంఖ్యలో మహిళలు ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కాల్పులకు దిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిరసనలో పాల్గొన్న ఓ మహిళ మాట్లాడుతూ, మా సోదరులకు మద్దతుగా మేము బయటకు వచ్చాం. వారితో మేము ఉన్నామని తెలియజేయాలనుకుంటున్నాం. వారితో కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం. మాపై కాల్పులు జరిపేవారికి ఒక్కటే చెబుతున్నాం మేము ఎలాంటి భయానికీ లోనుకాబోమని పేర్కొన్నారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న నిరసనలపై పాకిస్తాన్ భద్రతా బలగాలు చేపట్టిన కఠిన చర్యల్లో ఇప్పటివరకు 40 మందికిపైగా మరణించగా, డజన్ల సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు సమాచారం.

# అంగన్‌వాడీల్లో మౌలిక వసతులకల్పనకు పెద్దపీట

## మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై30:** అంగన్వాడీ కేంద్రాల్లో గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్ సదుపాయం, 3,815 కేంద్రాలకు తాగునీటి సదుపాయం, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించినందుకు అధికారులు, సిబ్బందిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రాలకు కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్న మంత్రి.. రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఏమాత్రం జాప్యం చేయకుండా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఏఈలు, డీఈలతో సమన్వయం చేసుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఏ కేంద్రంలో ఏ పని పూర్తయింది, ఇంకా ఎంత పని మిగిలి ఉందన్న వివరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అంగన్వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమాలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు.

ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రతి చిన్నారికి పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు. చిన్నారుల ఉదయం ఆకలిని తీర్చడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడేలా బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారికి నాణ్యమైన ఆహారం అందడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా అంగన్వాడీ కేంద్రాన్ని తాత్కాలికంగా మార్చాల్సిన పరిస్థితి వస్తే, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో తల్లులు తమ పిల్లలకు పాలిచ్చేందుకు వీలుగా ఇప్పటికే 54 తల్లి ఒడి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు.

అవసరమైన అన్ని జిల్లాలు, ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసి బాలింతలకు సౌకర్యం కల్పించాలని మంత్రి సూచించారు.తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాల్య వివాహాల నివారణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయి సమర్థవంతంగా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

## ప్రణాళిక అమలుకు రూ.802.92 కోట్లు అవసరం: జి.చిన్నారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 30:** ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్, నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయ, ఉద్యాన వన, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదిను రూపొందించామని ఆయన పేర్కొనారు. గురువారం సాయంత్రం సచివాలయంలోని మీడియా సెంటర్‌లో మాట్లాడారు. ఈ కార్యాచరణ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. గత మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని ఆయన తెలిపారు.

ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు.అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన నివేదికలోని ముఖ్యాంశాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ నివేదికలో తక్షణ, మధ్యకాల, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికలతో పాటు రైతుల జీవనోపాధి పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పశుగ్రాస భద్రత, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అంశాలపై సమగ్ర సిఫార్సులు చేశారు.రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు కాగా, జూలై 27 నాటికి 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైనట్లు కమిటీ పేర్కొంది. రాష్ట్రంలోని అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టం కూడా గణనీయంగా పడిపోయినట్లు నివేదికలో వివరించింది. పశుసంవర్ధక రంగంలో పశుగ్రాస కొరత తలెత్తకుండా జిల్లా వారీగా పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేయడం, మేత పంటల సాగును విస్తరించడం, సైలేజ్, హే తయారీ, అజోల్లా సాగు, పశుగ్రాస విత్తనాల పంపిణీ, అవసరమైతే పశు శిబిరాల నిర్వహణ, పశువులకు తాగునీటి వసతుల కల్పన వంటి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది.

గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెక్‌డ్యాంలు, ఫార్మ్‌పాండ్లు, చెరువుల పూడికతీత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్ పనులను విస్తృతంగా చేపట్టి నీటి వనరులను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సూచించింది.

# జూరాల 17 గేట్లు ఎత్తివేత

## 1,04,375 వేల క్యుసెక్కుల ఇన్‌ఫ్లో

### శ్రీశైలానికి పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 30, ప్రభాతవార్త :** కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ఎగువన ఉన్న నారాయణపూర్, ఆల్మట్టి డ్యాంల గేట్లు ఎత్తివేయడంతో కృష్ణా జలాలు పరుగు పరుగున జూరాలకు చేరుకుంటున్నాయి. గురువారం ఉదయం ఆరు గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 7.663 టీఎంసీలుగా నమోదైంది. జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,04,375 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా 17 గేట్లను ఒక మీటర్ ఎత్తు మేరకు లిఫ్ట్ చేసి 67235 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పవర్ హౌస్ ద్వారా 38,225 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. అదేవిధంగా జూరాల నుంచి భీమా లిఫ్ట్ 1 కు 1300 క్యూసెక్కులు,కోయిల్ సాగర్ లిఫ్ట్ 315క్యూసెక్కులు , ఎడమ కాలువ ద్వారా 870 క్యూసెక్కులు, కుడికాలువ ద్వారా 500క్యూసెక్కులు, సమాంతర కాలువకు 600 క్యూసెక్కులు , బీమా లిఫ్ట్ 2 కు 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, మొత్తంగా జూరాల నుంచి 1.09 వేల 519 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

**శ్రీశైలానికి కృష్ణమ్మ పరవళ్లు**

**85,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు**

శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతున్నది. ఈ ఏడాది తొలిసారిగా వరద నమోదు అయింది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు, స్టోరేజీ 215.8070 టీఎంసీలు గా ఉన్నది. జూరాల పవర్ హౌస్ ద్వారా 38,225 క్యూసెక్కులు స్పిల్ వే గేట్ల ద్వారా 47 వేల 196 క్యూసెక్కులు నమోదు కాగా మొత్తంగా 85,421 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు అయింది. దీంతో గురువారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం మేరకు డ్యామ్ లో నీటిమట్టం 252.15 0 టి.ఎం.సిలుగా 827.30 అడుగులకు నీటిమట్టం చేరింది.

# జలదిగ్బంధంలో కాలనీలు

## వరద ఉధృతికి మహిళ మృతి

## పొంగిపొర్లుతున్న కాల్వలు, వాగులు

## మత్తడి పారుతున్న చెరువులు

## పలు గ్రామాలకు రాకపోకలు బంద్

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త :** భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జన జీవనం స్థంభించింది. గోదావరిలోకి స్వల్పంగా వరద నీరు వస్తోంది, పలు జిల్లాల్లో కాలువలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లో లెవల్ కాజ్ వేలపై నుంచి వరద నీరు భారీగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు మండలాలు, పట్టణాల్లో పాత ఇళ్లు పాక్షి కంగా దెబ్బతిన్నాయి. పంట చేలలోకి వర్షపు నీరు చేరి మునిగాయి. చెరువులు, కుంటలు, ఇతర చిన్న నీటి వనరుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. కాలనీల్లో వరద నీరు ప్రవహించింది. మురికి కాలువలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో కొన్ని చోట్ల స్కూళ్లు మూతబడ్డాయి. జగిత్యాల జిల్లాలోని ధర్మపురిలో తదితర ప్రాంతాల్లో 8 ఇళ్లు పాక్షి కంగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని రహదారులు ధ్వంసం అయ్యాయి. సారంగాపూర్‌లోని బతుకమ్మ కుంట తెగిపోయింది. జగిత్యాల రూరల్ మండలంలో ఒక చెరువు నిండి మత్తడి పారుతోంది. ధర్మపురి మండలంలోని ఆకుసాయిపల్లి శివారులో గల లో లెవల్ వంతెన నీటిలో మునగడంతో జగిత్యాల నుండి మంచిర్యాలకు, ధర్మపురిలకు రాకపోకలు నిలిచిపోయాయి పైడిపల్లిగొడిసెలపేట మధ్యలో ఉన్న వంతెనపై నుంచి నీరు పొంగిపొర్లడం బీర్‌పూర్ మండలంలో వాగుల వరద నీరు రహదారిపై ప్రవహిస్తుండడం, కోనాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగు వర్షం నీటితో పారుతుండడం వల్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. మల్లాపూర్‌మొగిలిపేట మధ్య గల వర్షపు నీరు రహదారిపై ప్రవహిస్తోంది. రామ్నూర్ గ్రామంలో ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ఇక్కట్లు ఎదుర్కొన్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లోని పలు వార్డులు, మెట్‌పల్లి పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని నగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు భారీగా నిలిచి చెరువును తలపించింది.

భారీ వర్షాలతో గురువారం జగిత్యాల జిల్లాలోని అన్ని పాఠశాలలు మూతపడ్డాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. పింఛన్ డబ్బులు తీసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా ఖానాపూర్ మండలం చమన్‌పల్లి గ్రామానికి చెందిన మార్సకోల పారుబాయి (45) అనే మహిళ వరద ఉధృతికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయింది. భారీ వర్షాలకు జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. మేడిగడ్డ బ్యారేజ్‌కు వరద పోటెత్తడంతో అధికారులు గేట్ల 85 గేట్లను ఎత్తివేశారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని వాగులు, వంకలు, చెరువులు, బావులు నీటితో నిండిపోయి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాలు సాగునీటి అవసరాలను తీర్చడంతో రైతన్నల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

మండలంలోని సంతాయిపేట్ గ్రామ సమీపంలోని భీమేశ్వర వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. వాగు దాటే ప్రమాదం ఉన్నందున రహదారికి అడ్డుగా ట్రాక్టర్ను నిలిపి వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు.

# కోర్టుకు హాజరైన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై30:** నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. 2022లో కోవిడ్ నిబంధనలకు విరుద్ధంగా కొత్తగూడెం ఆస్పత్రి వద్ద ప్రెస్‌మీట్ పెట్టారని భట్టిపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా కోర్టుకు హాజరయ్యారు.



# పేపర్‌లీక్ మాఫియాకు ఇక కష్టకాలమే

**న్యూఢిల్లీ, జులై 30:** పరీక్షల్లో అక్రమాల కట్ట డికి నిర్దేశించిన బిల్లును పార్లమెంటు ఉభయ సభ లు ఆమోదించిన సంద ర్భాన్ని పురస్కరిం చుకుని ప్రధాని నరేంద్రమోడీ నాలుగో సారి ఒక ఇన్‌స్టా విడియో విడుదలచేసారు. గురువారం రాత్రి పొద్దు పోయాక విడుదలచేసిన ఈ విడియోలో పేపర్ లీక్ మాఫియా, గాంగులను ఎట్టిపరిస్థితుల్లోను ఉపేక్షించబోమని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగా సవరణలతో తీసుకువచ్చిన పబ్లిక్ పరీక్షల (అక్రమాల నియంత్రణ) సవరణ బిల్లు 2026ను గురువారం పార్ల మెంటు ఆమోదించడం చారిత్రక సందర్భంగా మోడీ అభివర్ణించారు. ఇకపై అక్రమార్కులకు కఠిన దండన తప్పదని కూడా మోడీ ఇన ఇన్‌స్టాలో హెచ్చరించారు.కాగా ప్రధానిమోడీ ఇన్‌స్టాలో రిజిస్టరు అయిన తర్వాత వారం రోజుల వ్యవధిలోనే నాలుగో విడియోను విడుదలచేసారు. విడుదలయిన వెనువెంటనే ఈ విడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు ఆగస్టు 15 నుంచి పింఛన్లు

## పంచాయతీరాజ్ సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 30:**రాష్ట్రంలోని తలసేమియా, సికిల్‌సెల్ ఎనిమియా బాధితులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అర్హులను గుర్తించి ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం సూచించారు. బాధిత కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు పింఛన్లు దోహదపడతాయని సీఎం తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై మంత్రి సీతక్కతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వితంతు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులందరికీ సంతృప్తికర స్థాయిలో పింఛన్లు మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. దివ్యాంగులు చనిపోయినప్పుడు వారి భార్యలకు తక్షణమే పింఛన్లు ఇవ్వాలని సీఎం ఆదేశించారు.

ఈ విషయంలో ఎటువంటి జాప్యానికి తావివ్వద్దన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులను ఎంపీడీవోలు పర్యవేక్షించేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 45 రోజులకు ఒకసారి మండల పరిషత్తు సమావేశాలు నిర్వహించాలని, సమావేశాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని సూచించారు. సర్పంచులు తమ గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ సమావేశాలు దోహదపడతాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని తారు రోడ్డు లేని ఊరు ఉండవద్దని సీఎం అన్నారు. ప్రతి గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలని, ప్రతి పంచాయతీకి పంచాయతీ కార్యాలయం నిర్మించాలని సీఎం ఆదేశించారు. పంచాయతీలోని జనాభా ఆధారంగా ఏ, బీ, సీలుగా వర్గీకరించి భవనాలు నిర్మించాలన్నారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.శ్రీధర్, పీఆర్ అండ్ ఆర్డీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిశోర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఈవో సెర్ప్ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యువ ఇంజినీర్లను అవమానించే హక్కు రేవంత్‌రెడ్డికి ఎవరిచ్చారు? : కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై30:** తెలంగాణ యువ ఇంజినీర్ల ప్రతిభను 'క్రిమినల్ వేస్ట్' అంటూ అవమానించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించారు. తెలంగాణ యువత సామర్థ్యాన్ని కించపరిచేలా మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. తన జీవితంలో ఎప్పుడైనా ఒక పోటీ పరీక్ష రాశారా? ఏదైనా ఉద్యోగానికి ఇంటర్వ్యూకు హాజరయ్యారా? ఏదైనా వృత్తిపరమైన సంస్థలో పనిచేసిన అనుభవం ఉందా? అని వరుస ప్రశ్నలు సంధించారు.రేవంత్ రెడ్డి గతాన్ని ప్రజలు మరచిపోలేదని పేర్కొన్న కేటీఆర్, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా ప్రారంభమైన ఆయన ప్రయాణం బ్లాక్‌మెయిల్ రాజకీయాల వరకు వెళ్లిందని విమర్శించారు. దివాళా తీసిన కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పదవిని కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చిన వ్యక్తి, దేశానికి సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లను అందిస్తున్న తెలంగాణ యువతను అవమానించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేటు జూనియర్ కాలేజీలకు

# రూ.10 లక్షల వరకు జరిమానా

## అగ్నిమాపక భద్రత సర్టిఫికెట్లు లేని కాలేజీలకు అనుమతి ఇవ్వలేదు

### ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిబంధనలు పాటించని ప్రైవేటు జూనియర్ కాలేజీలకు జరిమానాలను విధించినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. తప్పు చేస్తున్న యాజమాన్యాలను గుర్తించి, శిక్షించడంలో ఇంటర్ బోర్డు చురుకుగా వ్యవహరిస్తోందన్నారు. అనధికార ప్రవేశాలను, చట్టవిరుద్ధ కళాశాలల కార్యకలాపాలను అరికట్టడానికి బోర్డు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టిందని తెలిపారు. విద్యార్థులు అడ్మిషన్లు తీసుకునే సమయంలో ఆయా కాలేజీలకు గుర్తింపు ఉందో లేదో సరిచూసుకోవాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అధికారిక మార్గాల ద్వారా తెలిపామన్నారు. ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా పలు తనిఖీలు నిర్వహించినట్టు సెక్రటరీ తెలిపారు. గత కొన్ని నెలల్లో నిబంధనలు పాటించని అనేక కళాశాలలపై రూ.1 లక్ష నుండి రూ.10 లక్షల వరకు జరిమానాలు విధించినట్టు తెలిపారు. ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలు నిబంధనలను పాటించేలా నియంత్రించడానికి, బోర్డు టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా తనిఖీలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాలు, అగ్నిమాపక భద్రత సర్టిఫికెట్, విద్యా ప్రమాణాలను పాటించడంలో విఫలమైన కాలేజీలకు 2026-27 విద్యా సంవత్సరానికి బోర్డు అనుబంధగుర్తింపును నిలిపివేసినట్టు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును పరిరక్షించడానికి ఇంటర్‌బోర్డు నిర్దేశించిన నియమాలను ఉల్లంఘించినట్లు తేలితే ఏ సంస్థపై కఠినమైన క్రమశిక్షణా చర్యలతోపాటు చట్టపరమైన చర్యలను తీసుకుంటామని ఇంటర్ బోర్డు సెక్రటరీ హెచ్చరించారు.

# మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** మానవ అక్రమ రవాణా అనేది ఇక సరిహద్దులు దాటి జరిగే నేరం మాత్రమే కాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. మన ఇళ్లలోని మొబైల్ ఫోన్లలోకి, సోషల్ మీడియా ఖాతాల్లోకి, ఉద్యోగ ప్రకటనల రూపంలోకి చొరబడుతుందన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన సంఘటిత నేరం అన్నారు. మన పిల్లల కలలు, యువత భవిష్యత్తు, కుటుంబాల విశ్వాసాన్ని లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠాలను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి అన్నారు. ఒక చిన్నారిని లేదా యువకుడిని అక్రమ రవాణా నుంచి రక్షిచడం అంటే ఒక జీవితాన్ని, ఒక కుటుంబాన్ని, ఒక భవిష్యత్తును కాపాడినట్టే అన్నారు. పపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, హెల్ప్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణాపై రూపొందించిన వాల్ పోస్టర్స్‌ను కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు, కమిషన్ సభ్యులతో పాటు హెల్ప్ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎవిఎస్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ, ప్రస్తుతం మానవ అక్రమ రవాణా పద్ధతులు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఒకప్పుడు ప్రత్యక్షంగా జరిగే అక్రమ రవాణా ఇప్పుడు నకిలీ ఉద్యోగ ప్రకటనలు, అధిక వేతనాల హామీలు, సోషల్ మీడియా పరిచయాలు, ఆన్‌లైన్ ప్రేమ ఉచ్చులు, విదేశీ ఉద్యోగ అవకాశాల పేరుతో జరిగే సైబర్ ఆధారిత నేరంగా మారిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆయుధంగా మార్చుకున్న అక్రమ రవాణా ముఠాలను ఎదుర్కోవాలంటే డిజిటల్ అవగాహన, సైబర్ భద్రతపై ప్రజల్లో చైతన్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, శ్రీవెంకట పద్మలత, చల్లా మధుసూదన రావు, హెల్ప్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వి. భాస్కర రావు, కమ్యునికేషన్ ఆఫీసర్ అనురాధ, యువత, మహిళలు, విముక్తి సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


మానవ అక్రమ రవాణాపై రూపొందించిన వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు

## రూఫ్ టాప్ సోలార్ వినియోగదారుల బిల్లుల సెటిల్మెంట్ వేగవంతం

● వినియోగదారులకు పారదర్శక, సత్వర సేవలే లక్ష్యం
● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి



**తిరుపతి, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్‌లో గ్రిడ్‌కు అనుసంధానమైన రూఫ్ టాప్ సోలార్ వినియోగదారుల విద్యుత్ బిల్లుల సెటిల్మెంట్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధిలో భాగంగా రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. సోలార్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యంగా ముందుకెళుతున్నామని పేర్కొన్నారు. రూఫ్ టాప్ సోలార్ వినియోగదారులు ఉత్పత్తి చేసిన అదనపు విద్యుత్తును గ్రిడ్‌కు అందించడం ద్వారా రాష్ట్ర ఇంధనరంగ అభివృద్ధికి తమవంతు తోడ్పాటును అందిస్తున్నారన్నారు. వినియోగదారులకు బిల్లుల సెటిల్మెంట్‌ను సకాలంలో, పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు ఎస్‌పిడిసిఎల్ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. గతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సోలార్ మిగులు యూనిట్లకు సెటిల్మెంట్ ప్రక్రియ జరిగేదని, ప్రస్తుతం ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ దిగుమతి, ఎగుమతి విద్యుత్తు యూనిట్ల ఆధారంగా ఖచ్చితమైన విధానంతో బిల్లులను రూపొందించి, నిబంధనల మేరకు సెటిల్మెంట్ చేస్తున్నామని వివరించారు. ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అంనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 128 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో 36,963 మంది వినియోగదారులు స్వయంగా రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. విద్యుత్ వినియోగం, విద్యుత్ ఉత్పత్తి మిగులు ఆధారంగా వారికి ఈ యేడాది జూన్‌లో రూ.83.88 లక్షలు, అలాగే జులైలో రూ.68.40 లక్షల మేరకు విద్యుత్తు మిగులు యూనిట్ల బిల్లులను నేరుగా వినియోగదారుల బ్యాంక్ అకౌంట్లకు జమ చేయడం జరిగిందని తెలియజేశారు. సోలార్ విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులకు మార్గదర్శకాలను జారీ చేశామని తెలిపారు. బిల్లింగ్‌కు సంబంధించిన అంశాల్లో సందేహాలు ఉత్పన్నమైతే తమకు సమీపంలోని అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ కార్యాలయాన్ని గానీ లేదా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాన్ని గానీ సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవడం లేదా సమస్యకు పరిష్కారం పొందవచ్చని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్‌ఫ్రీ 1912 గానీ 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు : 91333 31912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.

**సోలార్ వ్యవస్థకు పెరుగుతున్న ఆదరణ:** సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు వినియోగదారుల నుండి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో బిల్లింగ్, నెట్ మీటరింగ్, నెలవారీ సెటిల్మెంట్ ప్రక్రియలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని సిఎండి శివశంకర్ లోతేటి తెలియజేశారు. సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలనుకుంటున్న అర్హులైన గృహ వినియోగదారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత వివరాలకు సమీప విద్యుత్ కార్యాలయంగానీ ఎస్‌పిడిసిఎల్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా సిఎండి లోతేటి సూచించారు.

# కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

● లోక్‌సభలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఇంద్రకీలాద్రి దేవస్థాన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో బలంగా కోరారు. తిరుపతి తరువాత అత్యంత ప్రాధాన్యత, భక్తుల తాకిడి కలిగిన విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంపై లోక్‌సభ సమావేశంలో నియమం 377 కింద ప్రత్యేక అంశాన్ని ఎంపి చిన్ని ప్రతిపాదించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన శాశ్వత మౌలిక సదుపాయాలు, యాత్రికుల సౌకర్యాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా నది తీరాన ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం శతాబ్దాల చరిత్ర కలిగిన పవిత్ర శక్తి పీఠమని ఎంపి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కోట్లాది మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్న ఈ ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత ప్రాచుర్యం పొందిన దేవాలయాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, శ్రీదేవి అలంకారాలు, తెప్పోత్సవం, భవానీ దీక్షల సందర్భంగా దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు ఇక్కడికి తరలివస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 50వేల మంది, పండుగల సమయంలో రెండు లక్షలకు పైగా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నప్పటికీ, అదే స్థాయిలో శాశ్వత మౌలిక వసతులు కూడా కల్పించాలి అని కేంద్రానికి సూచన చేసారు. ప్రసాద్ పథకం కింద భారీ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలన్నారు. ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పర్వతమాల పథకం కింద ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ కేశినేని శివనాథ్ డిమాండ్ చేశారు.



**పర్వతమాల పథకం కింద రోప్‌వే - భక్తులకు వరం:** వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలతో వచ్చే కుటుంబాలు కొండపై ఉన్న ఆలయానికి సులభంగా చేరుకునేందుకు పర్వతమాల పథకం కింద ఆధునిక రోప్‌వే వ్యవస్థను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపి కోరారు. రోప్‌వే ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు భక్తుల ప్రయాణం వేగవంతం, సురక్షితంగా మారుతుందని తెలిపారు. కనకదుర్గ అమ్మవారి ఆలయానికి అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ప్రసాద్ పథకం కింద ప్రత్యేక నిధులు, పర్వతమాల పథకం కింద రోప్‌వేకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా తక్షణమే నిర్ణయం తీసుకున్నారని ఎంపి చిన్ని తెలిపారు.

## వ్యక్తిత్వ వికాసం భవిష్యత్తు విజయానికి బలమైన పునాది

**తిరుపతి, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు 'వ్యక్తిత్వ వికాసం' అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వాహకురాలు, మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ ఇ.కోనప్రభ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలంటే ముందస్తు ప్రణాళిక, క్రమశిక్షణ, నిరంతర కృషి అత్యంత అవసరమని పేర్కొన్నారు. జీవితంలో విజయాన్ని సాధించాలంటే స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి దిశగా పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన ప్రముఖ సైకాలజిస్ట్ బండి రుక్మిణి 'భవిష్యత్తు విజయానికి బ్లూ ప్రింట్ నిర్మించుకోవడం' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తు ప్రణాళిక ప్రాధాన్యతను వివరిస్తూ స్పష్టమైన లక్ష్యం, సమయపాలన, నైపుణ్యాల అభివృద్ధి, సానుకూల దృక్పథం, క్రమశిక్షణ విజయానికి బలమైన పునాదులని తెలిపారు. విద్యార్థులు తమ బలాలు, బలహీనతలను గుర్తించి వాటిని మెరుగుపరుచుకోవడంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలు, కంప్యూటర్ పరిజ్ఞానం వంటి జీవన నైపుణ్యాలను విద్యార్థి దశలోనే పెంపొందించుకోవాలని సూచించారు. అపజయాలను విజయానికి మెట్టుగా భావించి నిరంతర ప్రయత్నముతో ముందుకు సాగాలని సైకాలజిస్ట్ బండి రుక్మిణి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.భద్రమణి, డాక్టర్ జి.నిర్మల, డాక్టర్ వాణి ప్రశాంతి, మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్టు అసిస్టెంట్స్ డాక్టర్ ఎం.ఇంద్రాణి, వి.ప్రీతి, విద్యార్థినులు పాల్గొన్నారు.



# తిరుమల సమాచారం



## తిరుమలలో తగ్గని భక్తజనసందోహం

● సర్వదర్శనానికి 18గంటలు

**తిరుమల, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో సాధారణ రోజుల్లోనూ భక్తజనసందోహం తగ్గలేదు. గురువారం కూడా తిరుమలలో భక్తులు భారీగా వున్నారు. ఉదయానికి తిరుమలలో చాంతాండంత క్యూలు బారులు తీరాయి. పెరిగిన భక్తుల రద్దీతో తిరుమలేశుని సర్వదర్శనానికి 18గంటలు సమయం పడుతోంది. సర్వదర్శనానికి సామాన్యభక్తులు మాత్రం కొండపై తగ్గలేదు. మూడుకిలోమీటర్లు దూరం క్యూలైన్లలోనే వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చింది. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించినా భక్తుల రద్దీని నియంత్రించలేని దమనీయస్థితి. ఎప్పటికప్పుడు టిటిడి ప్రసారసాధనాల ద్వారా దర్శనసమయం తెలియజేస్తున్నా భక్తులు మాత్రం వెనుకడుగు వేయలేదు. స్వామి వారిని దర్శించుకుని ముక్తిని పొందాలని పట్టుదటలతో వున్నారు. కూ ్యలైన్లలో అవస్థలన్నీ ఆలయంలోనికి చేరుకుని ఆ వెంకన్నను దర్శించుకుంటే తమ కష్టాలు తీరుతాయనే విశ్వాసం భక్తులు వ్యక్తంచేశారు. గురువారం సాయంత్రానికి సర్వదర్శనం కోసం భక్తులు బారులుతీరారు. వైకుంఠం-2లో 32 కంపార్టుమెంట్లలో నిండిపోయి సర్వదర్శనానికి భక్తులు శిలాతోరణం వరకు బారులు తీరారు. సాయంత్రం వరకు 47వేల మంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు. ఈ రద్దీ ఆదివారం వరకు కొనసాగే అవకాశముందని టిటిడి అంచనావేస్తోంది. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేపట్టింది.




## 7 నుండి కోదండరామస్వామి పవిత్రోత్సవాలు

**తిరుమల, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో ఆగస్టు 7 నుండి 10వ తేదీ వరకు వైభవంగా పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల గోడ పత్రికలు, బుక్‌లెట్లను గురువారం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర పద్మావతి అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఆగస్టు 7వ తేదీ శుక్రవారం సాయంత్రం అంకురార్పణతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. మేదినీ పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ వంటి వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. గృహస్తులు (ఇద్దరు) రూ.500లు చెల్లించి పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు. పాల్గొనే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికెతో పాటు చివరి రోజు ఒక పవిత్రం ప్రసాదంగా అందజేస్తారు. పవిత్రోత్సవాల సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్, డిప్యూటీ ఇఒ బి.నాగరత్న, సూపరింటెండెంట్ కె. శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎ.ఎం. సురేశ్ బాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# ఎఇఇ పోస్టులకు లక్షకు పైగా దరఖాస్తులు

● పూర్తిగా మెరిట్ ఆధారంగానే నియామకాలు ● అభ్యర్థులు అపోహలు, దళారుల మాయమాటలు నమ్మొద్దు ● ఎపి ట్రాన్స్‌కో జెఎండి సూర్యసాయి ప్రవీణ్ చంద్ వెల్లడి

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల్లో ఎపి ట్రాన్స్‌కో, ఎపి జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) పోస్టుల భర్తీకి సంబంధించి మొత్తం 639 పోస్టుల కోసం లక్షకు పైగా దరఖాస్తులు వచ్చాయని ఎపి ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (విజిలెన్స్ హెచ్‌ఆర్‌డి) సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎఇఇ పోస్టుల భర్తీకి సంబంధించి జూన్ 25న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా, మెరిట్ ఆధారంగానే నిర్వహించబడుతుందని జెఎండి మరోసారి స్పష్టం చేశారు. ఎఇఇ నియామకాలకు సంబంధించి సోషల్ మీడియా, ఇతర వేదికల్లో కొందరు వ్యక్తులు రాత పరీక్షలు వాయిదా పడతాయని, సిలబస్‌లో మార్పులు చేశారని, డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఇలాంటి వదంతులను, అసత్య ప్రచారాలను అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూర్యసాయి ప్రవీణ్ చంద్ హెచ్చరించారు. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని, 2026 ఆగస్టు 22 నుంచి 29 వరకు నిర్ణయించిన తేదీల్లోనే కంప్యూటర్ ఆధారిత రాత పరీక్షలు నిర్వహించబడతాయని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలు వాయిదా పడతాయనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల, మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని అభ్యర్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల సందేహాలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ఎపి విద్యుత్ రిక్రూట్‌మెంట్ పోర్టల్‌లో 24 గంటల ఆన్‌లైన్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ వ్యవస్థ అందుబాటులో ఉందని తెలిపారు. అభ్యర్థులు అధికారికంగా విడుదలయ్యే సమాచారాన్ని మాత్రమే విశ్వసిస్తూ, ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలని ఎపి ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ సూచించారు.

# అప్పలరాజు కుటుంబీకులకు జగన్ పరామర్శ

● సమయం దాటిపోవడంతో ములాఖత్ రద్దు ● మీడియాతో మాట్లాడి వెనుతిరిగిన జగన్మోహన్ రెడ్డి



**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 30 ప్రభాతవార్త:** మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి గురువారం సాయంత్రం అంపోలు జైలు వద్ద పరామర్శించారు. అప్పలరాజు సతీమణి శ్రీదేవి తనయులు ఆరవ్ వర్మలతో ఆయన మాట్లాడారు. జైలు నుంచి ఇటీవల విడుదలైన అప్పలరాజు తనయుడు ఆరవ్ వర్మతో మాట్లాడి ప్రమాద వివరాలు తదనంతరం చోటు చేసుకున్న పరిణామాల కోసం అడిగి తెలుసుకున్నారు. సీదిరి సతీమణి శ్రీదేవి, తనయులకు ధైర్యం చెప్పారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంపోలు జైలులో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ములాఖత్ ద్వారా జగన్మోహన్ రెడ్డి కలుసుకోవాల్సి ఉండగా సమయం మించిపోవడంతో అవకాశం లేకుండా పోయింది. ములాఖత్ రద్దయిపోయింది. అంపోలు జైలుకి జగన్మోహన్ రెడ్డి గురువారం మధ్యాహ్నం 2గంటలకి చేరుకోవాల్సి ఉండగా ఆయన రాక మూడు గంటలు ఆలస్యమైంది. విశాఖపట్నం ఎయిర్ పోర్టు నుంచి జైలు వరకూ దారిపొడవునా జనం ఆతడికి జేజేలు పలుకుతూ కాన్వాయ్‌ను ముందుకు సాగనివ్వకపోవడంతో నిర్ణీత సమయానికి ఆయన అంపోలు జిల్లా జైలుకి చేరుకోలేకపోయారు. అంపోలు జైలు వద్దకు ఆయన చేరుకున్నప్పటికీ జైలు నిబంధనల మేరకు సమయం దాటిన తర్వాత ములాఖత్‌కి అనుమతించే అవకాశం లేదని జైలు అధికారులు చెప్పారు. దీంతో ఆయన అంపోలు జైలు బయట సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడి తిరిగి విశాఖపట్నం ప్రయాణమయ్యారు. జగన్ వెంట వైకాపా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యన్నారాయణ ఉత్తరాంధ్రకి చెందిన ముఖ్యనేతలు అంతా ఉన్నారు.

**అడుగడుగునా జన నీరాజనాలు:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించడంతో ఆయనకు జనం అడుగడుగునా నీరాజనాలు పలికారు. పైడిభీమవరం వద్ద వైకాపా నాయకులు, కార్యకర్తలు జగన్‌కి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి అంపోలు వరకూ జగన్ కాన్వాయ్ కొనసాగింది. ప్రజలకి అభివాదం చేస్తూ జగన్ ముందుకు సాగగా ఆయనకి ఎక్కడికక్కడ నాయకులు, కార్యకర్తలు గజమాలలు, పూలమాలలతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పైడిభీమవరం, రణస్థలం, బుడమూరు, ఎచ్చెర్ల, నవభారత్ జంక్షన్, కొత్త రోడ్డు జంక్షన్, పెద్దపాడు జంక్షన్, అంపోలు జంక్షన్ ఇలా అన్ని చోట్ల కూడా వైసీపీ శ్రేణులు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు గొర్లె కిరణ్ కుమార్, చింతాడ రవికుమార్‌లతో పాటు ధర్మాన రామ్ మనోహార్ నాయుడు. డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఇతర ముఖ్యనాయకులు అంతా కూడా స్వాగతం పలికారు. కాన్వాయ్ వెంట యువకులు జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. పైడి భీమవరం నుంచి అంపోలు వరకూ జగన్ పర్యటన విజయవంతంగా సాగింది.

# 'మచిలీపట్నం' నౌకపై మంత్రి కొల్లు రవీంద్ర హర్షం

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నం పేరుతో జలాంతర్గామి విధ్వంసక నౌక నిర్మాణంపై మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేసారు. బందరు ప్రజల ఆత్మగౌరవాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపునిచ్చినందుకు ప్రధాని నరేంద్రమోడీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గేట్ వే ఆఫ్ అమరావతిగా నిర్మితమవుతున్న మచిలీపట్నం పోర్టు పేరుతో కొచ్చిన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సంస్థ ఓ భారీ జలాంతర్గామి విధ్వంసక నౌకను నిర్మించడం హర్షణీయం అన్నారు. భారత నౌకాదళం కోసం కేంద్రం నిర్మిస్తున్న ఎనిమిది జలాంతర్గామి విధ్వంసక నౌకలలో ఒకటి మచిలీపట్నం పేరుతో నిర్మించడం ఎంతో సంతోషకరం అన్నారు. ఈ నౌకను తూర్పు తీరంలో సముద్ర అంతర్భాగంలో నిఘా ఉంచేందుకు, జలాంతర్గాముల విధ్వంసానికి, తక్కువ శ్రేణి సముద్ర కార్యకలాపాలకు వినియోగించనున్నారు. మచిలీపట్నం పేరును జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే విధంగా భారీ యుద్ధ నౌకను నిర్మించడం బందరు ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## వ్యాసాశ్రమం ఏ ఒక్కరి సొంత ఆస్తి కాదు

● బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్



**శ్రీకాళహస్తి, జులై 30 ప్రభాతవార్త:** ఏర్పేడు మండల కేంద్రంలో సుమారు వందేళ్ళ క్రితం మలయాళ యతీంద్రులచే ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ఆశ్రమం నేడు ఒక కుటుంబానికి చెందిన సొంత ఆస్తిగా మారిందని, ఆశ్రమం భక్తుల భాగస్వామ్యంతో ఎంతో అభివృద్ధి చెందిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం పార్టీ కార్యలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యాసాశ్రమం నిర్వహణకు ప్రభుత్వం తరఫున కమిటీ నియామకం చేయాలని కోరారు. దీనిపై పీఠాధిపతులతో సిఎం చంద్రబాబును కలుస్తామని కోలా ఆనంద్ వెల్లడించారు. ఏర్పేడులో ఈ నెల 25న మఠాధిపతులు పీఠాధిపతులతో పోలీసులు వ్యవహరించిన తీరు ఆక్షేపమన్నారు. ఆశ్రమం ఏ ఒక్కరి సొత్తు కాదని మలయాళ స్వామి స్థాపించిన ఆశ్రమం పై దాతలకు భక్తులకు సన్యాసులకు హక్కు ఉంటుందన్నారు. దీనిపై దేవాదాయ శాఖ అజమాయిషి ఉంటుందనేది ప్రస్తుత ఆశ్రమ నిర్వాహకులు మర్చిపోతున్నారన్నారు. ఆశ్రమాన్ని ప్రస్తుత పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి, ఆయన తమ్ముడు శివరామిరెడ్డి, బంధువు అమర్నాథ్‌రెడ్డి ఇష్టానుసారంగా నిర్వహిస్తూ ఆశ్రమ కీర్తి ప్రతిష్టలు పాతాళానికి తొక్కారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రెడ్డి, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు భారీ నిధులు

● ఉత్తరాంధ్రలో పంపిణీ: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు భారీ నిధులు విడుదల చేయగా 62 లక్షల మందికి లబ్ధి చేకూరనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలో మీడియాతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టుకు సంబంధించి 62,07,573 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించనున్నట్లు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో 11,98,044 మంది లబ్ధిదారులకు గురువారమే రూ.514.42 కోట్ల పెన్షన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో ఆగస్టు 1న రూ.2,198.31 కోట్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విడతలో 50,09,529 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకూ పెన్షన్ల కోసం రూ.70,907.41 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదారులకు పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

**తిరుపతి, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. 2017 కేసులో తమిళనాడు సేలం జిల్లా పట్టనాగి పాళయం తాలూకా పట్టి వెలవు గ్రామానికి చెందిన అన్నామలై మురుగేషన్ ముద్దాయి. భీమవరం ఫారెస్ట్ బీట్ పుల్లయ్య గారి గుట్ట ప్రాంతంలో ఎర్రచందనం దుంగలతో అరెస్టయ్యాడు. ఇతను కోర్టుకు హాజరుకాకపోవడంతో ఎన్‌బిబ్ల్యు జారీ చేసి పట్టుకొచ్చారు. ఇతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



# లుక్ మార్చేద్దామా !

యువత అంటేనే సరదాలు, ఫ్యాషన్‌లు. తరచూ ఏదో ఒక పార్టీ ఉండనే ఉంటుంది. ఇలాంటప్పుడు అందరిలోనూ స్టైలిష్‌గా కనిపించాలని చేసే ప్రయత్నాలు ఒక్కోసారి సంతృప్తినివ్వవు. ఇలాంటప్పుడు ఈ చిట్కాలు పాటించి చూడండి.

◆ పార్టీలకు ఎప్పుడూ ఒకే తరహా డ్రెస్సింగ్ స్టైల్ కచ్చితంగా బోర్ కొట్టేస్తుంది. ఫ్యాషన్ ట్రెండ్స్‌లో కాలానుగుణంగా వచ్చే మార్పుల్ని పసిగడితేచాలు. మీరు అప్‌టూడేట్‌గా ఉన్నట్లే. ఇది వాన కాలం కాబట్టి కాస్త ముదురు రంగుల్ని పూల డిజైన్లనీ ఎంచుకోండి. ఇవి పగటి పూటకైతే బాగుంటాయి. సంప్రదాయ కార్యక్రమాలకు పెప్లమ్ టాప్ లాంగ్ స్కర్ట్ చక్కటి ఎంపిక. రాత్రిళ్లు జరిగే వేడుకల్లో బ్లాక్ కో ఆర్డ్ సెట్ ధరించి గోల్డ్ మెటాలిక్ బెల్ట్ పెట్టేస్తే చాలు. మీ లుక్ అదుర్స్. లేదంటే గోల్డ్, సిల్వర్ షైనింగ్ లాంగ్‌గౌన్, దానికి జతగా లాంగ్‌ఫ్లోరల్ ప్రింటెడ్ టాప్ కూడా వేసుకోవచ్చు. ◆ చాలామంది దుస్తుల మీద పెట్టిన శ్రద్ధ చెప్పుల మీద పెట్టరు. మీరూ ఆ తరహానే అయితే మారాల్సిందే. వస్త్రధారణకు తగ్గట్టుగా చెప్పులను ఎంపిక చేసుకోవాలి. ప్యాంటు, షార్టులు వేసుకున్నప్పుడు బూట్లు, స్నీకర్స్ బాగుంటాయి. అలాగే డ్రెస్‌ల మీదకు హీల్స్ బాగా నప్పుతాయి. మీరు కట్టుకున్నవి సంప్రదాయ రకాలైతే జ్యూగిలకు మించినవి లేవు. ◆ దుస్తులెంత ఆకర్షణీయంగా ఉన్నా.. కాస్తయినా మేకప్ చేసుకోకపోతే ఇబ్బందే ఇప్పుడు గ్లాసీ, నేచురల్ మేకప్‌లే ట్రెండ్. వాటికోసం సింపుల్ ప్రొడక్ట్స్ వచ్చేశాయి. అలాంటివి ఎంచుకోండి అలాగే పెదాలకు లిఫ్‌స్టిక్, కళ్లకుకాజల్ మాత్రం మరచి పోకండి. □

## ఎప్పుడు కావాలన్నా కమ్మని కాఫీ



ముక్కు పుటాలని హాయిగా పలకరించే కాఫీ పరిమళం ఒక్కసారి అలవాటైందా.. ఇక అంతే! వదలలేం. మంచి కాఫీ కలపడం ఒక ఆర్ట్ అంటారు. ఆ కెమిస్ట్రీ కుదరడం అందరికీ సాధ్యం కాదు. కానీ ఎక్కడైనా ఏ సమయంలో అయినా ఒకేలా ఉండే కాఫీని అందించాలనుకున్నారు కొమిటీర్ సంస్థను స్థాపించిన మాథ్యూరాబర్ట్స్. ఇందుకోసం తొమ్మిదేళ్లు కష్టపడి ఫ్రీజింగ్ కాఫీని తయారుచేశారు. ఈ కాఫీని కలపడానికి ఎక్కువ సమయం పట్టదు. ఒరిస్తా కాఫీ రుచిని ఇంట్లోనే పక్కాగా అందించేందుకు ఆధునిక బ్రూయింగ్ టెక్నిక్ నైపుణ్యాలని పాటించి ఈ కాఫీని తయారుచేసింది కొమిటీర్ సంస్థ. ఈ ఆలోచన నచ్చడంతో ఇన్వెస్టర్లు కోట రూపాయలని పెట్టుబడిగా అందించారు. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఎనిమిది రకాల కాఫీ గింజలతో తయారుచేసిన ఈ ఫ్రిజింగ్ కాఫీ.. మనికి బిళ్లల రూపంలో దొరుకుతుంది. కాఫీ కావాలనుకున్నప్పుడు పాలల్లో కలిపితే సరి. అన్నట్టు ఈ ఏడాది ప్రపంచ ఉత్తమ ఆవిష్కరణల్లో దీన్ని ఒకటిగా పేర్కొంది. □

# ఈ కాలంలో వ్యాధులు రాకుండా !



తొలకరితో వాతావరణం కాస్త చల్లబడింది. వర్షాలు కురుస్తున్నాయి. అయితే ఈ కాలంలో గాలిలోని అధిక తేమ వల్ల హానికారక బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశం ఎక్కువ. ఇది మన రోగనిరోధక శక్తిపై ప్రతికూల ప్రభావం చూపి వివిధ రకాల వ్యాధుల బారిన పడేలా చేస్తుంది. అందుకే ఈ కాలంలో ఆరోగ్యం విషయంలో మరింత శ్రద్ధ వహించాలి.

**విటమిన్-డి' లోపం ..** ఎముకల దృఢత్వానికి విటమిన్ 'డి' చాలా అవసరం. మరి, ఈ విటమిన్ పొందాలంటే ఉదయాన్నే లేలేత ఎండలో కాసేపు నిలబడాలి. అయితే ఈ కాలంలో ఆకాశం మబ్బులు పట్టడం వల్ల ఉదయాన్నే ఎండ వచ్చే రోజులు తక్కువ. ఫలితంగా శరీరానికి సరిపడా విటమిన్ 'డి' అందకపోవడం వల్ల కూడా వివిధ రకాల వ్యాధులు దాడిచేయచ్చు. అందుకే ఈ కాలంలో సూర్యరశ్మి లేకపోయినా విటమిన్-డి కోసం ప్రత్యామ్నాయ మార్గాల్ని ఎంచుకోవాలి. ఈ విటమిన్ అధికంగా లభించే చేపలు, గుడ్లలోని పచ్చసొన, పుట్టగొడుగులు, ఛీజ్, కమలాఫలం..వంటి ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. మరీ అత్యవసరమైతే నిపుణుల సలహా మేరకు విటమిన్-డి సప్లిమెంట్స్ కూడావాడచ్చు.



**దోమల నుంచి రక్షణకు ...** వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువ! వీటి కారణంగా మలేరియా, డెంగ్యూ, చికన్‌గునియా.. వంటి వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో వీటి బారిన పడకూడదంటే ఇంట్లో దోమల బెడద లేకుండా చూసుకోవాలి. ఈ క్రమంలో ఇంట్లోని చెత్తను ఎప్పటిప్పుడు తొలగించడం, ఆరుబయట నీళ్లు నిలవకుండా జాగ్రత్తపడడం, ఇంటి చుట్టూ క్రిమిసంహారకాలను స్ప్రే చేయడం, తులసి-బంతి-లావెండర్.. వంటి మొక్కలను ఇంటి చుట్టూ కుండీల్లో పెంచు కోవడం, ఇంట్లో అక్కడక్కడా కొన్ని అత్యవసర నూనెలు, కర్పూరం, వంటివి ఏర్పాటుచేయడం వల్ల దోమల బెడదను తగ్గించుకోవచ్చు.

**ఆహారం విషయంలోనూ...,** బయట వర్షం పడుతుంటే. వేడివేడి స్నాక్స్‌పైకి మనసు లాగడం సహజమే. అయితే వీటిని మరీ ఎక్కువగా తినడం, బయట తయారుచేసే వాటికి ప్రాధాన్యమివ్వడం.. వల్ల అజీర్తి, జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి ఇలాంటివి ఇంట్లోనే పరిశుభ్రంగా తయారుచేసుకొని తినడం మంచిది. అది కూడా మితంగానే! పైగా ఈ కాలంలో జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది కాబట్టి తేలిగ్గా జీర్ణమయ్యే కాయగూరలు, సూప్స్, బ్రెడ్, పెరుగన్నం.. వంటివి తీసుకోవడం మంచిది. వీటితో పాటు మరిగించి చల్లార్చిన నీళ్లు తాగడం, తాజా కాయగూరలు-పండ్లు, ఆకుకూరల్ని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. తద్వారా ఆరోగ్యంగా ఉండచ్చు.

**సీజనల్ అలర్జీలకు దూరంగా..!** వాతావరణంలోని మార్పుల వల్ల జలుబు, దగ్గు..వంటి సీజనల్ సమస్యలు తలెత్తడం సహజం. అయితే ఆస్తమా వంటి శ్వాసకోశ సంబంధిత సమస్యలున్న వారిలో ఇవి మరింత ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఒక్కోసారి ఇంట్లో ఉండే కంటికి కనిపించని క్రిమికీటకాలు కూడా ఇలాంటి సీజనల్ అలర్జీలకు కారణమవుతా యంటు న్నారు నిపుణులు. కాబట్టి వీటి బారిన పడకుండా ఉండేందుకు..ఇంట్లోని గాలిని శుద్ధి చేసే మొక్కల్ని పెంచుకోవాలి. మనీ ప్లాంట్, స్నేక్ ప్లాంట్, పీస్ లిల్లీ, స్పైడర్ ప్లాంట్.. వంటివి మేలు చేస్తాయి. అలాగే డాక్టర్ సలహా మేరకు ఫ్లూ వ్యాక్సిన్ వేయించు కోవడం, రోగనిరోధక శక్తిని పెంచే డ్రైఫ్రూట్స్ 'సి' విటమిన్ ఎక్కువగా ఉండే పదార్థాలు, పెరుగు, ఆకుకూరలు, మొదలైనవి తీసుకోవడం, ఆవిరి పట్టడం..వంటివి క్రమం తప్పకుండా పాటించడం వల్ల ఇలాంటి సీజనల్ అలర్జీలకు దూరంగా ఉండచ్చు. వర్షా కాలంలో అంటేనే వ్యాధుల కాలం. మనం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అప్పుడప్పుడూ పలు అనారోగ్యాలు తలెత్తుతూనే ఉంటాయి. అలాగని వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుల్ని సంప్రదిస్తే తీవ్రత తక్కువగా ఉన్నప్పుడే ఆయా అనారోగ్యాల్ని నయం చేసుకోవచ్చు. □

## 'కనకధారా స్తోత్రం'



శ్రీ శంకర భగవత్పాదులవారు ఒక రోజున భిక్షకి ఒక ఇంటికి వెళ్లారు. ఆ ఇంటి యజమానురాలు పేదరికంతో ఎన్నో ఇబ్బందులు పడుతోంది. తన ఆకలి తీర్చుకునే మార్గమే తోచక పస్తులుంటున్న ఆ పేదరాలు, శంకర భగవత్పాదులవారికి 'ఏమీలేదు' అని చెప్పలేక పోయింది. భిక్షను సమర్పించకుండగా స్వామిని పంపించడానికి ఆమెకి మనసు రాలేదు. అలాంటి పరిస్థితి తనకి వచ్చినందుకు ఆమె ఎంతో బాధపడింది. చివరికి తన దగ్గరున్న ఒక ఉసిరి కాయను .. స్వామి వారికి భిక్షగా సమర్పించింది. దాంతో ఆమె ఎలాంటి పరిస్థితుల్లో ఉందనే విషయం ఆయనకి అర్థమైపోయింది. ఆ పేదరాలి దారిద్ర్యాన్ని తొలగించమని శంకర భగవత్పాదులవారు .. లక్ష్మీ దేవిని స్తుతించారు. దాంతో లక్ష్మీ దేవి అనుగ్రహించి ఆ పేదరాలి ఇంట కనకధారను కురిపించింది. స్వామి వారి చేసిన ఆ స్తోత్రమే 'కనకధారా స్తోత్రం' అయింది. ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతోన్న వాళ్లు .. దారిద్ర్య దుఃఖాన్ని అనుభవిస్తోన్న వాళ్లు 'కనకధారా స్తోత్రం' అనునిత్యం పఠించడం వలన, ఆశించిన ఫలితం దక్కుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. □

**చిట్కా:** • వాము, మిరియాలు, ఉప్పు సమభాగాలుగా తీసుకొని చూర్ణంచేసి ప్రతి దినం భోజనానికి ముందు సేవిస్తే అజీర్ణం ఉదరశూల తగ్గును.
• మాదీఫలకాయ, గోరింటాకు, నారింజవేరు చెక్క నూరి రాసిన అరికాలి మంటలు తగ్గును.
• కాల్చిన అల్లపుముక్కను ఉప్పుతో అద్ది తింటున్న అరుచి తగ్గును. కృష్ణ తులసి ఆకురసమును కర్పూరగంధముతీసి రాయచుండిన తెల్లమచ్చలు పోవును. □

## కళ్ల ఉపశమనం కోసం..



కళ్లు తగినంత కన్నీటిని ఉత్పత్తి చేయనప్పుడూ, లూబ్రికేషన్ అందనప్పుడూ డ్రై ఐ సిండ్రోమ్‌కు దారితీస్తుంది. దీనివల్ల ఒక్కోసారి కళ్లలో మంట, దురద, ఎర్రబడటం, కాంతిని చూడలేకపోవడం జరుగుతుంది. వీటి నుంచి ఉపశమనం పొందడానికి ఈ చిట్కాలను పాటిస్తే సరి.

**శుభ్రం చేయడం..** కాటన్ వస్త్రాన్ని గోరువెచ్చని నీళ్లలో ముంచి నీటినిపిండాలి. కళ్లపై ఐదు నిమిషాలు ఉంచి, వృత్తాకారంలో కనురెప్పలపై మృదువుగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల కంటిలో ఉండే దుమ్మూధూళీ బయటకు వచ్చేస్తాయి. ఇలా రోజులో కనీసం మూడు సార్లు చేయాలి.

**కొబ్బరినూనె..** కళ్ల తేమను కోల్పోకుండా ఇది కాపాడుతుంది. అంతేకాదు ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పొడిబారడం వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లనుతగ్గిస్తాయి. కొబ్బరి నూనెలో దూదిని ముంచి మూసి ఉన్న కనురెప్పలపై 15 నిమిషాలు ఉంచాలి. ఇలా ఉపశమనపం కలిగేంత వరకూ రోజులో ఎన్నిసార్లైనా చేయవచ్చు.

**కలబంద గుజ్జు :** ఇందులో ఉండే ఆల్కలీన్ గుణాలు కళ్లను తేమపూరితం చేస్తాయి. దీనిలోని మాయిశ్చరైజింగ్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఎరుపు తద్వారా వచ్చే వాపును తగ్గిస్తాయి. ఇందుకుగానూ కలబంద గుజ్జు తీసుకుని కంటి చుట్టూ సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత గోరువెచ్చని నీటిలో శుభ్రం చేస్తే సరి. రోజుకి రెండుసార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

**రోజ్‌వాటర్ :** ఒత్తిడి వల్ల అలసి పోయిన కంటికి ఇది ఉపశమనం కలిగిస్తుంది. విటమిన్-ఎ లోపం వల్ల కళ్లు పొడిబారుతుంటాయి. రోజ్‌వాటర్‌లో విటమిన్-ఎ పుష్కలంగా ఉంటుంది. గులాబీ నీళ్లలో దూది ఉండల్ని నాననివ్వాలి. వాటిని కళ్లపై పదినిమిషాలు ఉంచాలి. తరవాత చల్లటి నీటితో శుభ్రం చేస్తే సరి. రోజులో కనీసం మూడు సార్లు చేస్తే సమస్య తగ్గుతుంది. కంటి ఆరోగ్యాన్ని కాపాడే కొన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకుంటే మంచిది. చేపలు, అవిసెలు, వాల్‌నట్స్‌తోపాటు ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలుండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల కంటిలో తేమ పెరుగుతుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. □

చెలి మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం..
ఈ మెయిల్: Cheli@vaartha.com

# తెర

## 'ది మేజ్' 'నన్నే నన్నే..' పాట విడుదల



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా 'ది మేజ్'. ఈ మూవీలో ప్రియాంక, ప్రాతిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె.రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. 'ది మేజ్' చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.తాజాగా ఈ చిత్రం నుంచి హీరో ఆనంద్ దేవరకొండ చేతుల మీదుగా ఫస్ట్ సింగిల్ 'నన్నే నన్నే..' రిలీజ్ చేశారు. శ్రవణ్ భరద్వాజ్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేసిన ఈ పాటకు విజయ్ కుమార్ ప్లెజెంట్ లిరిక్స్ అందించారు. వాస్తవం-భ్రమ మధ్యనున్న సరిహద్దులను చెరిపేస్తూ, ప్రతి క్షణం మీ ఆలోచనలను సవాలు చేసే, జెయింట్ వీల్ ప్రయాణం లాంటి ఉత్కంఠభరితమైన సైకలాజికల్ థ్రిల్లర్ గా ఈ సినిమా రూపొందుతోంది.

## 10 యేళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న విజయ్ దేవరకొండ




హీరో విజయ్ దేవరకొండ 10 ఏళ్ల అద్భుతమైన కెరీర్ ను కంప్లీట్ చేసుకున్నారు. ఆయన సోలో హీరోగా నటించిన తొలి సినిమా పెళ్లి చూపులు 2016లో ఇదే రోజు రిలీజైంది. అప్పటికే ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాలో నటించి పేరు తెచ్చుకున్న విజయ్..పెళ్లి చూపులు సినిమాతో సోలో హీరోగా అరంగేట్రం చేశారు. మొదటి చిత్రంతోనే ప్రేక్షకుల ప్రేమాభిమా నాలు సంపాదించుకుని, బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ కొట్టారు విజయ్. ఈ సినిమా విజయంతో ఆయన వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. టాక్సీవాలా, అర్జున్ రెడ్డి, గీత గోవిందం, ఫ్యామిలీ స్టార్, ఖుషి, కింగ్డమ్ ఇలా..వరుసగా సక్సెస్ ఫుల్ సినిమాలు చేస్తూ పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు విజయ్ దేవరకొండ. ప్రభాస్ కల్కి సినిమాలో అర్జునుడి పాత్రలో స్పెషల్ అప్పీయరెన్స్ ఇచ్చారు. భారీ చిత్రాలు చేస్తూ పాన్ ఇండియా స్థాయిలో తెలుగు సినిమా స్పాన్ పెరగడంలో తన వంతు కృషి చేస్తున్నారు విజయ్. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా చిన్న సినిమాతో కెరీర్ మొదలుపెట్టి పెద్ద స్టార్‌గా ఎదిగిన విజయ్ ప్రస్థానం ఎంతో మంది కొత్త వాళ్లకు ఇన్స్పిరేషన్‌గా నిలుస్తోంది.విజయ్ ఈ పదేళ్లలో సాధించింది ఒక హిస్టరీ. ఈ దశాబ్దకాలంలో జయాపజయాలు, ఎత్తుపల్లాలు, ప్రేమ, ద్వేషం ఎదుర్కొన్నారు విజయ్. మరే హీరో చూడనంత వెర్సటైల్ కెరీర్ చూశారు. రౌడీ వేర్ బ్రాండ్‌తో ఒక వ్యాపారవేత్తగా సక్సెస్ ఫుల్‌గా కొనసాగుతూనే, ది దేవరకొండ ఫౌండేషన్‌తో పేద మధ్య తరగతి వారికి సహాయ కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవల మహబూబ్ నగర్ జిల్లాలో ప్రతిభ గల 180 మంది పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందించారు. ఇలా విజయ్ స్టార్ గా ఎదగడమే కాదు వ్యక్తిగతంగా తన గొప్ప మనసు చాటుకుంటున్నారు.

## ఐదు భారతీయ భాషల్లో విడుదలైన 'రామాయణ: పార్ట్ 1' ట్రైలర్ రిలీజ్



నితీశ్ తివారి దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఎనిమిది అకాడమీ అవార్డులు ఆస్కార్ గెలుచుకున్న విజువల్ ఎఫెక్ట్స్ స్టూడియో డీఎన్ఈజీ, యశ్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ భాగస్వామ్యంతో నిర్మితమవుతున్న 'రామాయణ: పార్ట్ 1' ప్రపంచవ్యాప్తంగా దీపావళి 2026 సందర్భంగా విడుదల కానుంది.ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'నమిత్ మల్హోత్రా రామాయణ: పార్ట్ 1' అఫీషియల్ ట్రైలర్‌ను చిత్ర బృందం పపంచవ్యాప్తంగా విడుదల చేసింది. జూలై 30 తెల్లవారుజామున విడుదలైన ఈ ట్రైలర్ హిందీ, కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను, సినీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నమిత్ మల్హోత్రా 'రామాయణ' గురించి:విజనరీ మేకర్ నమిత్ మల్హోత్రా నుంచి ప్రపంచంలోనే అత్యంత శాశ్వతమైన మహాకావ్యాల్లో ఒకటైన రామా యణం ఆధారంగా రూపొందుతున్న రెండు భాగాల భారీ సినీ ప్రయాణం 'రామాయణ: పార్ట్ 1' ప్రేక్షకుల ముందుకు రానుంది.

## దిల్ రాజు డ్రీమ్స్ సంస్థ మొదటి హీరో విక్రాంత్



సంతాన ప్రాప్తిరస్తు సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో తనకుంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో విక్రాంత్. ఈ సినిమాలో విక్రాంత్ నటనకు మంచి పేరొచ్చింది. సంతాన ప్రాప్తిరస్తు సినిమా థియేట్రికల్‌గా మంచి విజయాన్ని సాధించింది. ఓటీటీల్లోనూ ప్రేక్షకుల ఆదరణ పొందింది. డిస్నీ హాట్ స్టార్, ప్రైమ్ వీడియోలో ఈ సినిమా 200 మిలియన్స్ మినిట్స్ వ్యూస్ దక్కించుకుని కొన్ని వారాల పాటు ట్రెండింగ్ లో నిలిచింది. ఈ సినిమా విజయం ఇచ్చిన ప్రోత్సాహంతో హీరో విక్రాంత్ ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ చేస్తున్నారు. విక్రాంత్ ప్రస్తుతం ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణ సంస్థ దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్ లో మార్కండేయ అనే డివోషనల్ మిస్టికల్ థ్రిల్లర్ మూవీలో నటిస్తున్నారు. దిల్ రాజు డ్రీమ్స్ సంస్థ తొలి సినిమా హీరో విక్రాంత్ కావడం విశేషం. ఈ సినిమా త్వరలో చిత్రీకరణ జరుపుకోనుంది. మార్కండేయ సినిమా హీరో విక్రాంత్ కు మంచి ఫేమ్ తీసుకురానుంది. ఈ సినిమాతో పాటు హీరో విక్రాంత్ మధుర శ్రీధర్ రెడ్డి ప్రొడ్యూసర్ సురేశ్ బాబు కాంబినేషన్ లో ఓ ఇంట్రెస్టింగ్ హారర్ కామెడీ చిత్రంలో నటించబోతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన వివరాలు మేకర్స్ వెల్లడించనున్నారు. మార్కండేయ, మధుర శ్రీధర్ రెడ్డి సురేశ్ బాబు కాంబో మూవీస్ తో ఒక ప్రామిసింగ్ యంగ్ హీరోగా విక్రాంత్ ఎదుగుతాడనే అంచనాలు ఏర్పడుతున్నాయి. విక్రాంత్ హీరోగా మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటూ ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.

## 'భోగి' భారీ క్లైమాక్స్ షెడ్యూల్ పూర్తి



'చార్మింగ్ స్టార్' శర్వా హీరోగా, 'మాస్ మావెరిక్' సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ,లక్ష్మి రాధామోహన్ సమర్పి స్తున్న ఈ చిత్రం భారీ స్థాయి అత్యున్నత నిర్మాణ ప్రమాణాలతో అంచనాలను పెంచుతూనే ఉంది.శర్వాను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని పవర్‌ఫుల్ లుక్‌లో పరిచయం చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు, గ్రామీణ యువతిగా అనుపమ పరమేశ్వరన్ లుక్ ప్రేక్షకులను ఆకట్టు కుంది. తాజాగా చిత్ర యూనిట్ భారీగా రూపొందించిన 22 రోజుల క్లైమాక్స్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రొడక్షన్ డిజైనర్ కిరణ్‌కుమార్ మన్నె రూపొందించిన భారీ సెట్‌లో ఈ క్లైమాక్స్‌ను చిత్రీకరించారు. ఈ ఒక్క షెడ్యూల్ కోసం దాదాపు మూడు నెలల పాటు ప్రత్యేకంగా ప్రీప్రొడక్షన్ పనులు నిర్వహించడం, మేకర్స్ ఈ సినిమాను ఎంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారో తెలియజేస్తోంది.భారీ యాక్షన్ ఎపిసోడ్‌లో 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. ప్రతి ఫ్రేమ్‌ను అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందించేందుకు నిర్మాత కేకే రాధామోహన్ ఎలాంటి రాజీ పడకుండా ఖర్చు పెట్టారు.ఈ క్లైమాక్స్‌కు ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ ధిలీప్ సుబ్బరాయన్ యాక్షన్‌ను డిజైన్ చేశారు. థియేటర్లలో ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చే స్థాయిలో ఈ యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతుంది. సినిమాకు టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ కిషోర్ కుమార్‌క్లైమాక్స్‌ను అద్భుతమైన విజువల్స్‌తో తెరపై ఆవిష్కరిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో తనమాస్ బీజీఎమ్, ఎమోషనల్ స్కోర్‌తో యాక్షన్ సన్నివేశాలను మరింత ఎలివేట్ చేయనున్నారు.

## 'పళ్ళబురుసు' ఎంటర్‌టైనింగ్ టీజర్



ఫోక్ చార్ట్‌బస్టర్ 'కొత్త సోకు' పాటకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిన తర్వాత, 'పళ్ళబురుసు ' చిత్ర బృందం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్‌ను విడుదల చేసింది. యువ సామ్రాట్ నాగచైతన్య లాంచ్ చేసిన ఈ టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతూ, ప్రేక్షకులకు వినోదభరితమైన ప్రపంచాన్ని పరిచయం చేసింది. వేపపుల్ల తో పళ్లు తోముకుంటున్న హీరోను చూసి గ్రామస్థులు 'పళ్ళబురుసు తెలీదా?' అని ప్రశ్నించడంతో టీజర్ ప్రారంభమ వుతుంది. ఆ ఒక్క ప్రశ్నే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. టీజర్ ముందుకు సాగే కొద్దీ విచిత్రమైన పాత్రలు, సరదా సంఘ టనలు, ఊహించని మలుపులు కనిపిస్తాయి. కామెడీ, భావోద్వేగాలు, పల్లెటూరి నేపథ్యాన్ని మేళవించిన 'పళ్ళ బురుసు' మంచి విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. విజువల్స్, ఆకట్టుకునే హాస్యం, ఉత్సాహభరితమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. ఇప్పటికే 'కొత్త సోకు' పాటతో ఆకట్టుకున్న గ్రామీణ వాతావరణాన్ని ఈ టీజర్ మరింత బలంగా చూపించింది.నాగచైతన్య టీజర్‌ను విడుదల చేయడంతో సినిమాకు మరింత క్రేజ్ ఏర్పడింది. ఇప్పటికే ఈ టీజర్ సోషల్ మీడియాలో మంచి స్పందనను అందుకుంటోంది.సుధాకర్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'పళ్ళబురుసు' చిత్రానికి ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ అరుదైన రికార్డ్




## బాక్సింగ్‌లో 10 పతకాలు ఖాయం

**న్యూఢిల్లీ:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత బాక్సర్లు ముఖ్యంగా మహిళా బాక్సర్లు అదరగొడుతున్నారు. తమ పంచులతో భారత బాక్సర్లు ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తూ ఏకంగా 10 పతకాలను ఖాయం చేసుకుని చరిత్ర సృష్టించారు. 1934లో తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొన్నప్పటి నుంచి బాక్సింగ్‌లో భారత్ ఇన్ని పతకాలు నెగ్గడం ఇదే తొలిసారి. ఈ గేమ్స్‌లో ఇప్పటికే భారత్ 22 పతకాలను ఖాయం చేసుకోగా, అందులో 10 పతకాలు బాక్సింగ్ విభాగం నుంచే వచ్చాయి. ఏకంగా పది మంది బాక్సర్లు సెమీఫైనల్స్‌కు చేరుకోవడంతో ఒక్కొక్కరికి కనీసం కాంస్య పతకం వస్తుంది. ముందుగా లవ్లీనా బోర్గోహైన్ (75 కేజీలు) బై ద్వారా నేరుగా సెమీస్‌కు అర్హత సాధించి భారత్‌కు తొలి పతకాన్ని ఖాయం చేసింది. ఆ తర్వాత 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన ప్రత్యర్థిని తన కళ్లు చెదిరే పంచులతో మట్టికరిపించి రెండో పతకం ఖాయం చేసింది. 60 కేజీల విభాగంలో ప్రియా ఘంఘాస్ కూడా అద్భుతంగా ఆడి సెమీస్‌కు చేరింది. ఈ నెల 29వ తేదీ ఒక్కరోజే ఆరుగురు భారత బాక్సర్లు సెమీస్ చేరి అదుర్స్ అనిపించారు. 51 కేజీల విభాగంలో బరిలోకి దిగిన సాక్షి చౌదరి నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన కైట్లిన్ ఫ్రైయర్స్‌పై 5-0 తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. 70 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి న్యూజిలాండ్‌కు చెందిన మోర్గాన్ హెండర్సన్‌పై 3-1తో నెగ్గి సెమీస్ బెర్త్ దక్కించుకుంది. మరో సంచలనం జాస్మిన్ లాంబోరియా 57 కేజీల విభాగంలో ఇంగ్లాండ్ కి చెందిన ఎలీస్ గ్లిన్‌ను 4-1తో చిత్తు చేసి పతకాన్ని ఖాయం చేసుకుంది. పురుషుల 55 కేజీల విభాగంలో జాదుమణి సింగ్ నైపుణ్యంతో కూడిన ఆట ఆడి జాంబియా బాక్సర్‌ను ఓడించి ముందుగానే సెమీస్ చేరాడు. ఇక 60 కేజీల విభాగంలో సచిన్ సివాచ్ 5-0 తేడాతో బోట్స్వానా బాక్సర్‌ను చిత్తు చేశాడు. 80 కేజీల విభాగంలో అంకుష్ పంఘాల్ సెషెల్స్‌కు చెందిన జేడ్ మైకాక్‌ను 5-0 తో ఓడించాడు. చివరగా నరేందర్ బెర్వాల్ (+90 కేజీలు) చాలా నాటకీయంగా సాగిన పోరులో సమోవా బాక్సర్‌పై 3-2 తో ఉత్కంఠ విజయం సాధించి 10వ పతకాన్ని ఖాయం చేశాడు.




## కామన్వెల్త్ గేమ్స్.. దిలీప్‌కు స్వర్ణం
### బాసిల్, మురళికి రజతం

**న్యూఢిల్లీ:** 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో భారత్ పతకాల వర్షం కురిపించడం కొనసాగించింది. గ్లాస్గోలో గురువారం జరిగిన పురుషుల 100 మీటర్ల టి47 విభాగంలో దిలీప్ గావిత్. మహమ్మద్ బాసిల్ కూడా నిలవడంతో, భారతదేశానికి డబుల్ పోడియం పూర్తయింది. గావిట్ 10.71 సెకన్లలో స్వర్ణ పతకం సాధించగా, బాసిల్ 10.83 సెకన్లలో రేసును పూర్తి చేసి దేశ చరిత్రలోనే తొలి రికార్డును నమోదు చేసి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 2022 ఆసియా పారా గేమ్స్‌లో పురుషుల 400 మీటర్ల టి47 ఈవెంట్‌లో గావిత్ స్వర్ణం గెలుచుకొని, ఆ గేమ్స్‌లో భారతదేశానికి చారిత్రాత్మక 100వ పతకాన్ని అందించాడు. దిలీప్ పారిస్ 2024 పారాలింపిక్స్‌లో పురుషుల 400 మీటర్ల టి47 ఈవెంట్ ఫైనల్‌కు కూడా చేరుకున్నాడు. అంతకు ముందు మురళీ శ్రీశంకర్ పురుషుల లాంగ్ జంప్‌లో 8.09 మీటర్ల దూరం దూకి రజత పతకం గెలుచుకొని ఆ రోజు పట్టికను ప్రారంభించాడు. మరోవైపు, పరుల్ చౌదరి మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో 9:26.75 టైమింగ్‌తో ఐదవ స్థానంలో నిలిచింది. షాట్ పుట్ విభాగంలో మరోవైపు, 17.49 మీటర్ల త్రోతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్న మన్‌ప్రీత్ కౌర్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. ఫైనల్ రౌండ్‌కు ముందు కాంస్య పతక స్థానంలో ఉన్న మన్‌ప్రీత్‌ను, జమైకాకు చెందిన లాయిడ్రిసియా కామెరాన్ అధిగమించింది. ఆమె చివరికి 17.89 మీటర్ల త్రోతో మూడవ స్థానంలో నిలిచింది.

## వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్.. సెమీఫైనల్స్‌కు భారత్ పురుషుల జట్టు
### ఓటమితో మహిళల టీమ్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ స్క్వాష్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లలో మూడో సీడ్ ఇంగ్లాండ్‌పై 2-1 తేడాతో హోరాహోరీగా జరిగిన పోరులో విజయం సాధించిన భారత పురుషుల జట్టు సెమీ ఫైనల్స్‌కు దూసుకెళ్లగా, అమెరికా చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలైన మహిళల జట్టు ప్రయాణం క్వార్టర్ ఫైనల్స్‌తోనే ముగిసింది. గత ఎడిషన్‌లో కాంస్య పతకంతో సరిపెట్టుకున్న ఐదో సీడ్ భారత పురుషుల జట్టు గురువారం ఇంగ్లాండ్‌పై పోరాట పటిమతో కూడిన ప్రదర్శనతో తమ విజయ పరంపరను కొనసాగించింది. ఆర్యవీర్ దీవాన్ మ్యాచ్ గెలిచి భారత్‌కు ఆరంభంలోనే ఆధిక్యం అందించగా, ఇస్మాయిల్ ఖలీల్‌తో ఐదు గేమ్‌ల పోరాటం తర్వాత యుషా నఫీస్ టైని ముగించలేకపోయాడు. ఆ తర్వాత నిర్ణయాత్మక మ్యాచ్‌లో గుర్వీర్ సింగ్ అద్భుత ప్రదర్శన చేసి, జార్జ్ గ్రిఫిత్స్‌ను వరుస గేమ్‌లలో ఓడించి భారత్‌ను చివరి నాలుగు స్థానాల్లో నిలిపాడు. మరోవైపు, ఆశాజనకమైన ఆరంభం చేసినప్పటికీ భారత మహిళల జట్టు మూడో సీడ్ టీమ్ యూఎస్ఏ చేతిలో 1-2 తేడాతో ఓటమి చవిచూసింది. ప్రస్తుత ప్రపంచ జూనియర్ ఛాంపియన్ అనాహత్ సింగ్, దియా యాదవ్‌పై వరుస గేమ్‌లలో విజయం సాధించి భారత్‌ను ఆధిక్యంలోకి తీసుకువచ్చింది. అయితే, అమెరికాకు చెందిన షార్లెట్ స్జే, రుద్ర సింగ్‌ను 11-6, 11-4, 11-8 తేడాతో ఓడించి మ్యాచ్‌ను సమం చేసింది. ఆ తర్వాత లిల్లీ బౌరెల్, అనైకా దుబేను వరుస గేమ్‌లలో ఓడించి యుఎస్ఎ తరఫున తన జట్టును సెమీఫైనల్స్‌కు చేర్చింది.




## క్యాప్ నంబర్ 278కి గుడ్‌బై
### చరిత్రలో నిలిచిన అజింక్య రహానే

**న్యూఢిల్లీ:** టీమిండియా సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు. దీంతో భారత క్రికెట్‌లో ఓ స్వర్ణ యుగానికి ముగింపు పలికినట్లైంది. ఆస్ట్రేలియాపై 2021లో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని టీమిండియాకు అందించిన కెప్టెన్‌గా రహానే భారత చరిత్రలో నిలిచిపోయాడు. అజింక్య విదేశీ గడ్డపై క్లిష్టమైన పిచ్‌లపై అద్భుతంగా బ్యాటింగ్ చేస్తూ టీమిండియాకు ఎన్నో కీలక విజయాలు అందించాడు. అజింక్స్ ఆడిన టెస్టుల్లో సగానికి పైగా విదేశాల్లోనే ఉండటం అతని ప్రత్యేకత. రహానే కెరీర్‌లో అత్యంత చిరస్మరణీయ ఘట్టం 2020-21 ఆస్ట్రేలియా పర్యటన.
అడిలైడ్ టెస్టులో భారత్ 36 పరుగులకే ఆలౌట్ కావడంతో పాటు తొలి మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది. అనంతరం కెప్టెన్ విరాట్ కోహ్లీ సెలవుతో రహానే తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. మెల్‌బోర్న్ టెస్టులో భారత్‌ను 8 వికెట్ల తేడాతో గెలిపించి సిరీస్‌ను సమం చేశాడు. అనంతరం సిడ్నీ టెస్టును డ్రా చేయించడంతో పాటు, గబ్బా వేదికగా 328 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి భారత్‌కు చారిత్రాత్మక 2-1 సిరీస్ విజయాన్ని అందించాడు. రహానే తన కెరీర్‌లో భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో 5,077 పరుగులు చేసి 12 సెంచరీలు, వన్డేల్లో 2,962 పరుగులు చేయగా, అందులో మూడు సెంచరీలు, 24 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 20 టీ20ల్లో 375 పరుగులు చేయగా, ఒకే ఒక్క హాఫ్ సెంచరీ బాదాడు. ఇక ఐపిఎల్‌లో 212 మ్యాచులో 5,367 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## కామెన్వెల్త్ జావెలిన్ త్రో.. ఫైనల్స్‌కి నీరజ్, రోహిత్, యశ్‌వీర్




**న్యూఢిల్లీ:** ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రా, తోటి భారతీయులైన రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్‌లతో కలిసి గురువారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో విజయవంతంగా గెలిచి 2026 కామన్వెల్త్ గేమ్స్ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు చేరుకున్నారు. ఇందులో పోటీపడిన అథ్లెట్లలో, ఎవరూ కూడా 84.00 మీటర్ల ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ మార్కును అధిగమించలేకపోయారు. దానికి బదులుగా, 12 ఉత్తమ ప్రదర్శనల ఆధారంగా ఫైనలిస్టులను నిర్ణయించారు, ఇందులో ముగ్గురు భారతీయ త్రోయర్లు శుక్రవారం జరిగే మెడల్ ఈవెంట్‌లో తమ స్థానాలను సురక్షితం చేసుకున్నారు. గాయం కారణంగా బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌కు దూరమైన తర్వాత, తిరిగి ఈ గేమ్స్‌లో ఆడుతున్న నీరజ్, తన రెండవ ప్రయత్నంలో 79.61 మీటర్ల అత్యుత్తమ త్రో సాధించి క్వాలిఫికేషన్ స్టాండింగ్స్‌లో ఐదవ స్థానంలో నిలిచాడు. క్వాలిఫికేషన్ సాధించినందున, అతను తన చివరి త్రో వేయకూడదని నిర్ణయించుకున్నాడు. రోహిత్ యాదవ్ కూడా 78.37 మీటర్లు నమోదు చేసి తన చివరి ప్రయత్నాన్ని విరమించుకుని తొమ్మిదో స్థానంలో నిలవగా, యశ్ వీర్ సింగ్ 78.36 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో 10వ స్థానంలో అర్హత సాధించాడు.

# రెండోరోజూ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
## ఐపిఓలు, కొత్త లిస్టింగ్స్‌పై ఇన్వెస్టర్లఫోకస్




**ముంబై,జులై 30:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం ఒడిదుడుకుల మధ్య ట్రేడింగ్ సాగించినప్పటికీ చివరికి స్వల్ప లాభాలతో ముగిశాయి. దీంతో వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ మార్కెట్లు పాజిటివ్ ముగింపును నమోదు చేశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 273.55 పాయింట్లు పెరిగి 77,928.15 వద్ద ముగియగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ50 సూచీ 66.95 పాయింట్లు లాభపడి 24,317.15 వద్ద స్థిరపడింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.51 శాతం, నిఫ్టీ 1.38 శాతం మేర లాభపడ్డాయి.మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లలో నమోదైన కొనుగోళ్లు మార్కెట్లకు ప్రధాన బలంగా నిలిచాయి. ఎం అండ్ ఎం షేరు 2.26 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.06 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 0.70 శాతం చొప్పున లాభపడ్డాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.29 శాతం తగ్గగా, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.83 శాతం క్షీణించింది. బిఎస్ఇలో మొత్తం 1,690 షేర్లు లాభపడగా, 2,527 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 200 షేర్లలో ఎలాంటి మార్పు నమోదుకాలేదు.విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ 95.6250 వద్ద ట్రేడవగా, అంతకుముందు 95.7625 వద్ద ముగిసింది. భారత 10 యేళ్ల కమోడిటీ మార్కెట్‌లో ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 0.72 శాతం పెరిగి రూ.1,42,801కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ సెప్టెంబర్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 13 సెంట్లు పెరిగి 90.87 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. ఎక్స్‌ట్రానెట్ టెక్నాలజీస్ షేరు తొలి ట్రేడింగ్ రోజును రూ.124.80 వద్ద ముగించి, ఇష్యూ ధర రూ.127తో పోలిస్తే 1.73 శాతం డిస్కౌంట్‌లో నిలిచింది. షేరు రూ.130.10 వద్ద లిస్టై, రోజులో రూ.123.60 నుంచి రూ.136.60 మధ్య ట్రేడైంది. లోహియా కార్ప్ షేరు మాత్రం ఇష్యూ ధరపై 16.39 శాతం ప్రీమియంతో రూ.494.65 వద్ద ముగిసింది. రోజంతా 15.38 లక్షలకు పైగా షేర్లు ట్రేడయ్యాయి. ఇండోఎంఎం షేరు ఇష్యూ ధరపై 52.95 శాతం ప్రీమియంతో రూ.741.80 వద్ద ముగిసి ఇన్వెస్టర్లకు భారీ లాభాలను అందించింది. రోజు ట్రేడింగ్‌లో ఎస్ఎంఎల్ మహీంద్రా షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకగా, రెడింగ్టన్ 7.84 శాతం, విగార్డ్ ఇండస్ట్రీస్ 4.88 శాతం, బాలకృష్ణ ఇండస్ట్రీస్ 11.06 శాతం లాభపడ్డాయి. ఎంటిఎఆర్ టెక్నాలజీస్ షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకగా, సింజీన్ ఇంటర్నేషనల్ షేరు 3.44 శాతం నష్టపోయింది.ఐపిఓలకు మిశ్రమ స్పందనమణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఐపీఓకు 4.04 కోట్ల షేర్లకు బిడ్లు రాగా, విక్రయానికి 9 కోట్లకు పైగా షేర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఇష్యూ ధర శ్రేణిని రూ.560-590గా నిర్ణయించారు. ఎంవీ ఎలక్ట్రోసిస్టమ్స్ ఐపిఓకు 1.40 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. విక్రయానికి ఉంచిన షేర్లతో పోలిస్తే ఈ ఇష్యూ 3.52 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. దీని ధర శ్రేణి రూ.400-425గా ఉంది.జునిపర్ గ్రీన్ ఎనర్జీ ఐపీఓకు మాత్రం ఆశించిన స్పందన లభించలేదు. 2.10 కోట్ల షేర్లకు మాత్రమే బిడ్లు రాగా, ఈ ఇష్యూ 0.36 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ఒక్కో షేరు ధర శ్రేణిని రూ.214-225గా నిర్ణయించారు.

## 10 లక్షల ఉత్పత్తి సామర్థ్యంతో మారుతి ప్లాంట్ సిద్ధం




**అహ్మదాబాద్,జులై 30:** ఆటో మొబైల్ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా గుజరాత్‌లోని హన్సల్ పూర్‌లో తన నాలుగో తయారీ ప్లాంట్‌లో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థం 10 లక్షల వాహనాలకు చేరి, అతిపెద్ద ప్యాసింజర్ వాహన తయారీ కేంద్రంగా అవతరించింది. 7.5 లక్షల యూనిట్ల సామర్థంతో ఉన్న ఈ ప్లాంట్, కొత్త ప్లాంట్‌డి ప్రారంభంతో ఇప్పుడు 10 లక్షల యూనిట్లకు విస్తరించింది. హన్సల్‌పూర్ ప్లాంట్‌పై కంపెనీ ఇప్పటివరకు రూ. 25,288.7 కోట్లు పెట్టుబడి పెట్టగా, ఇందులో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌పైనే సుమారు రూ. 3,900 కోట్లు ఖర్చు చేసింది. ప్రపంచవ్యాప్తంగా సుజుకి తయారీ కేంద్రాల్లో ఒకేచోట 10 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిన తొలి ప్లాంట్‌గా కూడా ఇది నిలిచింది. ఈ విస్తరణతో మారుతి సుజుకి మొత్తం తయారీ సామర్థం యేటా 29 లక్షల యూనిట్లకు పెరిగింది. ఈ కొత్త ప్లాంట్‌లో మారుతి తన ఫ్లాగ్‌షిప్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం ఇ-విటారాను తొలుత తయారు చేయనుంది. దీని ద్వారా కంపెనీ ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి అధికారికంగా ప్రవేశిస్తోంది. ప్రస్తుతం హన్సల్‌పూర్ ప్లాంట్‌లో ఫ్రాంక్స్, బాలెనో, స్విఫ్ట్ వంటి ప్రముఖ మోడళ్లను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్లాంట్ కంపెనీకి కీలకమైన ఎగుమతుల కేంద్రంగా కూడా మారింది. మారుతి మొత్తం విదేశీ ఎగుమతుల్లో దాదాపు 47 శాతం వాటాను హన్సల్‌పూర్ ప్లాంట్‌నుంచే ఉన్నాయి.

## రూ.19వేల కోట్ల రుణ సమీకరణకు యూనియన్ బ్యాంక్




**ముంబయి,జులై 30:** ప్రభుత్వ రంగ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విదేశీ కరెన్సీ రుణసేకరణ చేస్తోంది. బ్యాంకు డైరెక్టర్ల బోర్డు విదేశీ కరెన్సీలో గరిష్ఠంగా రూ.19, 146 కోట్లు సమీకరించేందుకు ఆమోదం తెలిపింది.గురువారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన వివరాల ప్రకారం, బ్యాంకు దుబాయ్ మరియు/లేదా సిడ్నీ శాఖల ద్వారా రుణ పత్రాలు (డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్) జారీ చేసి ఈ నిధులను సమీకరించనుంది. ఇప్పటికే ఈ యేడాది మే నెలలో యూనియన్ బ్యాంక్ ఈక్విటీ, డెట్ ఇన్‌స్ట్రుమెంట్ల మిశ్రమం ద్వారా రూ.8,000 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు బోర్డు ఆమోదించింది. మూలధనాన్ని బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్ వ్యాపార విస్తరణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో యూనియన్ బ్యాంక్ మెరుగైన పనితీరు చూపింది. నికర లాభం 29.6 శాతం పెరిగి రూ.5,332 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.4,116 కోట్లు. నికర వడ్డీ ఆదాయం 10 శాతం వృద్ధితో రూ.10,037 కోట్లకు పెరిగింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.9,113 కోట్లు. నిర్వహణ లాభం 15.8 శాతం పెరిగి రూ.8,003 కోట్లకు చేరుకోగా, గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.6,909 కోట్లు.ఆస్తుల నాణ్యతలో మెరుగుదల బ్యాంకు ఆస్తుల నాణ్యత కూడా మరింత మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తులు 2.82 శాతం నుంచి 2.65 శాతానికి తగ్గాయి.నికర నిరర్థక ఆస్తులు 0.48 శాతం నుంచి 0.47 శాతానికి స్వల్పంగా తగ్గాయి.కేటాయింపులు రూ.1,665 కోట్ల నుంచి రూ.979 కోట్లకు గణనీయంగా తగ్గాయి.

SIR Special Intensive Revision
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక సమగ్ర సవరణ)
జూన్ 25, 2026 నుండి
భారత ఎన్నికల సంఘం

**భారత ఎన్నికల సంఘం** అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులు జాబితాలో లేకుండా ఉండేందుకు **జూన్ 25, 2026** నుండి **స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)** నిర్వహిస్తుంది.



త్వరపడండి
నింపిన ఎన్యూమరేషన్ ఫారంలు మీ బిఎల్‌ఓకు 3 ఆగస్టు, 2026 లోపు అందజేయండి.

Enumeration Form

ఎన్యూమరేషన్ ఫారంలో మీ వివరాలను తెలియజేయండి
ఫారంలో మీ ప్రస్తుత ఫోటో జతచేసి పుట్టినతేది, ఆధార్ నంబరు (Optional), ఫోన్ నంబరు, మీ తల్లిదండ్రుల మరియు మీ భాగస్వామి యొక్క వివరాలను తెలపండి.
2002లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జాబితాలోని మీ తల్లిదండ్రుల లేదా మీ గ్రాండ్‌పేరెంట్స్ యొక్క వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో నింపవలసి ఉంటుంది. వివరాలకు https://voters.eci.gov.in లాగిన్ అయి వివరాలను పొందవచ్చును.

ఆన్‌లైన్ అప్‌డేషన్:
ఎన్యూమరేషన్ ఫారంను https://voters.eci.gov.in లో నింపి ఆ ఫారంను అప్‌లోడ్ చేసి ఎక్నాలెడ్జిమెంట్ బిఎల్‌ఓలకి అందజేయాలి.

Scan here for
ecinet.eci.gov.in
Website: https://voters.eci.gov.in / https://ecinet.eci.gov.in / https://www.eci.gov.in
వివరాలకు: బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించండి (BLO)/AERO/ERO/DEO
CEOTelangana CEOTelangana ChiefElectoralOfficerTelangana CEO_Telangana
వివరాలకు, టోల్‌ఫ్రీ 1950
ఉ॥ 10:30 - సా॥5:00 వరకు

మీ ఓటు.. మీ బాధ్యత
ఓటర్ల జాబితాలో మీ వివరాలను అప్‌డేట్ చేసుకోండి - పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.